www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శనివారం | 24-8-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 130 | వెల (Price) : Rs. 6.50
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: పంచమి ఉ. 7.52, షష్ఠి తె.5.30 వరకు; నక్షత్రం: అశ్విని సా. 6.06 తదుపరి భరణి; వర్జ్యం: మ. 2.24-3.52, తె. 3.09-4.40; దుర్ముహూర్తం: ఉ. 6.03-7.43; అమృతఘడియలు: ఉ. 11.26-12.55; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.31 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

గొళ్లెం లేని తలుపు.. ఐనా దారుణం!

హత్యాచారం కేసులో కొత్త వివరాలు
హాల్ తలుపు బోల్ట్ గతంలోనే విరిగింది
లోపల దారుణం జరుగుతుంటే బయట కాపలా కాశారా?
ఆక్రందనలు ఎవరికీ వినిపించలేదా?
పరిశీలిస్తున్న సీబీఐ
2 వారాల కస్టడీకి నిందితుడు
2



అనిల్ అంబానీపై సెబీ వేటు

నిధుల మళ్లింపు అంశంలో రూ.25 కోట్ల జరిమానా
ఐదేళ్లు మార్కెట్‌లో పాల్గొనకుండా నిషేధం
కుప్పకూలిన అడాగ్ షేర్లు
10



సర్పంచ్ సంయుక్తతో మాట్లాడుతున్న పవన్

"గత ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం ఎవరూ పోటీకి నిలబడలేని, ప్రతికూల పరిస్థితులు ఉండేవి. వాటిని ఎదిరించిన ఆర్మీ జవాన్ భార్య సంయుక్త పోటీలో నిలబడటమే కాకుండా.. గెలవడం ఆమె ధైర్యానికి నిదర్శనం. ఆమె ధైర్యం నన్ను కదిలించింది. అందుకే ఇక్కడ నిర్వహించిన గ్రామసభకు హాజరయ్యాను. ఇంట్లో ఆడపిల్ల చదివితే.. ఆ ఇంటితో పాటు దేశానికి కూడా వెలుగవుతుంది. పంచాయతీ నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన ద్రౌపది ముర్ము ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకం". - పవన్ కల్యాణ్

మా ప్రభుత్వ లక్ష్యం.. పంచాయతీల బలోపేతమే

ఆడబిడ్డల చదువుతో దేశానికి మేలు

రాష్ట్రానికి చంద్రబాబు అనుభవం అవసరం
ఆయనతో కలసి పనిచేయడం నామోషీ కాదు
గత ఐదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం
ఏటా నాలుగు గ్రామ సభలు నిర్వహించాలి
మైసూరివారిపల్లె గ్రామసభలో పవన్ కల్యాణ్
12

పల్లెలు పచ్చగా!

4,500 కోట్లతో 'ఉపాధి'

రాష్ట్రంలో 54 లక్షల కుటుంబాలకు తొమ్మిది కోట్ల పనిదినాల కల్పన
తద్వారా భారీగా ఉపాధి అవకాశాలు.. గ్రామాల అభివృద్ధికి రూ.2,100 కోట్లు
2014-19 మధ్య మాది స్వర్ణయుగం.. 2019-24 మధ్య వైసీపీది చీకటి రాజ్యం
వైసీపీ భూతం ఇంకా వెంటాడుతోంది.. దానిని భూస్థాపితం చేస్తేనే అభివృద్ధి
కోనసీమ జిల్లా స్వర్ణవానపల్లి గ్రామ సభలో సీఎం చంద్రబాబు ఉద్ఘాటన
1.20 గంటల పాటు ప్రసంగం.. నేరాలు చేస్తే 'హోదాలు' రావని వైసీపీకి చురక



కోనసీమ జిల్లా, స్వర్ణవానపల్లి గ్రామ సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

వచ్చే ఐదేళ్లలో పల్లె ప్రగతికి బాటలు..

17,500 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం	10,000 కిలోమీటర్ల మురుగు కాల్వల నిర్మాణం	2,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు	5,00,000 పంట కుంటల తవ్వకం
		4,00,000	ఉపాధి పనుల కల్పన

అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ సీమలకు తిరిగి పూర్వ వైభవం తేవడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఒకే రోజు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించామని తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజలకు ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి

మిగతా 12వ పేజీలో...

స్నేహితుడిలా సాయం చేస్తా

రష్యాతో చర్చలకు నా వంతుగా తోడ్పడతా
మాది తటస్థ వైఖరి కాదు.. శాంతి పక్షం

సమయం వృథా చేయొద్దు.. మాట్లాడుకోండి
జెలెన్‌స్కీ.. భారత్‌కు రండి.. మోదీ ఆహ్వానం
సాగు, ఆరోగ్యం, సాయంపై ఒప్పందాలు!
అమరుల స్మారకం వద్ద జెలెన్‌స్కీతో ఆలింగనం
ప్రధాని మోదీకి ప్రవాసుల ఘన స్వాగతం
శాంతికే మా ప్రాధాన్యం: జెలెన్‌స్కీ
యుద్ధం అంతానికి ఆశారేఖ: యూఎన్
అప్పుడు పుతిన్‌తో.. ఇప్పుడు జెలెన్‌స్కీతో మోదీ ఆలింగనం.. విమర్శలకు చెక్

శాంతి గీతం



కీవ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ

కీవ్, ఆగస్టు 23: "సమయం వృథా చేయొద్దు.. కూర్చొని మాట్లాడుకోండి. రష్యాతో మధ్యవర్తిత్వానికి నా వంతుగా తోడ్పడతా. శాంతి స్థాపనకు ఓ స్నేహితుడిలా సాయం చేస్తా. చర్చలు, దౌత్యం మాత్రమే సమస్యలకు పరిష్కారం" అని ప్రధాని మోదీ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సూచించారు. యుద్ధంపై భారత దేశం ఎప్పుడూ తటస్థ వైఖరితో లేదని.. తమది శాంతిపక్షం అని స్పష్టం చేశారు. పోలండ్ పర్యటనను ముగించుకుని ప్రత్యేక రైలులో శుక్రవారం ఉదయం ఉక్రెయిన్ రాజధాని కీవ్ చేరుకున్న మోదీ.. ఏడు గంటల పాటు అక్కడ ఉన్నారు. కీవ్ రైల్వే స్టేషన్‌లో ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో మోదీకి స్వాగతం పలికారు. అనంతరం అమరుల స్మారకం వద్ద జెలెన్‌స్కీ సాదరంగా స్వాగతించారు. కరచాలనం అనంతరం ఉక్రెయిన్ అధ్యక్షుడిని మోదీ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు. భరోసానిచ్చేలా.. భుజంపై గట్టిగా చేయివేసి సంభాషిస్తూ ముందుకు సాగారు. రష్యా దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారులకు

మిగతా 2వ పేజీలో...

లేఖలు ఇస్తే లక్షలు!

పాపం.. పుణ్యం



ప్రజాప్రతినిధులకు దళారుల ఎర

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా.. ఆగని ఆగడాలు
వైసీపీ ప్రభుత్వంలో జోరుగా లేఖల అమ్మకాలు
అదే ఒరవడి ఇప్పుడూ కొనసాగించే ప్రయత్నం
సిఫారసు లేఖల కోసం మంత్రులకు బ్రోకర్ల గేలం
ప్రతినెలా రూ.లక్షలు ఇస్తామని బంపర్ ఆఫర్లు
సీఎం దృష్టికి తెచ్చిన మహిళా మంత్రి, అధికారులు
దేవుడి దర్శన లేఖల అమ్మకంపై సీఎం దిగ్భ్రాంతి
ప్రలోభాలకు లొంగవద్దని నేతలకు హెచ్చరిక
3

"మీ కోటాకు వచ్చే శ్రీవారి దర్శన సిఫారసు లేఖలన్నీ మాకు ఇచ్చేయండి. ప్రతి నెలా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఇస్తాం. ఎప్పుడైనా మీకు స్వయంగా లేఖ అవసరమైతే... మాకు ముందే చెప్పండి"... కూటమి ప్రభుత్వంలో ఓ మహిళా మంత్రికి దళారులు ఇచ్చిన ఆఫర్ ఇది. సీఎం చంద్ర బాబుతో జరిగిన సమావేశంలోనే ఆమె ఈ విషయం చెప్పారు. ఇది.. దళారులు సాగిస్తున్న దందాకు ఒక ఉదాహరణ!



3

పిన్నెల్లికి బెయిల్

పలు షరతులు విధించిన హైకోర్టు
పాస్‌పోర్టు స్వాధీనం చేయాలి
వారానికోసారి పోలీస్ స్టేషన్‌కు..
కోరినప్పుడు విచారణకు రావాలి
కేసుపై మీడియాతో మాట్లాడొద్దు
షరతులు ఉల్లంఘిస్తే రద్దుకు చాన్స్

అగ్రి భూముల కేసులో జోగి కుమారుడికి బెయిల్ 3

ప్రాణం తీస్తున్న ఫార్మా

నిత్యం ప్రమాదాలు, మరణాలు
యాజమాన్యాలకు పట్టని నిబంధనలు

అధికారుల పర్యవేక్షణ పూజ్యం
జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన సెల్ఫ్ సర్టిఫికేషన్‌తో ఉద్యోగులకు ముప్పు
ఉమ్మడి విశాఖలో ఏటా ప్రమాదాలు
తెలంగాణలో వందలాది ఫార్మా కంపెనీలు
ఏపీతో పోలిస్తే ప్రమాదాలు చాలా తక్కువ
ఎసెన్షియా విషాదంపై సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు
రెండువారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

ఉమ్మడి విశాఖలో 2019 నుంచి 119 ప్రమాదాలు..120 మరణాలు



ఎసెన్షియాలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది(ఫైల్)
11



అనకాపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న జగన్

లోతైన విచారణ చేయాలి

ప్రమాదంపై ప్రభుత్వ స్పందన సరిగా లేదు: జగన్
నివేదికను తొక్కిపెట్టిన జగన్: షర్మిల

పరామర్శకు వెళ్లి గొప్పలా?

పనిలో పనిగా రాజకీయ విమర్శలు
జగన్ వ్యవహార శైలిపై ఆక్షేపణ
విస్తుపోయిన 'ఎసెన్షియా' బాధితులు
11

పని చేయని జీపీఎస్

ఎడారిలో దారి తప్పి.. నమాజ్ చేస్తూ మృత్యుఒడికి


షహేబాజ్ ఖాన్

» సహోద్యోగితో కలిసి సౌదీలో కరీంనగర్ యువకుడి దుర్మరణం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కనుచూపు మేరలో ఎటు చూసినా ఇసుక దిబ్బలు.. మండిపోతున్న ఎండకు తోడు అడుగు తీసి అడుగు వేయలేని స్థితి.. గమ్యం చేరాలంటే ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి.. జీపీఎస్ సిగ్నల్ పని చేయడం లేదు. బ్యాటరీ అయిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. ఎవరినైనా మార్గం అడుగుదామంటే మనిషి అనేవాడి జాడే లేదు. దారి వెతుక్కుంటూ అటు ఇటు తిరగడంతో కారులో ఉన్న కాస్త ఇంధనం కూడా ఖాళీ అయింది. దిక్కుతోచని స్థితిలో ఆకలిదప్పులను దిగమింగుకుని ఎడారిలో నాలుగు రోజులు పాటు గడిపిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు చివరకు నమాజ్ చేస్తూ ప్రాణం వదిలాడు. సౌదీ అరేబియాలోని అత్యంత ప్రమాదకరమైన రుబా అల్ ఖలీ అనే ఎడారిలో జరిగిన ఈ ఘటనలో కరీంనగర్‌కు చెందిన మొహమ్మద్ షహేబాజ్ ఖాన్(27) అత్యంత దయనీయ స్థితిలో మరణించాడు. కరీంనగర్‌కు చెందిన షహేబాజ్ సౌదీ అరేబియాలోని అల్ హాసా ప్రాంతంలోని ఒక టెలికం కంపెనీలో టవర్ టెక్నీషియన్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా సుడాన్‌కు చెందిన సహచర ఉద్యోగితో కలిసి షహేబాజ్ ఐదు రోజుల క్రితం కారులో ఓ చోటుకి వెళ్లాడు. ఈ క్రమంలో జీపీఎస్ సక్రమంగా పని చేయకపోవడంతో దారి తప్పి రుబా అల్ ఖలీ ఎడారికి చేరుకున్నారు. నాలుగు దేశాల్లో విస్తరించి ఉన్న ఈ ఎడారిలో దారి తప్పితే మరణమే శరణమ్మని స్థానికంగా నమ్ముతారు. ఈ ఎడారిలో ఒంటెలు ఉండవు కనీసం కాలినడకన కూడా ప్రయాణించలేం. అలాంటి భయంకరమైన ప్రాంతంలో ఇరుక్కుపోయిన షహేబాజ్ జీవితంపై ఆశలు వదులుకున్నాడు. తన కారు పక్కనే ఇసుకలో చాప (జనిమాజ్) పరిచి నమాజ్ చేస్తూ సహచరునితో కలిసి ప్రాణాలు కోల్పోయాడు. వీరి గల్లంతుపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు హెలికాప్టర్ల సాయంతో గాలించి.. నమాజ్ చేసే చాపపై పడి ఉన్న మృతదేహాలను కనుగొన్నారు.

విమానం నడిపిన అర్హతల్లేని పైలట్లు

» ఎయిర్ ఇండియాకు రూ.90 లక్షల జరిమానా

న్యూఢిల్లీ, ఆగస్టు 23: తగిన శిక్షణ, అర్హతల్లేని పైలట్లతో విమానాన్ని నడిపించినందుకు టాటా గ్రూపు ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా సంస్థకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) రూ.90 లక్షల జరిమానా విధించింది. ఇందుకు బాధ్యులను చేస్తూ ఎయిర్ ఇండియా ఆపరేషన్స్ విభాగం డైరెక్టర్ పంకుల్ మాథుర్‌కు రూ.6 లక్షలు, శిక్షణ విభాగం డైరెక్టర్ మనీష్ వాసవాడాకు రూ.3 లక్షల జరిమానా వేసింది. అర్హత లేని పైలట్లతో విమానాన్ని నడిపించినట్టు జులై 10న ఎయిర్ ఇండియాయే స్వచ్ఛందంగా ఓ నివేదిక రూపంలో డీజీసీఏ దృష్టికి తీసుకెళ్లింది. దాని ఆధారంగా దర్యాప్తు జరిపిన డీజీసీఏ ఇది తీవ్రమైన విషయమని, భద్రతకు ముప్పు కలిగిస్తుందని పేర్కొంటూ జరిమానా వేసింది.

వక్ఫ్ సవరణ బిల్లుకు నితీశ్ ఎర్ర జెండా

న్యూఢిల్లీ, ఆగస్టు 23: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు బీజేపీ మిత్రపక్షాల్లో కీలకంగా మారిన జేడీయూ కూడా ఎర్ర జెండా చూపింది. ఇప్పటికే లోక్ జన్‌శక్తి(రామ్ విలాస్) పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ ఈ బిల్లుపై ప్రశ్నలు సంధించారు. దీంతో బీజేపీ మిత్రపక్షాల్లోనే ఈ బిల్లును వ్యతిరేకించిన మరో పార్టీగా జేడీయూ నిలిచింది. ముస్లింల ప్రయోజనాలను కాపాడేందుకు బిల్లులో మార్పులు చేయాలని జేడీయూ అధినేత, బిహార్ సీఎం నితీశ్ కుమార్ డిమాండ్ చేసినట్టు తెలిసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బిహార్ రాష్ట్రంలో 18 శాతం వరకు ముస్లిం జనాభా ఉంది.

భారత్-అమెరికా రక్షణ బంధం బలోపేతం

వాషింగ్టన్, ఆగస్టు 23: రక్షణ శాఖకు సంబంధించి భారత్, అమెరికా రెండు కీలక ఒప్పందాలు చేసుకున్నాయి. రక్షణ పరికరాల సరఫరా(ఎస్‌వోఎస్‌ఏ), లైజన్ అధికారుల కేటాయింపునకు సంబంధించి మెమొరాండం ఆఫ్ అగ్రిమెంట్‌పై ఇరు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే లక్ష్యంతో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అమెరికాలో పర్యటిస్తున్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో తొలిరోజు గురువారం ఈ కీలక ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందాల ప్రకారం ఇరు దేశాలు రక్షణ విభాగానికి సంబంధించిన పరికరాలు, వస్తువులు, ఆయుధాలను ఇచ్చిపుచ్చుకుంటాయి. కాగా, రాజ్‌నాథ్ శుక్రవారం అమెరికా రక్షణ మంత్రి ఆస్టిన్ లాయిడ్‌తో పెంటగాన్‌లో భేటీ అయ్యారు.

బంగ్లాదేశ్ క్రికెటర్ షకీబ్‌పై హత్య కేసు



ఢాకా, ఆగస్టు 23: ప్రముఖ బంగ్లాదేశ్ క్రికెట్ క్రీడాకారుడు, ఆల్ రౌండర్ షకీబ్ అల్ హసన్‌పై హత్య కేసు నమోదయింది. ఆయన అవామీ లీగ్ పార్టీ మాజీ ఎంపీ కూడా కావడం గమనార్హం. ఈ నెల ఏడో తేదీన ఢాకాలోని రింగ్ రోడ్ వద్ద జరిగిన అల్లర్లలో తుపాకీ గుళ్లు తగిలి రుబెల్ అనే వ్యక్తి మరణించాడు. ఇందుకు అవామీ లీగ్‌దే బాధ్యత అని పేర్కొంటూ ఆ వ్యక్తి తండ్రి రఫీకల్ ఇస్లాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాంతో షకీబ్‌ను 28వ నిందితునిగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.ఇదే కేసులో ప్రముఖ సినీనటుడు, అవామీలీగ్ మాజీ ఎంపీ ఫిర్దౌస్ అహ్మద్‌ను 55వ నిందితునిగా పేర్కొన్నారు.

ట్రంప్ అధ్యక్షుడైతే తీవ్ర పరిణామాలు: కమల



వాషింగ్టన్, ఆగస్టు 23: రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ దేశాధ్యక్షుడైతే ప్రజలు అత్యంత తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి, ప్రస్తుత వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ హెచ్చరించారు. 2020లో ట్రంప్ మద్దతుదారులు అధ్యక్ష భవనంపై చేసిన దాడిని గుర్తు చేశారు. భారత్, ఆఫ్రికా మూలాలున్న కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ తరఫున దేశ అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని గురువారం రాత్రి అంగీకరించారు. ఈ సందర్భంగా షికాగోలోని డెమొక్రటిక్ నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో కీలక ప్రసంగం చేశారు. ట్రంప్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అలాగే, తాను అధ్యక్షురాలిగా ఎన్నికైతే అమెరికాను అగ్రరాజ్యంగా నిలబెట్టేందుకు ఏం చేస్తాననే అంశాలను వెల్లడించారు. తాను అధ్యక్షురాలినైతే అంతరిక్షం, ఏఐ రంగాల్లో దేశాన్ని అగ్రగామిగా చేస్తానని తెలిపారు.

'ఫెమినా మిస్ ఇండియా ఏపీ'గా భవ్యారెడ్డి



తిరుమలగిరి ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ లోతుకుంటకు చెందిన భవ్యా రెడ్డి ఫెమీనా మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2024గా ఎన్నికయ్యారు. ముంబైలో ఈ నెల 13న ఈ పోటీలు నిర్వహించగా, భవ్యా రెడ్డి ఎంపికైనట్టు నిర్వాహకులు ఈ నెల 18న ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌లోని లోతుకుంటలో పుట్టి పెరిగిన భవ్యా రెడ్డి ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీ చేసి ఫెమీనా మిస్ ఇండియాగా ఎంపికయ్యారు. బెంగళూరు లో నిర్వహించిన అందాల పోటీల్లో 29 రాష్ట్రాల యువతులతో పోటీ పడినప్పటికీ.. ముంబైలో ఈ నెల 13న నిర్వహించిన 'మిస్ ఫెమీనా ఇండియా ఆంధ్రప్రదేశ్ 2024' గా ఎంపికయ్యారు.

బెంగళూరులో పారిశ్రామికవేత్తలతో బాబు భేటీ

బెంగళూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబు శుక్రవారం రాత్రి బెంగళూరుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్ట్ సమీపంలోని తాజ్ హోటల్‌లో పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు చంద్రబాబును కలిసి ఫోరం 11వ వార్షికోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న 'నవ శకం - మంచి రోజులు వచ్చేశాయి' పేరిట వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారిని అభినందించారు. ఫోరం సభ్యులు శివ, కోకా కేశవ్, విష్ణు తదితరులు చంద్రబాబును కలిసిన వారిలో ఉన్నారు.

పాక్ భూభాగంలో పడ్డ భారత నిఘా డ్రోన్

న్యూఢిల్లీ, ఆగస్టు 23: భారత సైన్యానికి చెందిన నిఘా డ్రోన్ ఒకటి అదుపు తప్పి పాకిస్థాన్ భూభాగంలో పడిపోయింది. జమ్మూకశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నిఘా కోసం వినియోగిస్తున్న ఆ డ్రోన్ శుక్రవారం ఉదయం 9.30గంటల సమయంలో సాంకేతిక లోపంతో, పొరపాటున సరిహద్దు రేఖకు అవల, పాకిస్థాన్‌లోని నికియాల్ సెక్టార్‌లో పడిపోయింది. ఈ డ్రోన్‌ను పాక్ సైన్యం స్వాధీనం చేసుకుంది. ఈ ఘటనపై భారత సైనికాధికారులు పాకిస్థాన్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్(డీజీఎంవో) స్థాయి అధికారులతో సంప్రదింపులు జరపనున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. 2022లో భారత క్షిపణిని పరీక్షిస్తుండగా సాంకేతిక లోపం కారణంగా అది పాక్ భూభాగంలోకి వెళ్లి పడిన సంగతి తెలిసిందే. అప్పుడు పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇటీవల భారత వైమానిక దళానికి చెందిన విమానంలో సాంకేతిక లోపం తలెత్తి రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫైరింగ్ రేంజ్‌లో ఎయిర్ స్టోర్‌ను జారవిడిచింది. దీంతో, బాంబు పేలినట్లుగా భారీ శబ్దం వచ్చింది.

భార్యపై అనుమానంతో ఇంట్లో సీక్రెట్ కెమెరాలు!

» భర్తకు 3 నెలల జైలు.. తైవాన్‌లో ఘటన

తైవాన్, ఆగస్టు 23: భార్య వివాహేతర సంబంధాన్ని బయటపెట్టేందుకు ఓ భర్త చేసిన పని.. చివరికి అతడినే దోషిని చేసింది. ఇంట్లో రహస్య కెమెరాలు అమర్చినందుకు అతడికి కోర్టు 3 నెలల జైలు శిక్ష విధించింది. తైవాన్‌కు చెందిన ఫాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. చాన్నాళ్లు సాఫీగానే సాగిన ఫాన్ సంసారంలో 2022లో గొడవలు మొదలయ్యాయి. భార్య ప్రవర్తనలో మార్పు రావడంతో ఫాన్‌కు ఆమెపై అనుమానం కలిగింది. దీంతో తన ఇంటిలోని హాల్, బెడ్రూంలో రహస్యంగా కెమెరాలు అమర్చాడు. 2 వారాల తర్వాత అతడి అనుమానమే నిజమని తేలింది. అతడి భార్య మరో వ్యక్తితో ఏకాంతంగా కలిసున్న దృశ్యాలు కెమెరాలకు చిక్కాయి. ఫాన్ ఆ వీడియోలు చూపి భార్యతో గొడవపడ్డాడు. విడాకులు కావాలంటూ కోర్టుకెక్కాడు. అయితే, అతని భార్య.. భర్త తన అనుమతి లేకుండా ఇంట్లో రహస్య కెమెరాలు అమర్చి గోప్యతకు భంగం కలిగించాడని కేసు పెట్టింది. న్యాయమూర్తి ఫాన్‌నే తప్పుబట్టారు. ఇతరుల ప్రైవేటు కార్యకలపాలను చిత్రీకరించడం నేరమని పేర్కొంటూ ఫాన్‌కు 3 నెలల జైలు శిక్ష విధించారు.

స్నేహితుడిలా సాయం చేస్తా

(మొదటి పేజీ తరువాయి)

నివాళి అర్పించారు. వారి సంస్మరణార్థం ఓ బొమ్మను ఉంచారు. ఈ సంక్షోభం పిల్లల పాలిట వినాశకరమైనదని వ్యాఖ్యానించారు. యుద్ధంతో ఉక్రెయిన్ ఎంత తీవ్రంగా నష్టపోయిందో వివరించేలా మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను మోదీ వీక్షించారు. కీవ్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు విశ్వవ్యాప్తమని.. స్ఫూర్తిదాయకమని.. గాంధీ చూపిన బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు. ఆ తర్వాత జెలెన్‌స్కీతో మోదీ భేటీ అయ్యారు. సమావేశం ముగిశాక ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. యుద్ధానికి ముగింపు, న్యాయమైన శాంతి తమ ప్రాధాన్యం అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. కాగా, శాంతి ప్రయత్నాల్లో భారత్ చురుకైన పాత్ర పోషిస్తుందని మోదీ హామీ ఇచ్చారు.





జూలైలో రష్యా పర్యటనలో పుతిన్‌తో మోదీ ఆలింగనం, శుక్రవారం జెలెన్‌స్కీతో ప్రధాని మోదీ

యుద్ధం గురించే ప్రధానంగా..

మోదీ పర్యటనలో ఉక్రెయిన్‌తో నాలుగు ఒప్పందాలను కుదుర్చుకున్నారు. వ్యవసాయం, ఆహార పరిశ్రమ, ఔషధ, సాంస్కృతిక రంగాలు- మానవతా సాయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. కాగా, రక్షణ, వాణిజ్యం, వ్యవసాయ రంగాలపై ఇద్దరు నేతలు కీలక చర్చలు సాగించారు. ఉభయ దేశాలు త్వరలో దీనిపై సంయుక్త ప్రకటన చేయనున్నాయి. మరోవైపు ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, ఆర్థికం, రక్షణ, ఔషధ, వ్యవసాయం, విద్యారంగాలపై మోదీ, జెలెన్‌స్కీ చర్చించారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. చర్చల్లో యుద్ధం గురించే ఎక్కువ ప్రస్తావన ఉన్నట్లు కీవ్‌లో విదేశాంగ మంత్రి జైశంకర్ మీడియాకు తెలిపారు. సంక్షోభం సమసి శాంతి నెలకొనేందుకు ఉన్న మార్గాలను ఆరా తీశారని పేర్కొన్నారు. పరిష్కారానికి చర్చలే మార్గమని.. ఆ దిశగా సంప్రదింపులు సాగాలని అభిలషించారు. సాధ్యమైనంత త్వరగా శాంతి నెలకొనాలనేదే తమ ఉద్దేశమని జెలెన్‌స్కీకి మోదీ చెప్పారని ప్రకటించారు. పుతిన్‌తో జూలైలో జరిపిన చర్చల వివరాలను జెలెన్‌స్కీకి మోదీ వివరించారన్నారు.

శాంతి చర్చల్లో భారత్ పాత్రకు ఓకే

జెలెన్‌స్కీని భారత్‌లో పర్యటించాలని మోదీ ఆహ్వానించారు. ఈ విషయాన్ని జైశంకర్ తెలిపారు. జెలెన్‌స్కీ భారత్‌కు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మోదీ ఉక్రెయిన్ పర్యటనను చరిత్రాత్మకమని అభివర్ణించారు. కూలంకషంగా, నిర్మాణాత్మకంగా చర్చలు జరిగాయని ప్రకటించారు. మున్ముందు శాంతి చర్చల్లో భారత్ ప్రమేయం ఉండాలని ఉక్రెయిన్ కోరుతోందని జైశంకర్ వివరించారు. యుద్ధంతో తీవ్రగా దెబ్బతిన్న ఉక్రెయిన్‌కు మానవతా సాయంగా 22 టన్నుల వైద్య పరికరాలను భారత్ అందజేసింది. మందులు, శస్త్రచికిత్స పరికరాలతో కూడిన భీష్మ (భారత్ హెల్త్ ఇనీషియేటివ్ ఫర్ సహయోగ్ హిత అండ్ మైత్రి) క్యూబ్‌లను ప్రధాని మోదీ అందజేశారు. ఒక్కో క్యూబ్‌లో 200 రకాల ఔషధాలు ఉంటాయి.

యుద్ధం ముగింపునకు ఆశారేఖ

ఉక్రెయిన్‌లో మోదీ పర్యటన యుద్ధం ముగింపునకు తోడ్పడుతుందని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ అశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు దేశాల అధినేతలు ఉక్రెయిన్‌కు వెళ్లారని.. వీరందరి ప్రయత్నాలతో సంక్షోభం సమసిపోతుందనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. సమితి సాధారణ సభ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలు, ప్రాదేశిక సమగ్రత ప్రాతిపదికన సమస్యకు పరిష్కార దొరుకుతుందనే ఆకాంక్షను వెలిబుచ్చారు.

అప్పుడు పుతిన్‌తో.. ఇప్పుడు జెలెన్‌స్కీతో

మోదీ ఉక్రెయిన్ పర్యటనలో అందరినీ ఆకర్షించిన దృశ్యం.. జెలెన్‌స్కీని ఆలింగనం చేసుకోవడం. అయితే, జూలై 9న మోదీ రష్యాలో పర్యటన సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు పుతిన్‌ను ఇదేవిధంగా ఆలింగనం చేసుకున్నారు. దానిపై అప్పట్లో జెలెన్‌స్కీ మండిపడ్డారు. "రష్యా ఈ రోజు చేసిన దాడిలో పిల్లలు సహా 37 మంది చనిపోయారు. చిన్నారుల ఆస్పత్రులనూ వదలడం లేదు. ఇలాంటి సమయంలో ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశ నాయకుడు (మోదీ).. ప్రపంచంలోనే అత్యంత క్రూరుడి (పుతిన్) ఆలింగనం చేసుకున్నారు. శాంతి ప్రయత్నాలకు ఇది గట్టి దెబ్బ. తీవ్ర నిరాశాజనకం" అని అన్నారు. పాశ్చాత్య దేశాలు కూడా విమర్శలు చేశాయి. అయితే, అదే జెలెన్‌స్కీని మోదీ ఇప్పుడు ఆలింగనం చేసుకున్నారు. భుజంపై చేయివేసి భరోసాగా ఉంటామన్న అభిప్రాయం కల్పించారు. మరోవైపు తాజా పరిణామం జైశంకర్ మీడియా సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. "మా దేశంలో పలకరింపుల్లో ఆలింగనాలు సహజం. భారతీయ సంస్కృతిని చాటే విధానం ఇది" అన్నారు.

ఉక్రెయిన్‌కు వెయ్యి కోట్ల సాయం

న్యూయార్క్, ఆగస్టు 23: అమెరికాలోని బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్‌కు మరింత సాయం చేయాలని నిర్ణయించింది. 'కొత్త సైనిక సాయం' కింద 125 మిలియన్ డాలర్ల(సుమారు రూ.1047.61 కోట్లు) రక్షణ పరికరాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఇతర వ్యవస్థలను అందించనున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రష్యాతో యుద్ధం మరింత పెరిగిన నేపథ్యంలో ఉక్రెయిన్ పరిస్థితిని తాము అర్థం చేసుకున్నామని, అందుకే ఈ సాయం ప్రకటిస్తున్నామని ఆ వర్గాలు తెలిపాయి. ఈ నెల 24న(ఈరోజు) ఉక్రెయిన్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రకటన చేయడం విశేషం.

త్రిపురలో వరదలు..22 మంది మృతి

న్యూఢిల్లీ, ఆగస్టు 23: త్రిపురలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, ఫలితంగా సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన కారణంగా ఇప్పటివరకు 22మంది చనిపోయారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 17లక్షల మంది వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 65,400 మంది పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారు. 2032చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉందని, ప్రజలు సహాయ సిబ్బందికి సహకరించాలని సీఎం మాణిక్ సాహా కోరారు. త్రిపురలో సహాయ కార్యక్రమాల కోసం కేంద్రం రూ.40కోట్లు విడుదల చేసింది. సహాయ చర్యల్లో సైన్యం పాల్గొంటోంది.

కులం టార్గెట్ కాకపోతే అట్రాసిటీస్ చట్టం వర్తించదు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఎస్సీ, ఎస్టీ వ్యక్తులకు జరిగిన ప్రతీ అవమానం, బెదిరింపు వ్యాఖ్యలు ఆ వర్గాలపై అఘాయిత్యాల నిరోధక చట్టం కిందకు రాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. జస్టిస్ పీబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఒక కేసులో ఈ చట్టానికి సంబంధించి వ్యాఖ్యానం చేసింది. మరునాదన్ మలయాళీ యూట్యూబ్ చానెల్ ఎడిటర్ షాజన్ షకీరాపై ఇదే చట్టం కింద నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేసింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కేరళ ఎమ్మెల్యే శ్రీనిజన్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యానాలు చేస్తూ వీడియో అప్‌లోడ్ చేశారన్నది షాజన్‌పై అభియోగం.



నేపాల్‌లో బస్సు నదిలోకి దూసుకెళ్లి.. 27 మంది భారతీయుల మృతి

» 16 మందికి గాయాలు.. మృతులందరూ మహారాష్ట్ర వాసులే

» కాఠ్మాండూలోని తనహున్ జిల్లాలో ఘటన

కాఠ్మాండూ, ఆగస్టు 23: నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. పర్యటకులతో వెళ్తున్న ఓ ట్రావెల్స్ బస్సు నదిలోకి దూసుకెళ్లడంతో 27 మంది భారతీయులు మరణించారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా మహారాష్ట్రకు చెందిన వారుగా తెలుస్తోంది. మహారాష్ట్రకు చెందిన 104 మంది భక్తులు విహారయాత్ర కోసం పది రోజుల క్రితం మూడు బస్సుల్లో నేపాల్ వెళ్లారు. శుక్రవారం ఉదయం నేపాల్‌లోని పొఖారా నుంచి కాఠ్మాండూకు బయలుదేరారు. తనహున్ జిల్లా సమీపంలోని ఐరాపహర్ ప్రాంతంలో ప్రయాణికుల బస్సు అదుపుతప్పి 150 మీటర్ల మర్స్యంగ్డి నదిలో పడింది. ఆ సమయంలో బస్సులో 43 మంది ప్రయాణికులు ఉన్నారు. "ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నంబరు ప్లేట్‌తో ఉన్న ఓ ట్రావెల్స్ బస్సు కాఠ్మాండూలోని తనహున్ జిల్లా సమీపంలో నదిలో పడింది. కొండప్రాంతంలో అదుపుతప్పి 150 మీటర్ల లోతులోగల మర్స్యంగ్డి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదం 27 మంది మృతి చెందారు. సమాచారం అందుకున్న ఆర్మీ, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. 16 మందిని రక్షించాం. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాం" అని నేపాల్ అధికారులు తెలిపారు. కాగా, గత నెలలో కొండచరియలు విరిగిపడటంతో రెండు బస్సులు నదిలోకి దూసుకెళ్లిన ఘటనలో ఐదుగురు మరణించారు.

గొళ్లెం లేని తలుపు.. అయినా దారుణం!

కోల్‌కతా హత్యాచారం కేసులో కొత్త వివరాలు



» ఘటన జరిగిన సెమినార్ హాల్ తలుపు బోల్టు గతంలోనే విరిగిపోయినట్లు గుర్తింపు

» దారుణం జరుగుతుంటే ఎవరైనా కాపలా ఉన్నారేమోనని అనుమానాలు

కోల్‌కతా, ఆగస్టు 23: ఆర్జీ కర్ ఆస్పత్రిలో మహిళా జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసుకు సంబంధించి కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్పత్రి చెస్ట్ విభాగం సెమినార్‌హాల్‌లో దారుణం చోటు చేసుకున్న సంగతి ఇప్పటికే వెల్లడి కాగా, ఈ హాల్ తలుపునకు ఉన్న గొళ్లెం (టవర్ బోల్ట్) విరిగిపోయి ఉందని తాజాగా వెల్లడైంది. దర్యాప్తు చేస్తోన్న సీబీఐ దీనిపై ప్రధానంగా దృష్టి సారించింది. సెమినార్ హాల్ తలుపునకు ఉన్న టవర్ బోల్ట్ కొంతకాలం కిందటే విరిగిపోయిందని, దీనివల్ల ఆ తలుపు కూడా సరిగా మూసుకోదన్న సంగతి అక్కడ పని చేసే వైద్యులకు, సిబ్బందికి అందరికీ తెలిసిన విషయమేనని ఒక సీబీఐ అధికారి వెల్లడించారు. అటువంటప్పుడు సెమినార్‌హాల్‌లో మహిళా వైద్యురాలిపై అంత దారుణం ఎలా జరిగింది? అది జరుగుతున్నప్పుడు తలుపు బయట ఎవరైనా కాపలాగా నిల్చున్నారా? డాక్టర్ ఆక్రందనలు ఎవరికీ వినిపించలేదా? వంటి అంశాలను పరిశీలిస్తున్నామని ఆ అధికారి తెలిపారు. సెమినార్ హాల్‌లోకి బాధితురాలు ఆగస్టు 9వ తేదీ వేకువజామున 2-3 గంటల మధ్య వెళ్లి నిద్రకు ఉపక్రమించారని, ఆమె నిద్రలో ఉండటాన్ని తాను చూశానని అదే సమయంలో విధుల్లో ఉన్న ఒక డ్యూటీ డాక్టర్ తమకు చెప్పారని పేర్కొన్నారు. పీజీ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడినట్లుగా భావిస్తున్న ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్.. సెమినార్‌హాల్‌లోకి ఉదయం నాలుగు తర్వాత ప్రవేశించినట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ కేసుపై ప్రత్యేకంగా ఏర్పాటైన విచారణ కోర్టు సంజయ్‌రాయ్‌ని శుక్రవారం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపించింది. అతడిపై పాలీగ్రాఫ్ (లై డిటెక్టర్) టెస్ట్ జరపటానికి కూడా అనుమతించింది. సంజయ్‌రాయ్ మీద ఇప్పటికే డీఎన్ఏ, సైకోఎనాలిసిస్ టెస్టులు జరిపారు. ఆ నివేదికలు రావాల్సి ఉంది.

ఖాళీ అవుతున్న హాస్టళ్లు

పీజీ వైద్య విద్యార్థిని మీద జరిగిన దారుణ హత్యాచారం నేపథ్యంలో ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ క్యాంపస్ హాస్టళ్ల నుంచి మహిళా డాక్టర్లు పెద్ద సంఖ్యలో వెళ్లిపోతున్నారు. నర్సింగ్ హాస్టల్ మినహా ఇతర మహిళా హాస్టళ్లు అన్నీ దాదాపుగా ఖాళీ అయిపోయాయి. ఘటనకు ముందు హాస్టళ్లలో 160 మంది మహిళా జూనియర్ డాక్టర్లు ఉండేవారని, ప్రస్తుతం 17 మంది మాత్రమే ఉన్నారని ఒక జూనియర్ డాక్టర్ తెలిపారు. హత్యాచార ఘటనతోపాటు, ఆగస్టు 14వ తేదీ రాత్రి ఆస్పత్రిపై దుండగులు దాడి చేసి పెద్ద ఎత్తున విధ్వంసానికి పాల్పడిన నేపథ్యంలో.. తమ భద్రత పట్ల ఆందోళనతో పలువురు క్యాంపస్‌ను వీడి వెళ్తున్నారు.

అసోంలో బాలికపై గ్యాంగ్ రేప్

న్యూఢిల్లీ, ఆగస్టు 23: అసోంలోని నగాన్ జిల్లాలో 14 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేయడం స్థానికంగా ఆందోళనలకు దారితీసింది. ఆ బాలిక గురువారం సాయంత్రం ట్యూషన్ నుంచి ఇంటికి వెళుతుండగా ఈ ఘోరం చోటు చేసుకుంది. దీంతో రోడ్డు పక్కన అచేతనంగా పడివున్న బాలికను రక్షించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ కేసులో తఫజుల్ ఇస్లాం అనే నిందితుడిని అరెస్టు చేశారు. స్థానిక విద్యార్థి సంఘాలు దీనిపై భారీ ఎత్తున ఆందోళనలు నిర్వహించి బంద్‌కు పిలుపునిచ్చాయి.

భారత పౌరసత్వానికి గుడ్‌బై!

ఐదేళ్లలో విదేశీ పౌరులైన 8.34 లక్షల మంది

న్యూఢిల్లీ, ఆగస్టు 23: విదేశాల్లో మెరుగైన విద్య, ఉద్యోగావకాశాలు, వైద్య సదుపాయాలు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం వంటి కారణాలతో భారత పౌరసత్వం వదులుకుంటున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గడిచిన ఐదేళ్లలో 8.34 లక్షల మంది దేశ పౌరసత్వాన్ని వదులుకొని విదేశీ పౌరులుగా మారారు. కొవిడ్‌కు ముందు (2011-19) ఏటా సగటున 1.32 లక్షల మంది భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారు. ఆ తర్వాత 2020-23 మధ్య వీరి సంఖ్య 20శాతం పెరిగి సంవత్సరానికి 1.58 లక్షలకు చేరింది. భారత పాస్‌పోర్టుతో అనేక దేశాలకు ప్రయాణించడానికి వీసా తప్పనిసరి. అయితే అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల పాస్‌పోర్టులతో ప్రపంచంలో చాలా దేశాలకు వీసా రహిత ప్రయాణం చేయవచ్చనే భావన కూడా భారత పౌరసత్వాన్ని వదులుకోవడానికి దోహదం చేస్తోంది. దేశంలో ద్వంద్వ పౌరసత్వాన్ని అమలులోకి తెస్తే ఈ ధోరణికి అడ్డుకట్ట పడుతుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2018 నుంచి 2023 వరకూ భారతీయులు 114 దేశాల పౌరసత్వాన్ని పొందారు. వీరిలో చాలామంది అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, బ్రిటన్, జర్మనీలో స్థిరపడ్డారు. గత ఆరేళ్లలో 70 మంది పాకిస్థాన్ పౌరసత్వం స్వీకరించారు. విదేశాల్లో చదువుతున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో చైనా తర్వాత భారతీయులే (15లక్షల మంది) అత్యధికం.

ఇస్రో బంగారు బాతు!

ప్రతి రూపాయికీ 2.54 రెట్లు రాబడి

» అంతరిక్ష రంగంలో భారత్ ఘన విజయం

» ఫ్రాన్స్‌కు చెందిన 'నోవాస్పేస్' నివేదికలో వెల్లడి


బెంగళూరులోని నెహ్రూ ప్లానెటోరియంలో చంద్రయాన్ 3 నమూనాను పరిశీలిస్తున్న విద్యార్థులు

న్యూఢిల్లీ, ఆగస్టు 23: ఇస్రో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానానికి కేరాఫ్ అడ్రస్. ఇతర దేశాల కంటే తక్కువ ఖర్చులోనే రాకెట్ ప్రయోగాలు చేపడుతూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. అదే సమయంలో భారీ లాభాలను కూడా ఆర్జిస్తోంది. ఇస్రోపై పెట్టుబడిగా వెచ్చించిన ప్రతి రూపాయికీ 2.54 రెట్లు రాబడిగా వస్తోందని తాజా నివేదికలో వెల్లడైంది. ఫ్రాన్స్‌కు చెందిన నోవాస్పేస్ అనే సంస్థ 'సోషియో-ఎకనామిక్ ఇంపాక్ట్ అనాలసిస్ ఆఫ్ ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్' పేరిట ఈ నివేదికను రూపొందించింది. గ్లోబల్ టెండరింగ్ ప్రక్రియలో భాగంగా ఇస్రో ఈ నివేదికను రూపొందించే బాధ్యతను నోవాస్పేస్‌కు అప్పగించింది. ఇస్రో ఈ తరహా అధ్యయనం చేపట్టడం ఇదే తొలిసారి. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ నివేదికను శుక్రవారం విడుదల చేశారు. దీని ప్రకారం.. ఇస్రో సుమారు రూ.5లక్షల కోట్ల ఆర్థిక ప్రయోజనాలు, 47 లక్షల ఉద్యోగాలను సృష్టించింది. దీంతోపాటు రూ.2లక్షల కోట్ల విలువైన పన్ను ఆదాయాన్ని తీసుకొచ్చింది. 2014-2023 మధ్యకాలంలో భారత అంతరిక్ష రంగం జోడించిన స్థూల విలువ రూ.5లక్షల కోట్లు కాగా, వచ్చే పదేళ్లలో ఇది రూ.7.5లక్షల కోట్ల నుంచి రూ.11 లక్షల కోట్ల వరకూ పెరగొచ్చని తాజా నివేదిక అంచనా వేసింది. కాగా, అంతరిక్ష రంగంలో భారత్ ఘన విజయం సాధించిందని నోవాస్పేస్‌కు చెందిన నిపుణుడు స్టీవ్ బొషింగర్ అన్నారు. గత 55 ఏళ్లలో ఇస్రోపై భారత ప్రభుత్వం చేసిన ఖర్చు అమెరికాకు చెందిన నాసా ఏడాది బడ్జెట్ కంటే చాలా తక్కువేనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇస్రో వార్షిక బడ్జెట్ రూ.13 వేల కోట్లని, నాసా వార్షిక బడ్జెట్ దీనికంటే 15.5 రెట్లు అధికమని పేర్కొన్నారు. కాగా, జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా చంద్రయాన్-3 మిషన్ నుంచి సేకరించిన సైంటిఫిక్ డేటాను ఇస్రో శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రదాన్ పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతామని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ పేర్కొన్నారు. మరోవైపు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన స్వల్ప శ్రేణి బాలిస్టిక్ క్షిపణి పృథ్వీ-2 కచ్చితత్వంలో మరోసారి సత్తా చాటింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్‌కు రాత్రి సమయంలో నిర్వహించిన పరీక్ష విజయవంతమైంది. ఒడిసా తీరంలోని చాందీపూర్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుంచి గురువారం రాత్రి 7:46 గంటలకు డీఆర్‌డీవో సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో దీన్ని పరీక్షించారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చంద్రయాన్-3 సాధించిన ఘన విజయానికి ఏడాది పూర్తైన సందర్భంగా చేపట్టిన జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలను భారత్ ఘనంగా నిర్వహించింది. దీన్ని పురస్కరించుకుని ఇస్రో ఢిల్లీలో శుక్రవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా దేశ ప్రజలందరికీ ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్‌లో ఓ వీడియోను పోస్టు చేసిన ఆయన.. చంద్రయాన్-3 విజయంతో ఇస్రో దేశం గర్వించేలా చేసిందని ప్రశంసించారు.



శ్రీవారి సేవలో జస్టిస్ శ్యాంసుందర్

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాంసుందర్ తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శించుకున్నారు. - ఆంధ్రజ్యోతి, తిరుమల

దేవుడి ముందు దర్పం!

▸▸ 25 కిలోల బంగారు ఆభరణాలతో శ్రీవారి దర్శనానికి



తిరుమల ఆలయం ముందు నానాసాహెబ్ కుటుంబసభ్యులు

తిరుమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): భగవంతుని దర్శనానికి ఎంత ప్రముఖులైనా సామాన్య భక్తుల్లా వెళ్లడం ఆనవాయితీ. అన్యథా శరణం నాస్తి అంటూ వేడుకోవడం పరిపాటి. అయితే కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారి దర్శనానికి ఓ కుటుంబం మెడ, చేతులు, వేళ్ల నిండా బంగారు గొలుసులు, చైన్లు, కవచాలు, ఉంగరాలు ధరించి ఆడంబరంగా వచ్చింది. పూణేకు చెందిన సన్నీ నానాసాహెబ్ వాఘ్‌చౌరే, సంజయ్ దత్తాత్రేయ గుజర్, ప్రీతి సోనీ సుమారు 25 కిలోల బంగారు ఆభరణాలను ధరించి, స్టైలిష్ కళ్లజోళ్లు పెట్టుకుని శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. దాదాపు రూ.15 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు ధరించిన వీరు ప్రయాణించిన కారు కూడా బంగారు రంగులోనే ఉంటడం విశేషం.

ఏపీ వికాస తరంగణి కార్యాలయం ప్రారంభం

▸▸ ప్రారంభించిన హైకోర్టు జస్టిస్ శివశంకర్



జస్టిస్ శివశంకర్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న చిన్న జీయర్ స్వామి

తాడేపల్లి టౌన్, ఆగస్టు 23: తాడేపల్లిలోని సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆశ్రమంలో ఆంధ్రప్రదేశ్ వికాస తరంగణి ప్రధాన కార్యాలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో ప్రకృతి వైపరీత్యాల సమయంలో వికాస తరంగిణీ ముందుండి సహాయ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రేంజి ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠి, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, గ్రంధి కాంతారావు, విజయ డెయిరీ చైర్మన్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లేఖలు ఇస్తే లక్షలు!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తిరుమల శ్రీవారి దర్శనాన్ని వ్యాపారంగా మార్చేసిన గత ప్రభుత్వ ఒరవడి ఇంకా కొనసాగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కూడా కొండపై తిష్ఠ వేసుకొని కూర్చున్న దళారులు ఏమాత్రం వెనక్కు తగ్గడంలేదు. మంత్రుల సిఫారసు లేఖల కోసం పెద్ద మొత్తంలో ఇస్తామంటూ ఆఫర్లతో ప్రలోభపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని కొందరు వైసీపీ ప్రజా ప్రతినిధులు శ్రీవారి దర్శనాలకు సంబంధించిన లేఖలను అందిన కాడికి అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ వైసీపీ ఎమ్మెల్సీ కొండపైన విజిలెన్స్‌కు దొరికిపోయారు కూడా. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ దందా యథేచ్ఛగా సాగుతోందని ఆరోపణలొస్తున్నాయి. గతంలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి దళారులు అధిక రేట్లకు సిఫారసుల లేఖలను కొనుగోలు చేసేవారు. వాటిని ఉపయోగించుకుని సామాన్య భక్తుల వద్ద నుంచి భారీగా పిండేశారు. ఇప్పటికీ అదే ఒరవడి కొనసాగుతోంది.

దర్శనమా?... వ్యాపారమా?

టీటీడీ పాలక మండలి నియామకం కోసం అధికారులు, మంత్రులతో కలసి సీఎం ఇటీవల కసరత్తు చేశారు. ఈ సందర్భంగా సిఫారసు లేఖల అంశం చర్చకు వచ్చింది. గత ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేఖలను అమ్ముకున్నారని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. బేరాలు పెట్టి మరీ వారి నుంచి ఈ లేఖలను దళారులు కొనుగోలు చేసేవారని, తిరుమలలో ఇదో పెద్ద బిజినెస్‌గా మారిందని చెప్పడంతో సీఎం దిగ్భ్రాంతికి గురయ్యారు. చిత్తూరు జిల్లా నుంచి వచ్చిన ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి పట్ల అత్యంత భక్తితో ఉంటారు. టీటీడీ విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. అలాంటిది దర్శనాల లేఖలు అమ్ముకుంటున్నారన్న విషయం తెలియగానే ఆయన ఆశ్చర్యపోయారు. దర్శనం లేఖలు అమ్ముకోవడం ఏమిటని ప్రశ్నించారు. దేవుడి పట్ల భక్తిభావంతో ఉండాలి కానీ ఇలా వ్యాపారం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమావేశంలో ఉన్న ఓ మహిళా మంత్రి మరికొన్ని షాకింగ్ విషయాలు చెప్పారు. ఇటీవల తిరుపతి నుంచి కొంతమంది దళారులు తనవద్దకు వచ్చారని, ప్రతినెలా రూ.15లక్షల నుంచి రూ.20 లక్షలు ఇస్తామని, తన లేఖలు మొత్తం వారికి ఇవ్వాలని ఆఫర్ చేసినట్లు చెప్పారు. ఇప్పటికే కొంతమంది మంత్రులు తమ ఆఫర్‌కు అంగీకరించారని కూడా వారు చెప్పినట్లు వివరించారు. ఆ దళారులను మందలించి పంపేశానని, తాను ఇచ్చే లేఖలు ఒకటికి రెండుసార్లు పరిశీలించి, బాగా తెలిసిన వారికి మాత్రమే ఇస్తున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం... దేవుడి విషయంలో ఇది కరెక్టు కాదని, దీనిని కట్టడి చేయాలని ఆదేశించారు.

దగ్గరుండి మరీ ప్రొటోకాల్

గత ప్రభుత్వంలో సిఫారసు లేఖలను అమ్ముకొని డబ్బులు దండుకున్నారు. కొంతమంది సభ్యులకు టీటీడీ అధికారులు విచ్చలవిడిగా దర్శన టికెట్లు కేటాయించారు. మాజీ మంత్రులు కొందరు ప్రతిరోజూ తమతోపాటు పదుల సంఖ్యలో భక్తులను ప్రొటోకాల్ దర్శనాలకు తీసుకెళ్లేవారు. సిఫారసు లేఖలు పక్కదారి పడుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చినా వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అయితే ఆ దర్శనాలు ప్రజాప్రతినిధులకు తెలిసి జరుగుతున్నాయా లేక దళారులు లేఖలు సంపాదించుకుని అమ్ముకున్నారా? అన్న విషయంలో అనుమానాలు ఉండేవి. కానీ ఇప్పుడు అవన్నీ దళారుల ద్వారానే వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది. ఒక ఎమ్మెల్సీ సిఫారసు లేఖలను దళారులు అమ్ముకోవడం, వాటిని విజిలెన్స్ అధికారులు పట్టుకోవడం అప్పట్లో సంచలనం రేపింది. విచారణలో ఎమ్మెల్సీ వ్యక్తిగత సిబ్బంది ప్రమేయం ఉందన్న విషయం తెలియడం చర్చనీయాంశమైంది.

మేం ఇవ్వలేం...

టీటీడీ సిఫారసు లేఖల విషయంలో సీఎంవో అధికారులు అత్యంత జాగ్రత్తలు పాటిస్తున్నారు. ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి, జూనియర్ అధికారులు అసలు లేఖలు ఇవ్వడమే మానేశారు. బాగా పరిచయం ఉన్నవారు, వారు వ్యక్తిగతంగా వెళ్తానంటేనే ఒకటికి రెండుసార్లు ఆలోచించి ఇస్తున్నారు. మిగిలిన అధికారులు కూడా సీఎం చెప్పిన తర్వాత కొంత జాగ్రత్తపడ్డారు. ఆరోగ్యశాఖ మంత్రి కూడా బాగా తెలిసిన వారికే లేఖలు ఇస్తున్నారు. అదీ ఒకసారి తీసుకుంటే మళ్లీ ఏడాది వరకూ అడగడానికి వీల్లేదని ముందుగానే చెబుతున్నారు. దానికి అంగీకరిస్తేనే లేఖ ఇస్తున్నారు. మంత్రి నారాయణ కూడా తన నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు మాత్రమే లేఖలు ఇస్తామని, మిగిలినవారు ఎవరూ అడగొద్దని స్పష్టంగా చెప్పేస్తున్నారు. మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా టీటీడీ లేఖల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సీఎంవో నుంచి సూచనలు వెళ్తున్నాయి.

సీఎంఏ ఫలితాల్లో సత్తాచాటిన మాస్టర్‌మైండ్స్



తేజశ్విని, లక్ష్మీనారాయణ

గుంటూరు(విద్య), ఆగస్టు 23: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ కళాశాల విద్యార్థిని కే తేజశ్విని జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్టు తెలిపారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం మన్నెమడుగు గ్రామానికి చెందిన ఈ విద్యార్థిని సీఎంఏలో అత్యంత ప్రతిభ చూపిందన్నారు. ఇటీవల ప్రకటించిన సీఏ ఫైనల్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 14వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. మరో విద్యార్థి ఎంవీ లక్ష్మీనారాయణ సీఎంఏ ఇంటర్‌లో జాతీయ స్థాయిలో 3వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఏపీ మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పూర్తి చేసి ఇంటర్ ఎంఈసీ చదువుతున్నట్టు తెలిపారు. ఈ విద్యార్థి సీఏ ఇంటర్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 38వ ర్యాంకు సాధించాడన్నారు.

మస్కట్‌లో విశాఖ మహిళకు చిత్ర హింసలు

▸▸ ఇంటి యజమాని నుంచి వేధింపులు

▸▸ ఆదుకోవాలని బాధితురాలి కుమార్తె అభ్యర్థన

▸▸ మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు



భవానీ

మల్కాపురం (విశాఖపట్నం) ఆగస్టు 23: మస్కట్‌లోని సుహర్‌లో యజమాని వేధింపులనుంచి తన తల్లిని రక్షించి, దేశానికి రప్పించాలని ఆమె కుమార్తె విశాఖ నగరంలోని మల్కాపురం పోలీసులను శుక్రవారం ఆశ్రయించారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. విశాఖలోని శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన సెల్వకేశ్వన్ భవాని గతంలో ఓసారి విదేశాలకు వెళ్లి ఉద్యోగం చేసి, కొన్నేళ్ల తరువాత తిరిగి వచ్చారు. ఈ నేపథ్యంలో ఏజెంట్లుగా చెప్పుకొంటున్న రజనీకాంత్, లక్ష్మితో ఆమెకు పరిచయం ఉంది. ఈ ఇద్దరూ మాస్కట్‌లో ఇంటి పనులున్నాయని చెప్పి భవానీని జూన్‌లో తీసుకువెళ్లారు. అక్కడికి వెళ్లిన తరువాత ఓ కార్యాలయంలో రెండు నెలలపాటు ఉంచేశారు. ఈ కాలానికి వేతనం ఇవ్వకపోగా సరిగ్గా భోజనం పెట్టేవారు కాదు. తర్వాత సుహర్ అనే ప్రాంతంలో ఓ ఇంట్లో పనిలో కుదిర్చారు. ఆ యజమాని భవానీని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తుండడంతో ఫోన్‌లో ఆమె తన కుమార్తెకు గోడు వెళ్లబోసుకుంది. యజమాని తనను తీవ్రంగా కొడుతున్నాడని, ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, తిరిగి భారత్‌కు తీసుకువచ్చేలా ప్రయత్నించాలని తెలిపింది. ఈ నేపథ్యంలో ఏజెంట్లు రజనీకాంత్, లక్ష్మిని సంప్రదించగా, డబ్బు పంపిస్తే విమాన టికెట్ బుక్ చేస్తామని చెప్పడంతో జ్యోతి రూ.70 వేలు పంపింది. అయితే ఏజెంట్లు డమ్మీ ఫ్లైట్ టిక్కెట్ పంపి మోసం చేశారని ఆరోపించింది. దీనిపై నిలదీస్తే సరైన సమాధానం రాకపోవడంతో మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఏజెంట్లపై కేసు నమోదు చేశారు. తన తల్లిని తిరిగి భారత్‌కు రప్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని జ్యోతి అభ్యర్థిస్తోంది.



అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.లక్ష విరాళం చెక్కును వర్మకు అందజేస్తున్న చక్కా నాగ సీతమణి

అన్న క్యాంటీన్‌కు వృద్ధురాలి రూ.లక్ష విరాళం

పిఠాపురం, ఆగస్టు 23: పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అదే సమయంలో అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళాలు ఇచ్చేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా నాగ సీతమణి తన పుట్టినరోజు సందర్భంగా రూ.లక్ష విరాళాన్ని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సమక్షంలో మునిసిపల్ అధికారులకు అందజేశారు. అన్న క్యాంటీన్‌లో శుక్రవారం భోజనాల ఖర్చు కూడా ఆమె ఇచ్చారు. ఈ సందర్భంగా వర్మ ఆమెను అభినందించారు. పేదవారికి కడుపునిండా అన్నం పెట్టేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

ఏపీపీలు, ఎస్‌పీపీపై సర్కారు వేటు

▸▸ ఎన్నికల్లో వైసీపీకి ప్రచారం ఫలితం

విజయవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కొద్దినెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి వత్తాసు పలకడంతోపాటు ఆ పార్టీ తరఫున ప్రచారం నిర్వహించిన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పై ప్రభుత్వం వేటు వేసింది. వారిని విధుల నుంచి తొలగిస్తున్నట్టు హోంశాఖ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. విజయవాడ ఏసీబీ కోర్టు ఏపీపీ బాయన కామరాజు వెంకట రమణి, మూడో అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ జంగా జయలక్ష్మి, మొదటి అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ వేల్పుల కోటయ్య, 14వ అదనపు జిల్లా జడ్జి, అడిషనల్ ఫ్యామిలీ కోర్టు ఏపీపీ గడ్డం జయరాం, 13వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ యక్కంటి పుల్లారెడ్డి, పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుజ్జుల నాగిరెడ్డి, మహిళా సెషన్స్ జడ్జి, ఐదో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ సీహెచ్ విష్ణువర్ధనరావును ఆయా పదవుల నుంచి తొలగించింది. ఈ ఏడుగురికి వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు వచ్చాయి. ఆ రుణాన్ని తీర్చుకోవడానికి సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ప్రచారం చేశారు. కొంతమంది నేరుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ద్వారా విచారణ చేయించింది. డీవోపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆరుగురు ఏపీపీలు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌పై ప్రభుత్వం వేటు వేసింది.

రోడ్లపై నీళ్లు నిల్వ ఉండకూడదు

▸▸ పశువులు, పందులు కనపడకూడదు: మంత్రి నారాయణ

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో రోడ్లపై ఎక్కడా నీరు నిల్వ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను మంత్రి నారాయణ ఆదేశించారు. సీడీఎంఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. విజయవాడలో కురిసిన వర్షానికి రోడ్లపై భారీగా నీరు నిలవడానికి గల కారణాలపై కమిషనర్ ధ్యాన్‌చంద్రను అడిగి తెలుసుకున్నారు. అన్ని మున్సిపాలిటీల్లో రోడ్లు, తాగునీరు, మురుగు కాలువలు, పార్కులు, వీధి దీపాలపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. అనుమతి లేని లేఅవుట్‌ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. అవసరమైతే భారీగా పెనాల్టీ విధించే ఆలోచన చేస్తామన్నారు. పట్టణాల్లో కుళాయి కనెక్షన్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. వచ్చే 15 రోజుల్లోగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో రోడ్లపై పశువుల సంచారం లేకుండా చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు 30వ తేదీ నాటికి పందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేదల గృహాల కోసం నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు.

విద్యుత్తు సంస్థలో ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలి: జేఏసీ

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని విద్యుత్తు కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. విజయవాడలో విద్యుత్తు కార్మిక భవన్‌లో శుక్రవారం జరిగిన ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో జేఏసీ చైర్మన్ ఎస్. కృష్ణయ్య, కన్వీనర్ రామువరెడ్డి, కోచైర్మన్ శేషారెడ్డి మాట్లాడారు. కొత్త సర్వీస్ రెగ్యులేషన్స్. జేవీఎం గ్రేడ్ 2లకు కూడా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. 2004 ఆగస్టు 31 వరకూ ఉన్న ఉద్యోగులందరికీ ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ చేయాలన్నారు. వేతన సవరణ సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను సవరించాలని.. తదితర డిమాండ్లు చేశారు. సమావేశంలో ఓసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌తో సహ 22 సంఘాల నేతలు పాల్గొన్నారు.

వేమన వర్సిటీ ఇన్‌చార్జి వీసీని తొలగించాలి

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్న కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డిని తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్సిటీ ప్రతిష్ఠను మంటగలిపే విధంగా ప్రవర్తిస్తున్న ఆయనపై ఏసీబీ విచారణ కూడా జరిగిందని శుక్రవారం ఒక ప్రకటనలో వివరించారు.

ఉత్తర కోస్తాకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉత్తర బంగాళాఖాతంలో శుక్రవారం సముద్రమట్టానికి 5.8 కి.మీ. ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. ఇంకా ఎండ తీవ్రత, ఉక్కపోతతో వాతావరణ అనిశ్చితి నెలకొనడంతో పలుచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తా, రాయలసీమలో ఎండ తీవ్రత కొనసాగింది. శుక్రవారం కడపలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఉత్తరకోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఉత్తరకోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించింది. అయితే ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం లేదా ఆదివారం అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు.

ఫేక్ డాక్యుమెంట్ల సృష్టికర్త తమ్మినేని

▸▸ ఇతరుల ఆస్తులకూ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించారు

▸▸ ఆయన ఫేక్ డిగ్రీని అంబేడ్కర్, ఉస్మానియా వర్సిటీలు ధ్రువీకరించాయి

▸▸ మాజీ స్పీకర్ అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు చేయాలి: కూన రవికుమార్

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్టే కాదు.. ఆస్తులకూ ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకి అలవాటే' అని టీడీపీ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. శుక్రవారం అమరావతి అసెంబ్లీలోని టీడీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ్మినేని సీతారాంపై సంచలన ఆరోపణలు చేశారు. తమ్మినేని అక్రమాలపై దర్యాప్తు కోసం స్పెషల్ టీం వేయాలని సీఎం చంద్రబాబును కోరతానన్నారు. సీతారాం ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్లపై తాను 2022లోనే మాట్లాడానన్నారు. స్పీకర్‌గా విలువలతో వ్యవహరించాల్సిన వ్యక్తి.. స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత ఫేక్ డిగ్రీ సర్టిఫికెట్ల ఆధారంగా హైదరాబాద్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలో అడ్మిషన్ తీసుకున్నారన్నారు. ఆయన ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్లలో ఎక్కడా డిగ్రీ పట్టా పొందినట్లు పేర్కొనలేదన్నారు. ఇంటరే తన హయ్యెస్ట్ క్వాలిఫికేషన్ అని చెప్పారన్నారు. అయితే 2018లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుంచి డిగ్రీ పొందానని ఫేక్ సర్టిఫికెట్ తయారు చేశారన్నారు. ఆర్టీఐ యాక్ట్ ద్వారా ఆ యూనివర్శిటీని అడిగితే ఆయన డిగ్రీ సర్టిఫికెట్‌లో పేర్కొన్న రిజిస్టర్ నంబర్‌తోగానీ, పరీక్ష రాసినట్లు పేర్కొన్న సెంటర్ నంబర్‌లోగాని సీతారాం పరీక్ష రాయలేదని తెలిపారన్నారు. ఆయన దొంగ సర్టిఫికెట్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫేక్ సర్టిఫికెట్లపై రాష్ట్రపతి, తెలంగాణ గవర్నర్, ఏపీ గవర్నర్లకు ఫిర్యాదు చేశానన్నారు. ఆనాటి సీఎం జగన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. హైకోర్టు సీజేకూ ఫిర్యాదు చేశానని అయితే ఎవరి దగ్గర నుంచి స్పందన రాలేదని, రాష్ట్రపతి కార్యాలయం నుంచి రిప్లయ్ వచ్చిందన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎస్‌కు పంపారన్నారు. తమ్మినేని ఫేక్ డిగ్రీ వ్యవహారాన్ని అంబేడ్కర్, ఉస్మానియా యూనివర్శిటీలు ధ్రువీకరించాయన్నారు. తమ్మినేని ఫేక్ డిగ్రీపై సీబీఐతో విచారణ జరిపించాలని, దీనిపై త్వరలోనే సీబీఐ చీఫ్‌ను కలుస్తానని చెప్పారు. సీఎస్ విచారించి చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానన్నారు. నాగావళి నదిలో ఒక మిషన్‌తో టాంపర్డ్ వే బిల్లులు సృష్టించి, ఇసుక తవ్వకాల్లోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే ఫిర్యాదు చేశానని తెలిపారు. తమ్మినేని సీతారాంకు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించడం అలవాటేనని, ఆమదాలవలసలో ఒక స్థలానికి చనిపోయిన వ్యక్తి పేరుతో ఫేక్ డాక్యుమెంట్ సృష్టించి, కోర్టులో వేస్తే, ఫేక్ డాక్యుమెంట్ సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోర్టు చెప్పిందన్నారు. మరో 16,17 ఇతరుల ఆస్తుల పైనా తమ్మినేని ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించారని, దీనిపై శ్రీకాకుళంలోని వివిధ కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయని తెలిపారు. ఆయన సభ్య సమాజంలో కూడా ఉండడానికి అనర్హుడన్నారు.

చంద్రబాబు, పవన్‌పై అభ్యంతరకర పోస్టులు

▸▸ సహకార ఉద్యోగి సస్పెండ్

కొవ్వూరు, ఆగస్టు 23: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై ఫేస్‌బుక్‌లో అభ్యంతరకర వ్యాఖ్యలు, పోస్టులు చేసినందుకు తూర్పు గోదావరి జిల్లాలో సహకారశాఖ ఉద్యోగిని సస్పెండ్ చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొవ్వూరు పట్టణానికి చెందిన పి.వి.వి.రవిశంకర్ కో ఆపరేటివ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. గతేడాది మే 17న ఆయన్ను విజయవాడకు బదిలీ చేసినా నేటికీ విధుల్లో చేరలేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అసభ్యకర పోస్టులు పెట్టడమే కాకుండా.. గతంలో మలకపల్లి, అన్నదేవరపేట, చిన్నాయిగూడెం, చాగల్లు సొసైటీల్లో పర్సన్ ఇన్‌చార్జిగా చేసిన సమయంలో అవినీతికి పాల్పడినట్టు కొవ్వూరుకు చెందిన టీడీపీ నాయకుడు పాలెంపాటి చినబాబు చౌదరి సహకార శాఖ, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. అదే విధంగా రవిశంకర్ అవినీతిపై కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన పరిమి సోమరాజు కూడా ఏడాది కిందట శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. దీనిపైనా విచారణ చేపట్టిన అధికారులు ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీస్ ప్రవర్తనా నియమావళి 1964కు వ్యతిరేకంగా ప్రవర్తించిన రవిశంకర్‌ను సస్పెండ్ చేస్తూ సహకారశాఖ కమిషనర్ ఉత్తర్వులు విడుదల చేశారు.

పిన్నెల్లికి బెయిల్

పలు షరతులు విధించిన హైకోర్టు

▸▸ పాస్‌పోర్టును స్వాధీనం చేయాలి

▸▸ వారానికోసారి పోలీస్ స్టేషన్‌కు రావాలి

▸▸ కోరినప్పుడు విచారణకు హాజరవ్వాలి

▸▸ సాక్షులను ప్రభావితం చేయడం బెదిరించడం కానీ చేయడానికి వీల్లేదు

▸▸ కేసుపై మీడియాతోనూ మాట్లాడొద్దు

▸▸ షరతులు ఉల్లంఘిస్తే రద్దు చేసే చాన్స్



అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.50 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించింది. చార్జిషీట్ దాఖలు చేసే వరకు వారానికి ఓసారి సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌వో) ముందు హాజరుకావాలని స్పష్టం చేసింది. అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదని, పాస్‌పోర్టును సంబంధిత మేజిస్ట్రేట్ ముందు స్వాధీనం చేయాలని ఆదేశించింది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు విచారణకు హాజరుకావాలని పేర్కొంది. సాక్షులను ప్రభావితం చేయడం కానీ, బెదిరించడం కానీ చేయడానికి వీల్లేదని తేల్చిచెప్పింది. కేసుకు సంబంధించి మీడియాతో మాట్లాడానికి వీల్లేదని స్పష్టం చేసింది. జైలు నుంచి విడుదలైన తర్వాత ఎక్కడ నివాసం ఉంటున్నదీ, మొబైల్ నంబర్ వివరాలను దర్యాప్తు అధికారులకు తెలియజేయాలని ఆదేశించింది. బెయిల్ షరతులు ఉల్లంఘించినప్పుడు, అలాంటి పరిస్థితులు తలెత్తినప్పుడు బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించేందుకు పోలీసులకు హైకోర్టు స్వేచ్ఛనిచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు శుక్రవారం తీర్పు ఇచ్చారు.

న్యాయవాది ఎందుకు?

న్యాయమూర్తి తీర్పు వెలువరించిన తర్వాత పిన్నెల్లి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఎస్‌హెచ్‌వో విచారణకు హాజరుకావాలనప్పుడు పిటిషనర్(పిన్నెల్లి) తన న్యాయవాదిని తీసుకెళ్లేందుకు అనుమతించాలని అభ్యర్థించారు. అయితే, దీనికి ప్రత్యేకంగా పిటిషన్ వేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. ఇదేసమయంలో "అసలు న్యాయవాది ఎందుకు? పోలీసులు నిందితుడిని ప్రశ్నిస్తుంటే.. న్యాయవాదులు సమాధానం చెబుతున్నట్టు పత్రికల్లో చదివాను" అని వ్యాఖ్యానించారు.

ఇదీ కేసు

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మే 13న మాచర్లలోని పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్‌లను పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ధ్వంసం చేశారు. ఈ సమయంలో ఆయనను అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి చేశారు. పోలింగ్ బూత్ నుంచి బయటకు వస్తున్న సమయంలో ప్రశ్నించిన నాగశిరోమణి అనే మహిళను దూషించారు. ఆయా ఘటనలకు సంబంధించి పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు పిన్నెల్లి సహా ఆయన అనుచరులు మరో 15 మందిపై హత్యాయత్నం(ఐపీసీ 307) సహా మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అదేవిధంగా మే 14న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి, వారి అనుచరులు కారంపూడిలో దాడులకు పాల్పడుతుండగా అడ్డుకోబోయిన సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచారు. సీఐ ఫిర్యాదుతో వీరిపై పోలీసులు హత్యాయత్నం, మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుల్లో అరెస్ట్ అయిన రామకృష్ణారెడ్డి ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఇటీవల గురజాల కోర్టును ఆశ్రయించగా న్యాయాధికారి తిరస్కరించారు. దీంతో పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు.

నిందితుడిని అడిగితే మీరెలా జవాబిస్తారు?

▸▸ అవసరమైన డాక్యుమెంట్లు ఇవ్వడం వరకే మీ పాత్ర

▸▸ జోగి రమేశ్ పిటిషన్ విచారణలో పొన్నవోలుకు హైకోర్టు ప్రశ్నలు

▸▸ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

▸▸ సెప్టెంబరు 3న తీర్పు వెల్లడిస్తానన్న న్యాయమూర్తి

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): దర్యాప్తు అధికారి ప్రశ్నలకు నిందితుడితో పాటు వెళ్లిన న్యాయవాది ఎలా సమాధానం చెబుతారని జోగి తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రశ్నలు విని అవసరమైన డాక్యుమెంట్లు అందజేసే వరకే న్యాయవాది పాత్ర ఉండాలని పేర్కొంది. నిందితుడిని ప్రశ్నిస్తుంటే న్యాయవాది సమాధానం చెప్పడంపైనే ప్రాసిక్యూషన్ అభ్యంతరం తెలుపుతున్నారని గుర్తు చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై మూకదాడి వ్యవహారంలో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మాజీ మంత్రి జోగి రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు ముగియడంతో సెప్టెంబరు 3న తీర్పు వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కె కృపాసాగర్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. తీర్పు వెల్లడించేవరకు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. అంతకు ముందు పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు వాదనలు వినిపిస్తూ.. గత ఇరవై ఏళ్లుగా పిటిషనర్ ఒకటే నంబర్ వాడుతున్నారన్నారు. ఎఫ్ఐఆర్‌లో ఉన్న సమాచారానికి అదనపు వివరాలు చేర్చి పోలీసులు కేసును ఇంప్రూవ్ చేస్తున్నారన్నారు. సహకరించడం అనే పదానికి అర్థం తెలియడం లేదన్నారు. దర్యాప్తు అధికారి అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబితేనే దర్యాప్తునకు సహకరించినట్లా అని ప్రశ్నించారు. సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా, పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ... దర్యాప్తు అధికారి ప్రశ్నించేటప్పుడు నిందితుడి తరఫు న్యాయవాది జోక్యం చేసుకోవడానికి వీల్లేదన్నారు. ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పుడు పిటిషనర్ వాస్తవాలను కోర్టు ముందు ఉంచాలన్నారు. పిటిషనర్ అందుకు విరుద్ధంగా వ్యవహరించారని వాదించారు. పిటిషనర్ అతని అనుచరులతో కలిసి 15కిలోమీటర్లు ప్రయాణించి చంద్రబాబు ఇంటి పైకి దాడికి వచ్చారని, తమ లీడర్‌ను తిట్టారని ఇతర నివాసాలపై దాడి చేయడానికి రావడం సరికాదని అన్నారు.

జోగి కుమారుడికి బెయిల్

విజయవాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీఐడీ జప్తులో ఉన్న అగ్రిగోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్న కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ కుమారుడు రాజీవ్‌కు విజయవాడ ఏసీబీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయాధికారి హిమబిందు శుక్రవారం తీర్పును వెలువరించారు. ఈనెల 13వ తేదీన ఏసీబీ అధికారులు రాజీవ్‌తోపాటు విజయవాడ రూరల్ మండలం సర్వేయర్ రమేష్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరికీ షరతులతో కూడిన బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. ప్రతి రెండో శనివారం ఏసీబీ కార్యాలయానికి వెళ్లి సంతకం చేయాలని, విదేశాలకు వెళ్లేటప్పుడు కోర్టుకు సమాచారం ఇవ్వాలని, నివాస చిరునామాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను కోర్టుకు అందజేయాలని షరతులు విధిస్తూ రాజీవ్, రమేష్‌లకు బెయిల్ మంజూరు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి–దౌత్యం

గత నెలలో భారత ప్రధాని నరేంద్రమోదీ రష్యాలో పర్యటించి ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను గాఢంగా ఆలిగనం చేసుకున్నారు. ఆరువారాల అనంతరం ఇప్పుడు తన పర్యటనలో పోలెండ్ నుంచి రైల్లో వెళ్ళి ఉక్రెయిన్ అధ్యక్షుడిని కూడా అదే తీరున గాఢంగా కౌగలించుకున్నారు. సన్నిహితులని తాను అనుకొనే విదేశీప్రముఖులతో భేటీ అయిన సందర్భాల్లో భారత ప్రధాని ఈ తీరున వారిపట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించడం పదేళ్ళుగా చూస్తున్నదే. కానీ, దాదాపు రెండున్నరేళ్లుగా యుద్ధంలో పరస్పరం కత్తులు దూసుకుంటున్న పుతిన్–జెలెన్‌స్కీలు ఇద్దరినీ నరేంద్రమోదీ కొద్దిరోజుల తేడాలో ఒకేలా అక్కున చేర్చుకోవడం అనేకులను ఆకర్షిస్తున్నది. వారిద్దరి ప్రతిస్పందనల్లో ఎంతో తేడా ఉన్నా, మోదీ మాత్రం ఒకేవిధంగా వ్యవహరించారని కొందరు మెచ్చుకుంటున్నారు.

రష్యాలో నరేంద్రమోదీ ఉన్నసమయంలోనే ఉక్రెయిన్‌లోని పిల్లల ఆస్పత్రిమీద బాంబుదాడులు జరిగి పెద్దసంఖ్యలో పిల్లలు మరణించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు ఎంతో తెలివిగా ధ్వంసమైన ఆస్పత్రి ఫోటోలను ట్విటర్‌లో పోస్టుచేస్తూ, అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాధినేత ఓ క్రూరుడైన నేరగాడిని కౌగలించుకున్న ఘట్టం అంటూ పుతిన్–మోదీ ఆలింగనాన్ని ఉటంకించారు. మోదీ రష్యా పర్యటన శాంతియత్నాలకు తీవ్ర విఘాతమని కూడా జెలెన్‌స్కీ దెప్పిపొడిచారు. రష్యాతో యుద్ధం మొదలైన తరువాత జెలెన్‌స్కీ భారతదేశాన్ని నేరుగా తప్పుబట్టడం అదే తొలిసారి. ముచ్చటగా మూడోసారి ప్రధాని అయిన తరువాత నరేంద్రమోదీ తన తొలిపర్యటనకు పొరుగు దేశాలను కాక రష్యాను ఎంచుకుంటే, అది ఎందుకో అంతగా కలిసిరాలేదు. ఇప్పుడు జెలెన్‌స్కీ ప్రవర్తన కాస్తంత గంభీరంగా, భిన్నంగా కనిపించినప్పటికీ మోదీ దానిని గుర్తించనట్టుగానే వ్యవహరించారు. జెలెన్‌స్కీ భుజంమీద చేయివేసి ఉంచడం, మరీ ముఖ్యంగా యుద్ధంలో మరణించిన పిల్లల స్మృతికేంద్రాన్ని సందర్శించి నివాళులు అర్పించడం వంటివి భారతదేశం తన దౌత్యవ్యవహారాల్లో స్వతంత్రంగా ఉంటుందన్న సందేశాన్నిస్తాయి.

ఉక్రెయిన్ వేరుపడిన తరువాత భారతప్రధాని ఆ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం. దాదాపు పూర్తిగా నేలమట్టమైపోయిన దేశంలో, ఒకపక్క యుద్ధం జరుగుతూంటే వెళ్ళిరావడం నిజానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితి. గతనెలలో రష్యా పర్యటనమీద ఉక్రెయిన్‌తోపాటు పాశ్చాత్యదేశాలనుంచి కూడా విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో భారత్‌కు దౌత్యపరంగా ఇది అవసరమే. ఉక్రెయిన్ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా ప్రధాని అక్కడ కాలూనడం ద్వారా, ఆ దేశాన్ని విస్మరించలేదని, దాని బాధలు, సమస్యల పట్ల తనకు పట్టింపు ఉన్నదని భారత్ చెప్పినట్టు అయింది. మోదీతో తన మనసులో ఉన్నది చెప్పడానికి జెలెన్‌స్కీ కూడా సందేహించలేదు. తటస్థంగా కాదు, పూర్తిగా మా పక్షాన ఉండండి అని ఆయన అంటే, శాంతివైపు ఉన్నామని మనదేశం నిర్మొహమాటంగా చెప్పింది. మహాత్మాగాంధీ, బుద్ధుడూ జన్మించిన భారతదేశం ఆదినుంచీ శాంతికోసమే కట్టుబడివుందని మోదీ వ్యాఖ్యానించారు. భారతదేశం అతిగొప్పదేశమని, శాంతిసాధనలో కీలక భూమిక నిర్వహించగలదని అంటూనే, యుద్ధం ముగియాలంటే తనవైపు ఉండాలంటున్నారు జెలెన్‌స్కీ. పరమ దుర్మార్గుడైన పుతిన్ కారణంగానే యుద్ధం మొదలైందని, తమమీద అకారణంగా కక్షకట్టాడనీ చెప్పుకొస్తూ, చమురు దిగుమతులను తగ్గించుకొని పుతిన్‌నూ, రష్యా ఆర్థికశక్తిని దెబ్బతీయాలన్నది జెలెన్‌స్కీ వ్యాఖ్యల సారాంశం.

భారత ప్రధాని అక్కడ కొద్దిగంటలు మాత్రమే ఉన్నప్పటికీ ఆయన పర్యటనకు విశేష ప్రాచుర్యం లభించింది. యుద్ధంలో ఉన్న ఈ రెండు దేశాల్లోనూ పర్యటించిన ఇతరదేశాధినేతల సంఖ్య చాలాతక్కువ. మోదీ శాంతిదూతగా వ్యవహరించాలని ఉక్రెయిన్ కోరుకుంటోంది. యుద్ధం వల్ల సమస్యలు పరిష్కారం కాబోవనీ, యుద్ధాన్ని ముగించాలనీ మోదీ ఇప్పటికే పలుపర్యాయాలు స్పష్టంచేశారు. పుతిన్‌తో ప్రత్యక్షంగా భేటీ అయిన సందర్భాల్లో కూడా అదే విషయాన్ని చెప్పారు. గతనెలలోనూ తాను పుతిన్‌తో అదేమాట చెప్పానని ఇప్పుడు జెలెన్‌స్కీ సమక్షంలో వ్యాఖ్యానించడంతో పాటు, త్వరలోనే యుద్ధం ముగిసి శాంతిస్థాపన జరగాలని తాను గట్టిగా కోరుకుంటున్నట్టు కూడా మోదీ ప్రకటించారు. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన తరువాత గతనెల రష్యాలోనూ, ఇప్పుడు ఉక్రెయిన్‌లోనూ మోదీ తొలిసారిగా పర్యటించారు. ఈ పర్యటనలు ఆ యుద్ధం ముగింపుదిశగా ఉపకరిస్తే కచ్చితంగా సంతోషించాల్సిందే.

ఉమ్మడి పౌరస్మృతిపై తొలగని భయాలు

ఈ ఆగస్టు 15న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుసగా 11వ సారి దేశప్రజల నుద్దేశించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేశారు. ఇది ఒక విధంగా రికార్డే. అయితే అందులో విశిష్టత ఏమీ లేదనుకోండి. అది వేరే విషయం. ఎర్రకోట బురుజుల నుంచి నరేంద్ర మోదీ వెలువరించిన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాలలో కెల్లా ఈ పంద్రాగస్టు ప్రసంగం సుదీర్ఘమైనది (98 నిమిషాల పాటు సాగింది). ప్రధానమంత్రిగా మూడో పర్యాయం ఆరంభంలో ఈ ప్రసంగం చేశారు గనుక, రాబోయే ఐదేళ్ల పాలనకు తన ప్రభుత్వ దార్శనిక సంకల్పాలు, ప్రణాళికలను నరేంద్ర మోదీ వెల్లడిస్తారని చాలా మంది ఆశించారు, వినడానికి నిరీక్షించారు.

ప్రధానమంత్రి ప్రసంగం సాహసోపేతమైన కొత్త దార్శనికతను సువ్యక్తం చేసిందని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రశంసించారు. నిజమా? నిజమే అయితే అది ఒక వర్గం ప్రజలను లక్ష్యంగా చేసుకున్న దార్శనికత (?) మాత్రమే అని నేను భావిస్తున్నాను. నరేంద్ర మోదీ ఏమన్నారో గుర్తు చేస్తాను: 'మనం దృఢ సంకల్పంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాం. మరెవ్వరూ వెళ్లని గమ్యాలకు పురోగమిస్తున్నాం. అయితే మన ప్రగతి ప్రస్థానానికి సంబంధించి మరొక సత్యాన్ని కూడా చెప్పవలసి ఉంది. భారతదేశ శీఘ్ర పురోగతిని కొంత మంది భరించలేకపోతున్నారు. ఇది నిజం. భారత్ సాధిస్తున్న విజయాలను, అశేష ప్రజలకు సమకూరుస్తున్న శ్రేయస్సును కొందరు వ్యక్తులు గుర్తించడం లేదు. ఎందుకని? దేశం సాధిస్తున్న అభివృద్ధి వారి స్వార్థ ప్రయోజనాలకు తోడ్పడడం లేదు తమ బాగు మినహా మరెవ్వరి ప్రగతిని వారు కోరుకోరు, ఇష్టపడరు. ఇటువంటి విపరీత, కుటిల స్వభావమున్న వ్యక్తుల సంఖ్య తక్కువేమీ కాదు. అటువంటి వ్యక్తుల పట్ల దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఇంతకూ మోదీ ఆక్షేపించిన 'కొంతమంది ప్రజలు' ఎవరు? వ్యవసాయం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అణు ఇంధనం, అంతరిక్ష పరిశోధన మొదలైన రంగాలలో భారత్ ఘన విజయాలకు గర్వించని వ్యక్తి ఒక్కడూ నాకు తెలియదు మరెవరు? తనకు, ఎన్డీఏకు వ్యతిరేకంగా ఓటు వేసిన 262 మిలియన్ ఓటర్లే ఆ 'కొంత మంది ప్రజలు' అని మోదీ పరోక్షంగా సూచిస్తున్నారా? నిరుద్యోగిత అంతకంతకూ పెచ్చరిల్లిపోవడంపై తనను, తన ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న యువజనులా? లేక ధరల పెరుగుదలతో కుటుంబంపై పడుతున్న ఆర్థిక భారం గురించి వాపోతున్న గృహిణులా? లేక భారత భూభాగాలను చైనా ఆక్రమించుకుంటున్నప్పటికీ భారత్ మౌనంగా తిరోగమించడంపై విభ్రాంతికి లోనవుతున్న సైనికులు, మాజీ జవానులా?

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగమనేది జాతి సర్వతోముఖాభివృద్ధిని లక్ష్యించే దార్శనికతకు మద్దతుగా దేశ ప్రజలను సంఘటితపరిచేందుకు ఉద్దేశించింది. మరి ప్రధాని మోదీ ప్రసంగం అందుకు దోహదం చేసేదిగా ఉన్నదా? లేదు. తన ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల ప్రజలలో నెలకొన్న భయాలు, విభేదాలను మరింత తీవ్రతరం చేసేదిగా ప్రధానమంత్రి ప్రసంగం ఉన్నది. ప్రభుత్వంతో విభేదిస్తున్న, ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తున్న వ్యక్తులను 'విపరీత, కుటిల స్వభావమున్న' వారని ఆక్షేపించడం ప్రజాస్వామిక తీర్పును మోదీ ఎంతగా ఏవగించుకుంటున్నారో అర్థమవుతున్నది.

ప్రజా తీర్పు నుంచి మోదీ పాఠాలు నేర్చుకోరు. లోక్‌సభలో బీజేపీ సీట్లు 240కి తగ్గిపోయినందున కొన్ని నిర్ణయాలను అమలుపరచడంలో మోదీ సర్కార్ జాప్యం చేయగలదని భావించాము. అయితే మేము పొరపడ్డాము. ఉమ్మడి పౌరస్మృతి, ఒక దేశం– ఒకే ఎన్నిక విషయమై ప్రధానమంత్రి ఇప్పటికీ కృత నిశ్చయంతో ఉన్నారని అర్థమవుతోంది. ఆ రెండు అంశాలను ఆయన తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రస్తుతం వేర్వేరు మతాల వారికి ప్రత్యేకంగా ఉన్న వేర్వేరు పౌర స్మృతులను 'మతతత్వ పౌర స్మృతులు' అని ఆయన ఆక్షేపించారు. మోదీ ఇలా అన్నారు: 'జాతిని మత ప్రాతిపదికన విడదీసే చట్టాలకు ఆధునిక సమాజంలో స్థానంలేదు. ఎందుకంటే అవి మత, వర్గ వివక్షకు ప్రాతిపదిక అవుతాయి. దేశానికి ఇప్పుడు అవసరమయింది 'లౌకిక పౌరస్మృతి. మనం 75 సంవత్సరాల పాటు ఒక మతతత్వ పౌర స్మృతిని పాటించాము. ఇప్పుడు ఒక లౌకిక పౌరస్మృతిని రూపొందించుకునే దిశగా వెళ్లవలసి ఉన్నది. మతం ప్రాతిపదికన అనుసరిస్తున్న పౌర స్మృతుల మూలంగా ప్రజలలో నెలకొన్న విభేదాలను లౌకిక పౌరస్మృతితో మాత్రమే రూపుమాపగలం'.



పౌరసత్వ సవరణ చట్టం, ఉమ్మడి పౌర స్మృతి, ఒక దేశం–ఒకే ఎన్నిక ఆలోచనలను పూర్తిగా విరమించుకుని, సంబంధిత బిల్లులను అంతిమంగా ఉపసంహరించుకున్నప్పుడే ప్రజల్లో భయాలు పూర్తిగా తొలగిపోతాయి. ప్రజలలో చీలికలు సృష్టించే, విభేదాలను ప్రకోపింప చేసే విధానాలు, నిర్ణయాలను త్యజించినప్పుడే ఒక కొత్త దార్శనికత ఆవిష్కృతమవుతుంది.

మోదీ చేసిన ఈ ఉద్ఘాటనలో మత చట్టాలపై ఆయన అస్పష్ట అవగాహన స్పష్టంగా కనిపిస్తుంది. ప్రతి వ్యక్తిగత చట్టమూ (పర్సనల్ లా) మతం ప్రాతిపదికన ఉంటుంది. హిందూ వ్యక్తిగత చట్టాలూ అందుకు మినహాయింపు కాదు. మతం ఆధారంగా ఉన్నందున అవి మతతత్వ చట్టాలు ఎలా అవుతాయి? వివాహాలకు సంబంధించి ఒక లౌకిక చట్టం ఉన్నది. అదే 'ప్రత్యేక వివాహ చట్టం'. అయితే ఈ దేశ ప్రజలు దానిని పెద్దగా గుర్తించడం లేదు, పాటించడం లేదు. తన పొరుగువాడు ఒక విభిన్న మత చట్టాన్ని అనుసరిస్తున్నందున తాను 'వివక్షకు గురవుతున్నానని' ఏ మతానికి చెందిన సామాన్యుడూ భావించడు, భయపడడు. అన్ని మతాలవారు ఉమ్మడి పౌరస్మృతికి అంగీకరిస్తే అద్భుతంగా ఉంటుంది. అయితే ఇది చెప్పినంత తేలికగా కార్యరూపం దాల్చదు.

ఉమ్మడి పౌరస్మృతి భావన, ఒక దేశం–ఒకే ఎన్నిక ప్రతిపాదన ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. తొలుత వాటి విషయమై ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించాలి. ఉమ్మడి పౌరస్మృతి విషయమై ముందుగా అన్ని మతాల వారితోనూ విస్తృతంగా సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇక 'ఒక దేశం– ఒకే ఎన్నిక' ప్రతిపాదనను అమలుపరచాలంటే రాజ్యాంగంలోని అనేక అధికరణలకు తప్పనిసరిగా సవరణలు చేయవలసి ఉంటుంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ప్రజలను మతపరమైన చీలికలకు దారితీసే ప్రసంగాలను అధికార పక్షం నాయకులు చేశారు. మోదీ ఏమన్నారో గుర్తు చేస్తాను: 'కాంగ్రెస్ అధికారానికి వస్తే ప్రజల భూములు, బంగారం, ఇతర విలువైన ఆస్తులను ముస్లింలకు పంపిణీ చేస్తుంది; కాంగ్రెస్ మీ మంగళసూత్రాలు, స్త్రీ ధనాన్ని సైతం తీసుకుని అధిక సంతానం ఉన్నవారికి ఇస్తుంది'. అమిత్ షా ఏమన్నారు? 'ఆలయ మాన్యాలను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుంటుంది, వాటిని ముస్లింలకు ఇస్తుంది'. రాజ్‌నాథ్ సింగ్ మాట గుర్తులేదూ? 'ప్రజల ఆస్తులను కాంగ్రెస్ కైవశం చేసుకుని వాటిని చొరబాటుదారులకు పునఃపంపిణీ చేస్తుంది'. చివరగా మోదీని మరోసారి ఉటంకిస్తాను: 'గేదెల పైన కూడా వారసత్వ పన్ను రావచ్చు' అని ఆయన హెచ్చరించారు! ఈ వెర్రి మాటలను నిలిపివేసేందుకు మీడియా ప్రయత్నించనే లేదు.

సరే, ప్రజల తీర్పు ఎలా ఉన్నదో మరి చెప్పనవసరం లేదు. మోదీ వ్యవహార శైలిలో సంయమనం కన్పించలేదు. అయితే ఆయన ప్రభుత్వం పలు అంశాలపై వెనుకంజ వేసింది. ఇండెక్సేషన్ బెనిఫిట్ ఫర్ కేపిటల్ గెయిన్స్‌ను పునరుద్ధరించారు. వక్ఫ్ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలనకు నివేదించారు. బ్రాడ్‌కాస్టింగ్ బిల్లును ఉపసంహరించుకున్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో మధ్యస్థాయి, సీనియర్ పోస్టులలో సివిల్ సర్వీస్ అధికారులతో కాకుండా సంబంధిత రంగాలలో నిపుణులైన బయటి వ్యక్తులను నేరుగా నియమించేందుకు తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుతానికి నిలిపివేశారు. పౌరసత్వ సవరణ చట్టం, ఉమ్మడి పౌర స్మృతి, ఒక దేశం–ఒకే ఎన్నిక ఆలోచనలను పూర్తిగా విరమించుకుని, సంబంధిత బిల్లులను అంతిమంగా ఉపసంహరించుకున్నప్పుడే ప్రజల్లో భయాలు పూర్తిగా తొలగిపోతాయి. ప్రజలలో చీలికలు సృష్టించే, విభేదాలను ప్రకోపింప చేసే విధానాలు, నిర్ణయాలను త్యజించినప్పుడే ఒక కొత్త దార్శనికత ఆవిష్కృతమవుతుంది.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

విశ్వమిత్ర భారత్‌కే ఇరుగు పొరుగు బలిమి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలన మొదటి హయాంలోనూ, ఆ తరువాత కూడా విశ్వ–గురుగా భారత్ ప్రభవించనున్నదని ప్రభుత్వ మద్దతుదారులు పెద్ద పెట్టున పదే పదే ప్రకటిస్తుండేవారు. మన నాగరికతా విలువలు, తాత్విక సంప్రదాయాలు, సమున్నత ఆధ్యాత్మిక అనుష్ఠానాలు సంస్కృతి విషయంలో మనలను ఎప్పుడో ప్రపంచ అగ్రగామిగా ప్రముఖంగా నిలిపాయని, ఇప్పుడు అసాధారణ ఆర్థికాభివృద్ధి, సాంకేతికతల విజయాలు ప్రపంచ నాయకత్వానికి మనలను అద్వితీయంగా అర్హులను చేశాయని మోదీ ప్రభుత్వ సమర్థకులు ఘోషించారు.

ఈ వాదనను మరింత ముందుకు తీసుకువెళ్లి దానిని వ్యక్తిగతీకరించడానికి సైతం సాహసించారు. భారత్ మాత్రమే కాదు, నరేంద్ర మోదీయే ప్రపంచానికి నాయకత్వం వహించి మానవాళిని అపూర్వ ప్రగతి సీమలకు నడిపించనున్నారని మోదీ భక్తులు చెప్పారు. 2023లో జీ20 దేశాల కూటమి అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టాక ఆ ప్రచారం మరింత ఉధృతమయింది. నా మిత్రుడు ఒకరు చెప్పిన ఒక ఆసక్తికరమైన ముచ్చటను పేర్కొంటాను: ఢిల్లీ మెట్రోలో ఒక ప్రయాణికుడు తన తోటి ప్రయాణికుడితో ఇలా అన్నాడట : 'నీకు తెలుసా, ఇప్పుడు మోదీజీ కేవలం భారత ప్రధానమంత్రి మాత్రమే కాదు, మొత్తం ఇరవై దేశాలకు ప్రధానమంత్రి కూడా!'

యాదృచ్ఛికంగా అదే కాలంలో అధికార పక్షం ప్రచార కాండ పరిభాషలో ఒక చిన్న మార్పు సంభవించింది. భారత్‌ను విశ్వ–మిత్ర (సమస్త దేశాలకు స్నేహితుడు)గా ప్రస్తావించడం ప్రారంభమయింది. ఇది, మోదీ ప్రభుత్వ ఆకాంక్షను తగ్గించడమే, సందేహం లేదు. ఒక నిర్దిష్టమైన, సుస్పష్టమైన మార్పు. ప్రపంచానికి బోధించగల స్థాయికి భారత్ ఇంకా చేరలేదని, అయినప్పటికీ ప్రపంచంలోని ప్రతి ఒక్క దేశంతోను స్నేహం నెరపగల విశిష్టస్థానంలో భారత్ ఉన్నదని అంటూ ఆ మార్పుకు వివరణ ఇవ్వసాగారు. దీనిపై అనేక ఊహాగానాలు జరిగాయి. ఢిల్లీ మెట్రోలో మోదీ భక్త ప్రయాణికుడి వలే కాకుండా నరేంద్ర మోదీ ప్రభుత్వ పక్షాన మాట్లాడే బీజేపీ శ్రేణులకు జీ20 అధ్యక్షత తాత్కాలికం మాత్రమేనన్న వాస్తవం బాగా తెలుసు కనుకనే విశ్వ–గురు అని కాకుండా విశ్వ–మిత్ర అనే మాటను అందుకున్నారా? ప్రజల అంచనాలకు అనుగుణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి ఏ మాత్రం లేకపోవడమే ఆ మార్పును ప్రేరేపించిందా? హిమాలయ సరిహద్దు ప్రాంతాల్లో చైనా చొరబాటులతో ప్రపంచ నాయకత్వానికి మన ఆరాటాలు అసంబద్ధమైనవనే వాస్తవం తెలిసిరావడం వల్లే ఆ మార్పు అనివార్యమయిందా?

ఏది ఏమైనా ఆ ప్రచార కథనాలలో ఒక స్పష్టమైన మార్పు చోటుచేసుకున్నది. అయితే విమానాలను, ప్లాస్టిక్ సర్జరీని సహస్రాబ్దాల క్రితమే ప్రాచీన హిందువులు కనిపెట్టారని విశ్వసించే మోదీ భక్త గణంలో భారత్ ఇప్పటికే విశ్వగురు అని, కాకపోయినా సమీప కాలంలోనే ఆ విశిష్ట హోదాను సంతరించుకుంటుందనే నమ్మకం పరిపూర్ణంగా ఉంది. వాస్తవికంగా ఆలోచించే రాజకీయ వివేకులు మాత్రం విశ్వ–మిత్ర అనే ప్రశంసనే మరింత తరచుగా ప్రస్తావిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రజల తిరుగుబాటు నేపథ్యంలో ఈ మృదు గర్వాతిశయ స్వోత్కర్షను సైతం త్యజించడమే మంచిది. అంతేకాదు, శ్రేయస్కరం కూడా. ఎందుకని? మన ఇరుగు పొరుగు దేశాల ప్రజలు భారత్‌ను ఒక విశ్వసనీయమైన, ఆధారపడదగిన మిత్ర దేశంగా ఏ మాత్రం భావించడం లేదని బంగ్లా పరిణామాలు మరింతగా స్పష్టం చేయలేదూ? షేక్ హసీనా నిరంకుశ పాలనను న్యూఢిల్లీ అన్ని విధాల వెనకేసుకురావడం వల్లే భారత్ ఉద్దేశాలను బంగ్లాదేశీయులు తీవ్రంగా శంకిస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో బంగ్లా పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ మరోసారి విజయం సాధించింది. ప్రజల మద్దతుతోనేనా? కాదు. ఎన్నికలలో అడ్డు అదుపూ లేని రిగ్గింగ్‌కు పాల్పడడం ద్వారా. అయినా ఎన్నికలను స్వేచ్ఛగా, సక్రమంగా నిర్వహించారంటూ భారత ఎన్నికల సంఘం బంగ్లాదేశ్ ఎన్నికల సంఘాన్ని ప్రశంసించింది!



సమస్త ప్రపంచ దేశాలకు ఒక మంచి స్నేహితుడుగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తుంటే అందుకు మున్ముందుగా తన ఇరుగు పొరుగు రాజ్యాలు ముఖ్యంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకల పట్ల తన వైఖరులను మార్చుకోవడంపై దృష్టి పెట్టాలి. ఈ దేశాలతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునేందుకు గౌరవాదరాలు, విశ్వసనీయతను పెంపొందించుకోవాలి. మన పట్ల ఆ సుహృద్భావాలు కేవలం ఆ దేశాల నాయకులలోనే కాకుండా, ఆయా దేశాల పౌరులలో సైతం సుస్థిరంగా నెలకొనేలా మనం ప్రవర్తించాలి.

భారత్ తమ దేశం పట్ల దురహంకారపూరితంగా వ్యవహరిస్తుందనే భావన శ్రీలంక, నేపాల్ ప్రజలలో కూడా ప్రగాఢంగా ఉన్నది. బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకకు చెందిన పౌరుల సంయుక్త ప్రకటన ఒకటి తమ తమ దేశాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం చేసుకోవడాన్ని భారత్ విరమించుకోవాలని విజ్ఞప్తి చేయడమే అందుకొక నిదర్శనం. 'దశాబ్దాలుగా న్యూఢిల్లీ తనకు సానుకూలురు అయిన రాజకీయవేత్తలు, ప్రభుత్వాధికారుల తోడ్పాటుతో తమ పాలనా వ్యవహారాలలో జోక్యం చేసుకుంటూ నిరంతర రాజకీయ అస్థిరతను సృష్టిస్తూ నిరంకుశ ప్రభుత్వాలకు వత్తాసునిస్తుందని ఆ సంయుక్త ప్రకటన నిరసించింది.

ఆ ఆరోపణను ధ్రువీకరించే వాస్తవాలను కూడా ఆ ప్రకటన ప్రస్తావించింది. బంగ్లాదేశ్‌లో ప్రజల మద్దతును కోల్పోయిన షేక్ హసీనా ప్రభుత్వాన్ని ఒక దశాబ్ద కాలంగా నిలబెట్టి అందుకు ప్రతిఫలంగా భారత్ రాజకీయ, ఆర్థిక రాయితీలను పొందిందని ఆ ప్రకటన పేర్కొంది. 'శ్రీలంకకు ఐపికెఎఫ్‌ను పంపక ముందు నుంచీ, ఆ తరువాత కూడా ఆ దేశ రాజకీయాలలో న్యూఢిల్లీ జోక్యం చేసుకొంటోంది. ఇప్పుడు శ్రీలంకలో తమ కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలను సాధించేందుకు న్యూఢిల్లీ చురుగ్గా చొరవ చూపుతుందని' ఆ ప్రకటన గర్హించింది. నేపాల్‌లో 'ఒకప్పుడు తన అనుకూల రాజకీయవేత్తలు, దౌత్యవేత్తల ద్వారా జోక్యం చేసుకున్న న్యూఢిల్లీ ఇప్పుడు ఇంటెలిజెన్స్ వర్గాలు, ఆరెస్సెస్ కార్యకర్తల ద్వారా ఆ దేశ అంతర్గత వ్యవహారాలను ప్రభావితం చేస్తూ నిర్దేశిస్తుంది. 2015లో పెను భూకంపంతో నేపాల్ ప్రజలు అతలాకుతలమైన తరుణంలో కూడా భారత్ ఆ దేశానికి వ్యతిరేకంగా దిగ్బంధం విధించింది. నేపాల్ కొత్తగా అమలుపరచుకుంటున్న రాజ్యాంగం న్యూఢిల్లీకి నచ్చకపోవడం వల్లే ఆ దిగ్బంధాన్ని అమలుపరిచారని' ఆ సంయుక్త ప్రకటన దుయ్యబట్టింది.

ఈ ధ్రువీకరణలు నిర్దుష్టమైనవి. చాలవరకు వాస్తవమైనవి. ప్రస్తావిత మూడు దేశాలలోను నాకు స్నేహితులు, వృత్తి సంబంధమైన సహచరులు ఉన్నారు. ఆ మూడు దేశాలను నేను అప్పుడప్పుడు సందర్శిస్తుంటాను. ఒక పెత్తందారువలే భారత్ వ్యవహరిస్తుందని, పెద్దన్న మనస్తత్వం న్యూఢిల్లీకి బాగా ఉన్నదనే భావన బంగ్లా, నేపాలీ, సింహళ మేధావులు, రచయితలలో తీవ్రంగా ఉన్నది. ఈ సందర్భంగా 19వ శతాబ్ది మెక్సికో దేశాధ్యక్షుడు ఒకరు అమెరికా విషయమై చేసిన వ్యాఖ్య నొకదాన్ని తప్పక గుర్తుచేయవలసివున్నది. ఆ మెక్సికన్ పాలకుడు ఇలా అన్నాడు: 'అభాగ్య మెక్సికో! భగవంతుడికి ఎంత సుదూరంలో ఉన్నదో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాకు అంత సామీప్యంలో ఉన్నది'. బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ మూడూ అనేక ఆర్థిక సమస్యలు, రాజకీయ సవాళ్లతో సతమతమవుతున్నాయి. భారత్‌కు పొరుగునే ఉన్న కారణంగా ఆ సమస్యలను పరిష్కరించుకోవడం, సవాళ్ల నెదుర్కోవడం ఆ దేశాలకు మరింత క్లిష్టతరమవుతోంది.

ఇరుగు పొరుగు దేశాల పట్ల భారత్ పెద్దన్న ప్రవర్తన మోదీ సర్కార్‌తోనే ప్రారంభమవలేదు. అంతకు ముందు నుంచే ఉన్నది. శ్రీలంకకు ఐపికెఎఫ్‌ను పంపింది రాజీవ్ గాంధీ, నేపాల్‌కు వ్యతిరేకంగా నరేంద్రమోదీ ప్రభుత్వం దిగ్బంధం విధించక ముందే రాజీవ్ సర్కార్ సైతం ఆ అమానుష అమిత్ర చర్యకు పాల్పడింది. నిజానికి ఇటువంటి దురహంకారపూరిత ప్రవర్తనకు ఆద్యుడు మన మొదటి ప్రధానమంత్రి (ఆయనే మన మొదటి విదేశాంగ మంత్రి కూడా) అని చెప్పక తప్పదు. ప్రముఖ దౌత్యవేత్త జగత్ మెహతా ఇలా వ్యాఖ్యానించాడు: 'రెండు భిన్న, అసమాన ఇరుగు పొరుగు దేశాల మధ్య దౌత్యాన్ని నిర్వహించడమంత క్లిష్టసాధ్యమైన కార్యం ఇరవయో శతాబ్దిలో మరొకటి లేదన్న సత్యాన్ని నెహ్రూ పూర్తిగా గుర్తించలేదు. ఈ విషయంలో ఆయనకు ఉపయుక్తమైన సలహానివ్వడంలో విదేశాంగశాఖ విఫలమయింది'.

చరిత్ర తర్కం, భౌమ వాస్తవాలు చైనా, పాకిస్థాన్‌తో భారత్ సంబంధాలు సమస్యాత్మకంగా ఉండిపోవడాన్ని అనివార్యం చేస్తున్నాయి. మెక్‌మహన్ రేఖను చైనా ఎప్పుడూ అంగీకరించలేదు. తాము పాశ్చాత్య సామ్రాజ్యవాదుల నియంత్రణలో ఉన్నప్పుడు ఆ సరిహద్దు ఒప్పందాన్ని బలవంతంగా అంగీకరించవలసివచ్చిందని చైనా స్పష్టం చేసింది. 1962లో భారత భూభాగాలను చైనా దురాక్రమించడం భారతీయులను అమితంగా నొప్పించింది. ఆ పరాభవ మానసిక గాయాల నుంచి ఇప్పటికీ ఉపశమనం లభించలేదు. పాకిస్థాన్ దశాబ్దాలుగా కేవలం కశ్మీర్‌లోనే కాకుండా మన దేశంలోని ఇతర ప్రాంతాలలో కూడా ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. ఈ దృష్ట్యా ఆ దేశంతో ఏదో ఒక విధంగా సర్దుబాటు చేసుకునేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించినా సత్ఫలితం సమకూరే అవకాశమే లేదు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

అయితే మన ఇతర ఇరుగు పొరుగు దేశాలతో అటువంటి వివాదాస్పద సమస్యలు లేవు. అందుకు భిన్నంగా సామరస్యపూర్వక సంబంధాలకు దోహదం చేసే పరిస్థితులే ఉన్నాయి. అయినా ఈ మూడు చిన్న దేశాలతో భారత్ సంబంధాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగిన సందర్భాలు అరుదుగా ఉన్నాయి. ఇందుకు తన బాధ్యత ఏ మేరకు ఉన్నదో పెద్ద, శక్తిమంతమైన పొరుగు దేశంగా భారత్ నిజాయితీగా ఆత్మపరిశీలన చేసుకోవాలి.


2007–08లో మన ఆర్థిక వ్యవస్థ అసాధారణంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు ప్రపంచ అగ్రరాజ్యంగా భారత్ ఆవిర్భవించనున్నదనే మాట బాగా విన్పించింది. అది అకాల ఆశాభావమని, తొందరపాటుతో అంటున్న మాట అని నేను భావించాను. ప్రపంచ బాధ్యతలు స్వీకరించడానికి ఆరాటపడడం కాకుండా మన సమాజంలోని ఆర్థిక, సామాజిక అసమానతలు, రాజకీయ సమస్యలను పరిష్కరించుకోవడంపై పూర్తి శ్రద్ధ చూపించడం వివేకవంతంగా ఉండగలదని నేను అప్పుడే వాదించాను. మన్మోహన్ సింగ్ రెండో ప్రధానమంత్రిత్వ కాలంలో అగ్రరాజ్య హోదాకు ఆరాటాలు చాలా వరకు తగ్గిపోయాయి. అయితే నరేంద్ర మోదీ తన మొదటి ప్రభుత్వ హయాంలో అవి మళ్లీ సరికొత్తగా వ్యక్తమవ్వడం ఆరంభమయింది. స్వదేశీ ముద్రను సంతరించుకున్నాయి. భారత్ త్వరలో అగ్రరాజ్యంగా ప్రభవించనున్నదని చెప్తుతున్నవారు అచిరకాలంలోనే భారత్ ఇప్పటికే విశ్వగురుగా మారిందని ప్రకటించసాగారు!

ప్రపంచ నాయకత్వానికి భారత్ ఆరాటం వివేకహీనమైనది. అదొక పగటి కల. ఎందుకని? మన దేశం ఎదుర్కొంటున్న సంస్థల, వ్యవస్థల పతనం, అసమానతల పెరుగుదల, పెచ్చరిల్లిన అవినీతి, పరిపాలనలో ఆశ్రిత పక్షపాతం, ఎల్లెడలా పర్యావరణ విధ్వంసం మొదలైన సమస్యలు మన సమాజంలోని వాస్తవ పరిస్థితులను ముఖం మీద గుద్ది చెప్పడం లేదూ? విశ్వగురు భారత్ అనే భావన అర్థరహితం, చెత్త వాగుడే కావచ్చు గానీ విశ్వమిత్ర భారత్ అనే ఆదర్శం కొంతవరకు విలువైనది. సమస్త ప్రపంచ దేశాలకు ఒక మంచి స్నేహితుడుగా ఉండాలని భారత్ ఆకాంక్షిస్తుంటే అందుకు మున్ముందుగా తన ఇరుగు పొరుగు రాజ్యాలు ముఖ్యంగా బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంకల పట్ల తన వైఖరులను మార్చుకోవడంపై దృష్టి పెట్టాలి. ఈ దేశాలతో మెరుగైన సంబంధాలను నిర్మించుకునేందుకు గౌరవాదరాలు, విశ్వసనీయతను పెంపొందించుకోవాలి. మన పట్ల ఆ సుహృద్భావాలు కేవలం ఆ దేశాల నాయకులలోనే కాకుండా, ఆయా దేశాల పౌరులలో సైతం సుస్థిరంగా నెలకొనేలా మనం ప్రవర్తించాలి.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఔను.. సన్నాఫ్ 'మాణిక్యమే' సీతారాం!!

ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో తనదైన సంతకాన్ని చేసిన కవి, విమర్శకుడు, పరిశోధకుడు, అధ్యాపకుడు సీతారాం. బహుముఖ పాత్రలు పోషిస్తున్న ఈ అరుదైన సాహితీ శిఖరం అలుపెరుగని ప్రయాణాన్ని అవలోకిస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలుగకమానదు. రక్తస్పర్శ కవుల్లో ఒకరిగా సీతారాం ప్రపంచానికి పరిచయం. 'ఇదిగో ఇక్కడిదాకే' అంటూ తాను వెలువరించిన కవితా సంపుటి అప్పట్లో ఒక సంచలనంగా నిలిచింది. కవిత్వంలో తాత్విక గాఢత కలిగిన పోస్ట్ మాడర్నిస్ట్ ధోరణిలో సాగిన ఈ కవిత్వం ఇటు పాఠకులనే కాదు అటు విమర్శకులను సైతం ఆలోచింపజేసింది. గ్లోబలైజేషన్ నేపథ్యంలో ఆధునిక మానవుడి అంతఃసంఘర్షణను, లోలోపలి మానని గాయాలను అతి సున్నితంగా, హృద్యంగా పట్టుకోవడంలో సీతారాంది అందెవేసిన చెయ్యి. ఆ తరువాత... కాలం వెంట నడుస్తూనే దాని పరిణామాలను, ప్రతిఫలనాలను ఒడిసి పట్టుకుని కవిత్వంలో హృద్యంగా ఒదిగించిన తీరు అసామాన్యమైంది. వస్తువు ఎంపిక దగ్గరి నుండి, దాని అభివ్యక్తి వరకు నూతనత్వంతో కూడిన తాజాదనమే ప్రతీ కవితలో పొదిగిన కవిత్వ జీవి ఆయన. ఇట్లా కవిత్వం రంగంలో తనదైన సాహిత్య జెండాను ఎగురవేసిన 'సన్నాఫ్ మాణిక్యం' సీతారాం.



సాహిత్యం, జీవితం వేరువేరు కాదని తాను చెప్తున్నదే ఆచరిస్తూ, ఆచరిస్తున్నదే బోధిస్తూ సాహిత్యంలో, సమాజంలో ఒక ధిక్కార బావుటా ఎగురవేస్తున్న బలమైన గొంతుక సీతారాం.

కవికి సృజనకారుడికి సాహిత్య లోతుపాతులను విడమరిచి చెప్పి, సరైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యతను సైతం నిండు మనసుతో స్వీకరించిన విమర్శకుడు తాను. అట్లా తాను రాసిన 'అదే పుట' సాహిత్యం విమర్శలో వస్తు, శిల్పాలనే కాదు అభివ్యక్తి విషయంలో సైతం పాశ్చాత్య సాహిత్య విమర్శ సిద్ధాంతాలతో విశ్లేషించి తెలుగు సాహిత్యానికి పరిచయం చేశారు. ఈ రకంగా సీతారాం విమర్శకులు లేని లోటును గడిచిన మూడున్నర దశాబ్దాలుగా తీరుస్తూనే ఉన్నారు. నిర్మొహమాటంగా తాను చేసిన విమర్శ సాహిత్యకారులను ఆ సమయంలో నొప్పించి ఉండొచ్చుగానీ ఆ తర్వాత మాత్రం సీతారాం చూపిన మార్గమే సరైనదని గుర్తించక మానరు. అట్లా సాహిత్య గమనాన్ని నిరంతరం పరిశీలిస్తూ సీరియస్ విమర్శ వెలువరించారు. విమర్శ అంటే అదేదో బ్రహ్మపదార్థం కాదని దాన్ని కూడా సృజన ప్రక్రియగా సృజించి పాఠక అభిమానుల్ని సంపాదించుకున్న విమర్శకాగ్రేసరుడు సీతారాం.

సీతారాం కవిగా, విమర్శకుడిగా చేసిన కృషి ఎంత కీలకమైందో వారు చేసిన పరిశోధన కూడా అంతే ప్రాముఖ్యతను సంతరించుకుంది. తెలుగులో 1955 నుండి వెలువడిన వచన కవిత్వ అభివ్యక్తిని గురించి సీతారాం చేసిన పరిశోధన నేటికీ ఎంతోమంది స్కాలర్‌లకు ఒక దిక్సూచిగా నిలబడి ఉంది. పరిశోధనను సీతారాం కేవలం పీహెచ్‌డీ పట్టా వరకే పరిమితం చేయలేదు. పీహెచ్‌డీ పరిశోధన అనంతరం అనేక అంశాల మీద వారి పరిశోధన దృష్టిని సారించారు. ఆ నేపథ్యంలో వాగ్గేయ సాహిత్యంలో పర్యావరణ వాదం మీద మేజర్ రీసెర్చ్ ప్రాజెక్టు చేశారు. తద్వారా తెలుగు సాహిత్యంలో పర్యావరణ వాద పరిశోధనకు, సృజనకు దారులు తెరిచారు.

ఇక అధ్యాపకునిగా సీతారాం చేసిన చేస్తున్న కృషి చారిత్రాత్మకమైంది. తన దగ్గర తెలుగు చదువుకుంటున్న విద్యార్థులను సాహిత్యం మార్గం పట్టిస్తున్నారు. సోషల్ మీడియా జమానాలో పుస్తకాలకు దూరమవుతున్న నేటి తరాన్ని సీతారాం కవులుగా మార్చే బాధ్యతను తన భుజాలకు ఎత్తుకున్నాడు. తాను ఏ కళాశాలలో పని చేసినా విద్యార్థులకు కవిత్వ మెలుకువలు నేర్పుతూ రేపటి కవులను తయారు చేస్తున్న 'కవుల గని' సీతారాం. సృజనాత్మకతకు పూర్తిగా దూరమై మరమనుషులుగా మారుతున్న కాలం పట్ల తీరని వేదనతో నిత్యం తాత్విక చింతన చేస్తున్న ఈ కవిని గురువుగా కలిగి ఉన్న విద్యార్థులు అదృష్టవంతులు. బోధనను కేవలం ఉద్యోగధర్మంగా మాత్రమే కాకుండా దానినొక చారిత్రిక బాధ్యతగా గుర్తించాడు. అందుకే ఈ ఆధునిక కాలపు పోకడలకు దూరంగా నేటి తరాన్ని ఎప్పటికప్పుడు ఒక స్పష్టమైన దార్శనికతతో ముందుకు నడుపుతున్నాడు. సాహిత్యం, జీవితం వేరువేరు కాదని తాను చెప్తున్నదే ఆచరిస్తూ, ఆచరిస్తున్నదే బోధిస్తూ సాహిత్యంలో, సమాజంలో ఒక ధిక్కార బావుటా ఎగురవేస్తున్న బలమైన గొంతుక సీతారాం.

నిరంతర అధ్యయనం, అరుదైన సాహితీ వ్యక్తిత్వం సీతారాం సొంతం. వ్యంగ్య తాత్వికత వెనక ఎంత గాఢత దాగి ఉంటుందో సీతారాం పలికే ప్రతీ మాటలో మనకు స్పష్టంగా కనిపిస్తుంది. పోరాటాల గుమ్మం ఖమ్మం నేల అందించిన ఆణిముత్యం సీతారాం. ఈ కాలాన్ని వెలిగించిన సీతారాం ప్రసరించిన సాహిత్య వెలుగుల మీద ఇప్పటికే ఎంతో మంది లబ్ధప్రతిష్ఠులైన విమర్శకులు, పరిశోధకులు ఎంతో బేరీజు వేసి ఉన్నారు. ఇంత నిండైన సాహితీమూర్తిని దేవులపల్లి రామానుజం అవార్డుకు ఎంపిక చేయడం సముచితమైన గౌరవం. అలుపెరుగకుండా సీతారాం చేస్తున్న ఈ కృషి మరింత ముందుకు సాగాలని ఆశిస్తూ...

■ డాక్టర్ పసునూరి రవీందర్

(నేడు తెలంగాణ సారస్వత పరిషత్‌లో సీతారాంకు దేవులపల్లి రామానుజరావు పురస్కారం అందజేస్తున్న సందర్భంగా)

సురక్షితమైన ఆసుపత్రులు సామాజిక బాధ్యత

కోల్‌కత్తాలో ప్రభుత్వ వైద్య కళాశాలలో డ్యూటీలో ఉన్న వైద్యురాలి హత్యోదంతంపై సుప్రీంకోర్టు తనకు తానే సుమోటోగా స్పందించడం, వైద్యుల రక్షణాంశంపై జాతీయ టాస్క్‌ఫోర్స్ నియమించడం ముదావహం. హీనమైన నేరంపై సత్వరం దర్యాప్తు జరిపి, దోషుల్ని బోనెక్కించడం, బాధిత కుటుంబానికి ఊరటనివ్వడం ఎంత ముఖ్యమో, ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా నివారణా చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిపై దాడుల్ని నివారించేలా కఠినమైన చట్టాలు ఉండడంతోబాటు, ఆ చట్టాల ద్వారా వెంటనే న్యాయం జరుగుతుందని, తప్పు చేసిన వారికి శిక్షపడక తప్పదని వ్యవస్థ తన పనితీరు ద్వారా హెచ్చరించాలి. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో అరకొర శిక్షలతో కొనసాగుతున్న చట్టాల స్థానే, దేశ వ్యాప్తంగా అమలుపరిచే బలమైన చట్టాలు కావాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ తరహా చట్టం దశాబ్దం క్రితం తీసుకువచ్చినపుడు అది బలమైనదే. నేరానికి మూడేళ్ల జైలు శిక్షతో. అయితే తర్వాత వచ్చిన మార్పులతో అంటే ఏడేళ్ళలోపు జైలు శిక్ష పడగల నేరానికి వెంటనే బెయిల్ పొందవచ్చు అన్న మార్పుతో ఆ చట్టం వాడి తగ్గిపోయింది. అందుకనే దాడి చేసినట్లు నేరం నిరూపితమైతే పదేళ్ళకు తగ్గని జైలు శిక్షతో కొత్త చట్టం రావాలి. కోవిడ్ సమయంలో అమలైన ప్రజారోగ్య సేవల చట్టం తరహాలో. శాంతిభద్రతలు, ఆరోగ్యం రాష్ట్రాల పరిధిలో ఉన్న అంశాలే కావచ్చు కానీ, ఆరోగ్య సేవలపై దాడులు దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. దాన్ని నియంత్రించడానికి కఠినంగా వ్యవహరించడంలో తప్పేముంది?

ఇక రెండో విషయం. ఆసుపత్రులకు భద్రత, రక్షణ పెంచకపోతే ఎంత గొప్ప చట్టమున్నా, ప్రయోజనం స్వల్పం. ఆధునిక పర్యవేక్షణా వ్యవస్థ అందుబాటులో ఉంచడంతోబాటు వెంటనే స్పందించే టీములు, కొంత భద్రతా సిబ్బందిని కేటాయించడం అవసరం. ఉద్వేగాలతో రోగి బంధువులు ఉంటారు. బ్యాడ్ న్యూస్‌ని తట్టుకోలేని స్థితిలో ఉండొచ్చు. వారిని వైద్యంపై, చట్టంపై అవగాహనా కార్యక్రమాలతో ఒప్పించవచ్చు. వీటితోబాటు జూనియర్ వైద్యులు ఎంత అసౌకర్యాల నడుమ, ఎక్కువ పని గంటలతో వృత్తి నిర్వహిస్తున్నారో ఈ ఆందోళన సమయంలో తెలిసివచ్చింది. వాటిపై కూడా దృష్టి సారించాలి. పరిస్థితి చక్కదిద్దడానికి సమగ్రమైన కార్యాచరణ కావాలి. ఇది సామాజిక బాధ్యత. అందులో పెద్ద పాత్ర కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలది.

– డి.వి.జి శంకరరావు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి




మాంపాహి మహాలక్ష్మీ

శ్రావణమాసం మూడో శుక్రవారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు. మహామండపం ఆరో అంతస్తులో వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ఈ వ్రతాలు చేశారు.

6లో..





హెల్మెట్ లేకపోతే వాహనం సీజ్

నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆపరేషన్ హెల్మెట్



నగరంలో హెల్మెట్ లేకుండా పట్టుబడిన వాహనాలు

హెల్మెట్ తెచ్చుకున్నాకే వాహనం విడుదల

నగరంలో హెల్మెట్ వాడకాన్ని తప్పనిసరి చేస్తూ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టారు. ఇకపై ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెబుతూ అలా చేయని వారి వాహనాన్ని సీజ్ చేస్తున్నారు. హెల్మెట్ తీసుకుని వచ్చిన వారికి తిరిగి వాహనాన్ని అప్పగిస్తున్నారు. రెండు నెలల్లో 10వేలకు పైగా కేసులు నమోదు చేశారు.

6లో..

భూభక్షకులు

జగనన్న భూరక్ష సర్వేలో వీఆర్వోల అక్రమాలు

- ఒకరి భూమి మరొకరి ఖాతాలో మార్పులు చేర్పులు
- సరి చేయడానికి రూ.లక్షల్లో లంచం
- ఉంగుటూరులో వీఆర్వోకు అడంగల్ స్పెషలిస్ట్‌గా పేరు

● ఉంగుటూరు జెడ్పీటీసీ సభ్యుడిగా పనిచేసిన సుంకర సత్యనారాయణ కుటుంబసభ్యుల్లో ఎవరైనా చనిపోతే ఆ మండలంలోని పొణుకుమాడలో వారికి చెందిన 30 సెంట్ల భూమిలోనే అంత్యక్రియలు పూర్తిచేస్తారు. అక్కడే సమాధులు నిర్మిస్తారు. ఈ 30 సెంట్ల భూమి సత్యనారాయణ పేరుతోనే ఉంది. డాక్యుమెంట్లు కూడా ఆయన పేరుతోనే ఉన్నాయి. కానీ, అడంగల్‌లో మాత్రం అదే ఊరిలో ఎక్కడో ఉన్న వారి బంధువుల పేరుతో ఆ భూమిని మార్చేశారు.

● పొణుకుమాడలోనే సుంకర సత్యనారాయణ కుమారుడు సుంకర రాజ్‌కుమార్ పేరుతో ఉన్న సుమారు 2 ఎకరాలను వేరే వ్యక్తులకు విక్రయించారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిపోయింది. గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూరక్ష సర్వేలో భాగంగా అడంగల్‌లో ఆ భూమి సుంకర రాజ్‌కుమార్ పేరుతోనే మార్పు చేశారు. ఇదేమిటని భూమిని కొన్నవారు ప్రశ్నించగా, 'ఎకరా రూ.30 లక్షలపైనే పలుకుతుంది. లక్ష రూపాయలు ఖర్చు చేసుకోండి. అడంగల్‌లో సరిచేసి ఇస్తాం.' అని చెప్పారు.



● ఒక్క పొణుకుమాడ గ్రామంలోనే ఇలాంటి చిత్రాలు జరగలేదు. ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా జగనన్న భూరక్ష సర్వేను ఆసరాగా చేసుకుని గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో)లు చెలరేగిపోయారు. అడంగల్‌లో ఇష్టారాజ్యంగా పేర్లు మార్చేసి, వాటిని సరిచేసేందుకు రూ.లక్షలు డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. భూయజమానులకు తెలియకుండా, వారికి నోటీసులు జారీ చేయకుండా జగనన్న భూరక్ష పేరుతో సర్వే నిర్వహించారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు మొదలు.. తహసీల్దార్ల వరకు డబ్బు కోసం తమ పనితనం చూపించారు. ఈ నేపథ్యంలో వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభంకానున్న రెవెన్యూ సదస్సుల్లో జగనన్న భూరక్ష సర్వే అక్రమాలే ప్రధాన అంశం కానున్నాయి.

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన సమస్త సమాచారం వీఆర్వోల వద్ద ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని అప్పట్లో వైసీపీ నాయకులు వీఆర్వోలను చెప్పుచేతల్లో పెట్టుకుని భూరికార్డులను ఇష్టారాజ్యంగా మార్చేశారు. పత్రాలు ఒకరి పేరు మీద ఉంటే అడంగల్‌లో మరొకరి పేరు ఉండేలా చేశారు. దాన్ని మార్పు చేయాలంటే వీఆర్వో, తహసీల్దార్లకు రూ.లక్షల్లో ముడుపు సమర్పించుకోవాల్సిన పరిస్థితి. మచిలీపట్నానికి చెందిన వైసీపీ కార్పొరేటర్‌కు పొట్లపాలెంలో కొంత భూమి ఉంది. ఆ భూమిలో 15 సెంట్లు తగ్గించేశారు. ఇదేమని వీఆర్వోను ప్రశ్నిస్తే.. స్థానిక వైసీపీ నాయకుడిని అడగమన్నారు. ఈ గొడవ చిలికిచిలికి గాలివానగా మారి అప్పటి మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని వద్దకు చేరింది.


మిగతా 6వ పేజీలో...

ఆలయ భూములు హాంఫట్

నందిగామ రామలింగేశ్వరస్వామి భూములు స్వాహా

తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు.. నందిగామలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూములను ఎవరు ఇష్టం వచ్చినట్టు వారు పంచుకుంటున్నారు. మొదట్లో స్వామివారికి 1,200 ఎకరాల భూమి ఉండగా, భూసేకరణ, అమ్మకాలు, ఆక్రమణల వల్ల ప్రస్తుతం 262.2 ఎకరాలకు తగ్గిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఇప్పటికే అనేక భూవివాదాలు కొనసాగుతుండగా, తాజాగా మరో వ్యవహారాన్ని దేవదాయ శాఖ అధికారులే తెరపైకి తెచ్చారు. రూ.వందల కోట్ల విలువైన స్థలాన్ని 33 ఏళ్ల లీజుకు బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతుండటంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వామివారికి జరిగిన నష్టాలను మననం చేసుకుంటూనే.. సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని చూస్తున్నారు. - నందిగామ

- దీర్ఘకాలిక లీజుల పేరుతో దోపిడీ యత్నాలు
- 60 ఎకరాల భూమి 33 ఏళ్లకు లీజుకిచ్చేందుకు సన్నాహాలు
- ఎకరం విలువ రూ.5 కోట్ల పైమాటే..!
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు
- గతంలో పారువేట మండపం లీజు వివాదం
- అనధికారికంగా భవనం నిర్మించిన లీజుదారుడు
- మూడు రోడ్లు వేసి అర ఎకరం లాగేశారు..!
- బైపాస్ రోడ్డు విస్తరణ నష్టపరిహారం కూడా ఉత్తుత్తే..
- తాజాగా 20 సెంట్ల నివాస స్థలంపైనా కన్ను



సోలార్ పవర్ ప్లాంట్‌కు లీజుకు ఇస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్న స్వామివారి ఆలయ భూములు (ఇన్‌సెట్‌లో) ఆలయ భూమి నుంచి అక్రమంగా వేసిన రోడ్డు

60 ఎకరాలు 33 ఏళ్ల లీజుకట..!

నందిగామలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన అత్యంత విలువైన భూములను సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణం నిమిత్తం బడా పారిశ్రామికవేత్తలకు అప్పగిస్తున్నట్లు తెలిసింది. పట్టణంలో అంతర్భాగమైన సర్వే నెంబర్ 822-1ఏ, 823-1ఏ, 824-1ఏ, 828-1ఏ, 837-1ఏలోని 55 ఎకరాలు, 821లోని 5.38 ఎకరాలను 33 ఏళ్ల లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమి విలువ ఎకరం రూ.5 కోట్లు ఉంటుంది. ఇంతటి విలువైన భూమిపై కన్నేసిన పారిశ్రామికవేత్తలు వైసీపీ అధికారంలో ఉండగానే, లీజు పేరుతో ఆక్రమించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఇంతలో ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడంతో కొద్దిగా వెనుకడుగు వేశారు. తాజాగా సదరు వ్యక్తులు తిరిగి తమ ప్రయత్నాలు ప్రారంభించారు. దేవదాయ శాఖలో అవినీతిపరులైన కొందరు అధికారుల సహకారంతో లీజుల డ్రామాకు తెరలేపారు. ఆలయ భూములను దీర్ఘకాలిక లీజులకు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఇటీవల నందిగామ వచ్చిన దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయ్‌కుమార్ మీడియాకు తెలిపారు. అయితే, దీనిని భక్తులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

పారువేట మండపంలో జరిగింది మరిచారా...?

వైసీపీ అధికారంలో ఉండగా స్వామివారి ఆలయానికి చెందిన పారువేట మండపం స్థలం దీర్ఘకాలిక (11 ఏళ్లు) లీజు పేరుతో వేలం వేశారు. సదరు భూమిలో లీజుదారుడు ఎటువంటి అనుమతులూ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా భవనాన్ని నిర్మించాడు. దీనిపై ఈవోను బాధ్యుడిని చేసి, సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు.. తప్ప లీజుదారుడిపై చర్యలు తీసుకోలేదు. ఎలాగూ భవన నిర్మాణం జరిగింది కనుక కొనసాగించుకోవచ్చని లీజుదారుడికి అనుకూలమైన ఉత్తర్వులిచ్చారు. ఆరు సెంట్ల భూమిని అద్దెకు తీసుకున్న వ్యక్తి ఇంత చేస్తే 50 ఎకరాలను 33 ఏళ్లపాటు లీజుకు తీసుకునే పారిశ్రామికవేత్తలు తిరిగి ఆలయానికి ఆ భూములు చెందనిస్తారా అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్ల పేరుచెప్పి అర ఎకరం స్వాహా

అయ్యప్పస్వామి ఆలయం సమీపంలోని సర్వే నెంబర్ 821లో 5.38 ఎకరాల నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్థలాల దిగువకు అక్రమంగా మూడు రోడ్లు వేశారు. దీనివల్ల స్వామివారికి చెందిన సుమారు అర ఎకరం భూమి అన్యాక్రాంతమైంది. మరోవైపు కొందరు అక్రమార్కులు ఈ భూమి నుంచి సుమారు 35 సెంట్లను ఆక్రమించారు. ఈ విషయాలు తెలిసి కూడా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారు.

మిగతా 6వ పేజీలో...

ఊరూరా..!

జిల్లావ్యాప్తంగా గ్రామ సభల సందడి

- 289 గ్రామాల్లో నిర్వహణ, 80 వేల మందికి పైగా హాజరు
- రూ.126 కోట్లతో ఉపాధి హామీ పనులకు ఆమోదం
- సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లకు పెద్దపీట
- పశువుల షెడ్లు, నీటి కుంటలకూ కేటాయింపులు



ఏ.కొండూరు మండలం కంభంపాడు గ్రామసభలో పాల్గొన్న గ్రామస్తులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో దిక్కులేకుండా, ప్రాధాన్యత లేకుండా పడి ఉన్న పంచాయతీలు మళ్లీ కళకళలాడుతున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో మళ్లీ గ్రామం వికసిస్తోంది. జిల్లావ్యాప్తంగా శనివారం జరిగిన గ్రామ సభలతో పండుగ వాతావరణం ఏర్పడింది. మొత్తం 289 గ్రామాల్లో సభలు జరగ్గా, గ్రామస్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా మొత్తం రూ.126 కోట్లతో చేపట్టాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఏకగ్రీవ తీర్మానాలతో తమ ఊర్లో చేసుకోవాల్సిన పనులను నిర్దేశించుకున్నారు. ఈ తీర్మానాలను డ్వామా అధికారులు స్వీకరించారు. కాగా, ఈ సభలకు ఒకరోజు ముందే ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయడం, అంతకుముందు పంచాయతీలకు బడ్జెట్‌ను పెంచడంతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ రెండు పరిణామాల తర్వాత మూడో ముఖ్యమైన అంశంగా ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే గ్రామాభివృద్ధి పనులకు కార్యాచరణ రూపొందించారు. జిల్లావ్యాప్తంగా జరిగిన గ్రామసభల్లో నియోజకవర్గాల ప్రాతిపదికన కలెక్టర్ సృజన పాల్గొన్నారు. డ్వామా పీడీ సునీత సమీక్షించారు.

రూ.126 కోట్లతో అభివృద్ధి పనులు

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లావ్యాప్తంగా రూ.126 కోట్లతో చేపట్టే పనులకు సంబంధించి గ్రామసభలో కీలక నిర్ణయం తీసుకున్నారు. చాలా గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు.. ఆ తర్వాత ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి నిర్ణయాలు తీసుకున్నారు. పశువుల షెడ్లకు పెద్దపీట వేశారు. సీసీ రోడ్లు, డ్రెయిన్లకు రూ.80 కోట్లు, పశువుల షెడ్లకు రూ.16.80 కోట్లు.. ఇతరత్రా పనులు ఈ జాబితాలో ఉన్నాయి.

బదిలీ బేరాలు

రిజిస్ట్రేషన్స్ శాఖలో సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్



- రూ.కోట్లు పలుకుతున్న హాట్ సీట్లు
- పటమటకు రూ.3 కోట్లు, గాంధీనగర్, గుణదలకు రూ.4 కోట్ల చొప్పున..
- విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం, గన్నవరం పోస్టులకు రూ.కోటి చొప్పున..
- చక్రం తిప్పుతున్న రాజకీయ పెద్దలు

సబ్ రిజిస్ట్రార్ల బదిలీల్లో రాజకీయ ప్రమేయం కనిపిస్తోంది. బదిలీల ముసుగులో రూ.కోట్లలో బేరాలు సాగిస్తున్నారు. విజయవాడ నగరం, శివారు ప్రాంతాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆఫర్ల మీద ఆఫర్లు ప్రకటిస్తూ భారీగానే దండుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్లను కదిలించేందుకు రంగం సిద్ధం కాగా, గ్రేటర్ విలీన జాబితా ప్రతిపాదనలో ఉన్న ప్రాంతాలు, ఇన్నర్, అవుటర్ రింగ్‌రోడ్ల అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే సబ్ రిజిస్ట్రార్ పోస్టులకు డిమాండ్ ఏర్పడింది. దీంతో రాజకీయ నాయకులు రంగప్రవేశం చేశారు. ఒక్కో పోస్టుకు భారీగా బేరాలు సాగిస్తున్నారు.

గుణదల, గాంధీనగర్‌కు డిమాండ్

గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు కూడా విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఈ కార్యాలయాల్లో పోస్టింగ్ కోసం రూ.2 కోట్ల ధర నిర్ణయించినట్లు సమాచారం. ఈ రెండు కార్యాలయాల్లో మొత్తం నలుగురు సబ్ రిజిస్ట్రార్లు ఉంటారు. జాయింట్-1, 2 సబ్ రిజిస్ట్రార్లకు సమంగా చెరి రూ.2 కోట్ల మేర ధర నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. మొత్తంగా ఒక్కో కార్యాలయానికి రూ.4 కోట్ల వరకు బేరం నడుస్తున్నట్టుగా సమాచారం. గుణదల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.92.42 కోట్ల ఆదాయం వచ్చింది. 2022-23లో రూ.107.79 కోట్లు, 2023-24లో రూ.138.12 కోట్లు వచ్చింది. దీనిని బట్టి చూస్తే.. రూ.50 కోట్ల మేర ఆదాయం పెరిగింది. లావాదేవీలు కూడా గణనీయంగా జరుగుతున్నాయి. దీంతో గుణదలను కూడా ఈసారి హిట్‌లిస్టులో పెట్టినట్టుగా తెలుస్తోంది. ఇవన్నీ చూస్తే ఒక్క విజయవాడలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనే రూ.11 కోట్ల మేర బేరం పెట్టినట్టు సమాచారం.

నున్న, ఇబ్రహీంపట్నం కూడా..

విజయవాడ రూరల్ ప్రాంతంలోని నున్న సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు కూడా డిమాండ్ ఏర్పడింది. ఇక్కడి పోస్టుకు రూ.కోటి బేరం పెట్టినట్టు సమాచారం. విజయవాడ మీదుగా బైపాస్ వెళ్లడం, రానున్న రోజుల్లో నాగపూర్-ముంబయి

మిగతా 6వ పేజీలో...

పటమటకు రూ.3 కోట్ల బేరం

ఆప్షన్ల పేరుతో సబ్ రిజిస్ట్రార్ల దగ్గర నుంచి రిక్వెస్టులు రాగా, పటమట, గుణదల, గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పెద్ద సంఖ్యలో మొదటి ఆప్షన్ ఇచ్చినట్టు తెలుస్తోంది. దీంతో పటమట సబ్ రిజిస్ట్రార్ పోస్టు రూ.3 కోట్ల వరకు ధర పలుకుతోంది. గతంలో రూ.కోటి, ఆ తర్వాత రూ.2 కోట్ల బేరం ఉన్న ఈ పోస్టు తాజాగా రూ.3 కోట్లకు చేరడం విశేషం. ఈ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు 2021-22లో రూ.148.57 కోట్లు, 2022-23లో రూ.214.39 కోట్లు, 2023-24లో రూ.238.02 కోట్ల ఆదాయం వచ్చింది. దాదాపు రూ.100 కోట్ల మేర ఆదాయం పెరిగింది. లావాదేవీలు కూడా బాగా జరుగుతున్నాయి. ఈ కారణంతో ఆదాయం కూడా జాస్తిగా ఉంటుందన్న పేరుతో ఇంత భారీ ధరను నిర్దేశించినట్టుగా తెలుస్తోంది.



ఇంద్రకీలాద్రిపై సామూహిక వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

శ్రావణ సందడి..

» మూడో శుక్రవారం పోటెత్తిన భక్తులు

» దుర్గగుడిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వన్‌టౌన్, ఆగస్టు 23 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శ్రావణమాసం మూడో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. మహామండపం ఆరో అంతస్తులో వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి అర్చకస్వాములు, వేద పండితులు వరలక్ష్మి వ్రత కార్యక్రమాన్ని నిర్వహింపచేశారు. తొలివిడత ఆర్జిత సేవ కింద సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. అనంతరం సుమారు 500 మంది మహిళలు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలలో పాల్గొన్నారు. వీరందరిచేత సంకల్ప పూర్వక వరలక్ష్మి వ్రతాన్ని చేయించారు. భక్తులకు అవసరమైన పూజాసామాగ్రిని దేవస్థానం సమకూర్చింది. అమ్మవారికి పూలు, పసుపు, కుంకుమలు, గాజులు, పరిమళ ద్రవ్యాలు, టెంకాయలు, అరటి పండ్లు, వివిధ రకాల ఫలాలు, వస్త్రం, తదితరాలను సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాన్ని డిప్యూటీ ఈవో లీలాకుమార్ పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అమ్మవారిని శీఘ్ర దర్శనం చేసుకున్నారు. డిప్యూటీ ఈవో లీలాకుమార్ భక్తుల నియంత్రణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు దుర్గామల్లేశ్వర దేవస్థానం మజ్జిగ పంపిణీ చేసింది.



లక్షకుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



శ్రావణ శుక్రవారం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు లక్ష కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శ్రీచక్ర నవావరణార్చన, ఖడ్గమాల, చండీహోమం తదితర కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న పురందేశ్వరి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి శుక్రవారం ఇంద్రకీలాద్రికి విచ్చేసి ఖడ్గమాలార్చనలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానంతరం ఆమెకు వేదపండితులు తీర్థ ప్రసాదాలు, ఆశీస్సులు అందజేశారు.

అన్నవితరణకు విరాళం..

విశాఖపట్నం, ఎంవీపీ కాలనీకి చెందిన పేరిచర్ల జానకిరామరాజు రూ.1,01,116లు విరాళాన్ని పేరిచర్ల రూపవతి రూ.1,01,116లు విరాళాన్ని మేనేజర్ రామకృష్ణ ద్వారా దుర్గగుడిలో అన్న వితరణ కార్యక్రమానికి శుక్రవారం విరాళంగా అందజేశారు.





ప్రత్యేక అలంకరణలో తిరుపతమ్మ, నిమ్మకాయల అలంకరణలో అంకమ్మవారు

తిరుపతమ్మ ఆలయంలో..

పెనుగంచిప్రోలు : శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో అర్చకులు పలు రకాల పుష్పాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. అదేవిధంగా ఉన్న ఊరు అంకమ్మ వారిని నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో జీవీడీఎన్ లీలాకుమార్, ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

రోడ్లపై నీరు నిలవకుండా చూడండి

» అనుమతులు లేని లేఅవుట్ల పై కఠిన చర్యలు

» మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ

చిట్టినగర్, ఆగస్టు 23 : వర్షాకాలంలో రోడ్లపై ఎక్కడా నీరు నిలవ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్లకు మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు జారీ చేశారు. సీఆర్డీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్లు, తదితరులు సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, డ్రెయిన్లలో పూడిక ఎప్పటికప్పుడు తీయించాలని సూచించారు. విజయవాడలో గురువారం రాత్రి వర్షానికి రోడ్లపై నీరునిల్వ ఉండటాన్ని గమనించి మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్రను ప్రశ్నించారు. అన్ని మునిసిపాలిటీలలో రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. అనుమతి లేని లే అవుట్లపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అటువంటి లే అవుట్లపై భారీ జరిమానాలు విధించేలా ఆలోచన చేస్తున్నామన్నారు. పట్టణాలలో కుళాయి కనెక్షన్ల సర్వేలు త్వరగా పూర్తి చేయాలన్నారు. రోడ్లపై పశువులు, పందులు కనపడకూడదని తెలిపారు. మరో 15 రోజుల్లో కార్యక్రమాలన్నీ పూర్తి కావాలన్నారు. వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ గురించి వివరించారు. సెప్టెంబర్ 30 నాటికి పందులు కనపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవం ఘనంగా నిర్వహించాలి

» శాప్ ఎండీ గిరిషా

విజయవాడ స్పోర్ట్సు : హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పేరున ఏటా ఆగస్టు 29న జరిగే జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని శాప్ వీసీ, ఎండీ గిరిషా అధికారులను కోరారు. శుక్రవారం శాప్ ప్రధాన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. 26 మంది డీఎస్‌డీవోలు ఆ రోజు కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలు, కార్యాచరణలను గిరిషా వివరించారు. కార్యక్రమంలో శాప్ గిరిజన క్రీడాధికారి ఎస్.వెంకటరమణ, కోచ్‌లు కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

పేదల ఉపాధి లక్ష్యంగా..

» జీవనప్రమాణాలు పెంపొందించేందుకే గ్రామసభలు

» కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి : ఉపాధి పథకాన్ని పేదలు సద్వినియోగం చేసుకుని వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకే గ్రామసభలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి పథకం పేదలకు పని కల్పించే విశిష్టమైన పథకమని, ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించటం ప్రభుత్వ బాధ్యత కాగా, కల్పించిన పనులు చేయడం లబ్ధిదారుల హక్కు అన్నారు. పనులు కోరిన 15 రోజుల్లో పనులు కల్పించడటంతోపాటు లబ్ధిదారుల ప్రదేశంలోనే పనులు కల్పిస్తారని, 5 కిలోమీటర్లకు పైగా దూరంలో పనులు కల్పిస్తే 10 శాతం అదనపువేతనం పొందే హక్కు లబ్ధిదారుకు ఉంటుందన్నారు.



చల్లపల్లి సర్పంచ్ కృష్ణకుమారిని సన్మానిస్తున్న కలెక్టర్ బాలాజీ

గ్రామాల సర్వతోముఖాభివృద్ధి : వసంత

ఇబ్రహీంపట్నం రూరల్ : సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నేతృత్వంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పెద్ద ఎత్తున గ్రామ సభలు నిర్వహించినట్టు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం జూపూడిలో ఉపాధి పనుల గుర్తింపు గ్రామ సభలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజనతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రూ.22.50 కోట్లతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామన్నారు. డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులతో మరిన్ని పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. కలెక్టర్ జి.సృజన మాట్లాడుతూ, గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్ముని ఆశయాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేస్తుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలాభివృద్ధి ప్రణాళికల రూపకల్పన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న, సర్పంచ్ కె.దేవమాత, డ్వామా పీడీ జె.సునీత, డీపీవో ఎన్.వి శివ ప్రసాద్‌యాదవ్, టీడీపీ నేతలు జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజ), గొర్నేని గాంధీ, పిచ్చేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జూపూడి గ్రామసభలో కలెక్టర్ సృజనకు కొండపల్లి బొమ్మను బహూకరిస్తున్న ఎమ్మెల్యే వసంత

నోవా, నిమ్రాపై ఫిర్యాదులు : స్థానికంగా నోవా, నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలపై గ్రామ సభలో గ్రామస్థులు కలెక్టర్, ఎమ్మెల్యే వసంతకు ఫిర్యాదులు చేశారు. నోవా కళాశాల గత పదేళ్లుగా పంచాయతీకి పన్నులు చెల్లించడం లేదని, నిమ్రా కళాశాల రెండేళ్లుగా పన్నులు చెల్లించడం లేదని ఫిర్యాదు చేశారు.



భోగిరెడ్డిపల్లిలో పింఛన్లు కోరుతూ గోడు వినిపిస్తున్న మహిళలు

పింఛన్లు ఇప్పించండి..

» భోగిరెడ్డిపల్లిలో అంగన్వాడీ భవనం పూర్తి చేయాలి

» మంత్రి రవీంద్రకు వినతుల వెల్లువ



చిన్నాపురం ఇంటర్ విద్యార్థి ఆదిత్యకు హామీ ఇస్తున్న మంత్రి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23 : బందరు రూరల్ మండలంలో శుక్రవారం భోగిరెడ్డిపల్లి, చిన్నాపురంలలో జరిగిన గ్రామసభల్లో మంత్రి కొల్లు రవీంద్రకు ప్రజలు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. భోగిరెడ్డిపల్లిలో అంగన్వాడీ కేంద్ర భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలని మంత్రిని కోరారు. తమకు పింఛన్లు మంజూరు చేయించాలంటూ పలువురు వృద్ధులు, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లునిర్మించాలని, గ్రామ శివారు రామఖండంలో స్మశానం నిర్మించాలని, ఊరిలో చెరువు తవ్వించి ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని గ్రామ ప్రజలు కోరారు. చెరువు తవ్వించేందుకు సీలింగ్ భూమి అందుబాటులో ఉందన్నారు. బందరు నుంచి భోగిరెడ్డిపాలెం గ్రామానికి ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరించాలని కోరారు. బస్సును అర్థాంతరంగా ఆపివేయడం వల్ల ప్రజలు తీవ్ర అవస్థలకు గురవుతున్నారన్నారు. చిన్నాపురంలో తాగునీటి సౌకర్యం మెరుగు పరిచేందుకు చెరువును ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి ఇవ్వాలని గ్రామ ప్రజలు కోరారు. చెరువుకు ర్యాంపు వేయించాలని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతులిచ్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థి కె.ఆదిత్య శస్త్రచికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

ఆలయ భూములు హాంఫట్

(5వ పేజీ తరువాయి)

భక్తుల ఒత్తిడి మేరకు సర్వే నిర్వహిస్తున్న అధికారులు సరైన కొలతలు వేయకుండా అక్రమార్కులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపడుతున్నారు. ఈ భూమి విలువ సెంటు రూ.20 లక్షల వరకూ ఉంటుంది. రోడ్లతో పాటు ఆక్రమణకు గురైన మొత్తం భూమి విలువ రూ.10 కోట్ల వరకూ ఉంటుంది.

రూ.20 కోట్ల నష్టపరిహారం ఎక్కడ..?

బైపాస్ రోడ్డు విస్తరణ సందర్భంగా 828-1ఏ, 837-1ఏ నుంచి 2.10 ఎకరాలను హైవే అథారిటీ సేకరించింది. ఇక్కడ అందరికీ గజాలలో పరిహారం ఇచ్చిన ఆ శాఖ అధికారులు స్వామివారి ఆలయానికి చెందిన 2.10 ఎకరాలకు మాత్రం ఎకరాల్లో లెక్కకట్టి రూ.58 లక్షలే చెల్లించారు. దీనివల్ల ఆలయానికి రూ.20 కోట్ల వరకూ నష్టం వాటిల్లింది. దీనిపై భక్తులు పలు ఆందోళనలు చేశారు. విచారణ జరిపిన గత కలెక్టర్ ఆ రూ.20 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. ఆ సొమ్ము కోసం దేవదాయ శాఖ అధికారులు ఇప్పటికీ కనీస ప్రయత్నాలు కూడా చేయలేదు.

20 సెంట్ల నివాస స్థలం కొట్టేసే కుట్ర..!

స్వామి ఆలయం వెనుక ఉన్న మరో ఆలయానికి చెందిన 20 సెంట్ల నివాస స్థలం విషయంలో కూడా కుట్ర జరుగుతున్నట్లు భక్తులు అనుమానిస్తున్నారు. సుమారు రూ.10 కోట్ల విలువైన ఈ భూమి కోసం కొందరు అక్రమార్కులు దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. సదరు భూమిని ప్రాపర్టీ రిజిస్టర్ నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది.

పాలకులు స్పందించాలి

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ భూముల విషయంలో పాలకులు స్పందించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ వేసి ఆలయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని, లీజుల పేరుతో అన్యాక్రాంతాన్ని నివారించాలంటున్నారు. అక్రమాలకు తావిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, త్వరలో ముఖ్యమంత్రిని కలిసి వివరించాలని భక్తులు యోచిస్తున్నారు.

భూ భక్షకులు

(5వ పేజీ తరువాయి)

ఆయన కూడా తానేం చేయలేనంటూ చేతులెత్తేయడంతో చేసేది లేక సదరు కార్పొరేటర్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసుకోవాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆ 15 సెంట్లు ఆయన ఖాతాలోకి చేరలేదు.

గన్నవరం నియోజకవర్గంలో ఇష్టారాజ్యం

గన్నవరం నియోజకవర్గంలో అప్పటి ఎమ్మెల్యే వంశీ జగనన్న భూరక్షను ప్రత్యర్థులపై ప్రతీకారం తీర్చుకోవడానికి వాడుకున్నారు. టీడీపీ నాయకులు, సానుభూతిపరుల భూముల రికార్డులను తప్పులతడకగా మార్చేశారు. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు మండలాల్లో ఇలాంటి వ్యవహారాలు ఎక్కువగా చోటుచేసుకున్నాయి.

ఆ వీఆర్వో పేరు చెబితే హడల్

ఉంగుటూరు మండలంలో తహసీల్దార్‌గా ముత్యాల శ్రీనివాస్ పనిచేసే కాలంలో వెబ్‌ల్యాండ్ వ్యవహారాలను అడ్డగోలుగా చక్కబెట్టే వారిని దగ్గరకు చేర్చుకున్నారు. ఈ క్రమంలో అప్పట్లో వీఆర్ఏలుగా పనిచేసే వినోద్, మూర్తి అనేవారికి వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించి మరీ చేరదీశారు. ఆ తర్వాత కొంతకాలానికి తహసీల్దార్‌గా వచ్చిన వనజాక్షి కూడా వీఆర్వో వినోద్‌కు ప్రాధాన్యతనిచ్చారు. ప్రమోటీ వీఆర్వోగా గన్నవరం వచ్చిన వినోద్ ఆ తర్వాత డిప్యుటేషన్‌పై ఉంగుటూరు మండలానికి చేరారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో కింగ్ మేకర్‌గా ఎదిగారు. తహసీల్దార్‌గా పనిచేసిన వనజాక్షికి కుడిభుజంగా వ్యవహరించేవారు. మండలంలో వినోద్‌ను అడంగల్ స్పెషలిస్ట్ అని పిలుస్తారు. అడంగల్‌లో అడ్డగోలుగా పేర్లు మార్చేస్తాడన్న ఆరోపణలు ఉన్నాయి. తన పేరుతో మూడు ఎకరాలను కూడా ఈ విధంగానే వెబ్‌ల్యాండ్‌లో ఎక్కించాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఎక్కువ భాగం ఉంగుటూరు మండలంలోనే పనిచేశారు. రైతులెవరైనా పాస్‌బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇక అంతే సంగతులు. పాస్‌బుక్ దరఖాస్తులను తన దగ్గరే తొక్కి పట్టేస్తారన్న పేరుంది. అడంగల్‌లో పట్టా నెంబరు ఉన్న కేసులకు పాస్‌బుక్‌లు ఇచ్చే సందర్భంలో రైతులకు చుక్కలు చూపిస్తాడు. పోరంబోకు భూములని మెలిక పెడతాడని, మళ్లీ వాటిని సరిచేయటానికి రూ.లక్షల్లో లంచం అడుగుతాడని స్థానిక రైతులు వాపోతున్నారు. అడంగల్‌లో పట్టా ఉన్నప్పుడు పాస్‌బుక్ ఇవ్వటానికి పోరంబోకు ఎలా అవుతుందో అర్థం కావట్లేదని లబోదిబోమంటున్నారు. గతంలో ఇష్టానుసారంగా డబ్బు తీసుకుని అడంగల్‌లో పేర్లను కూడా మార్చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వీఆర్వో అవినీతి వ్యవహారాలపై గతంలో స్థానికుడైన వి.రామకృష్ణప్రసాద్ అప్పటి తహసీల్దార్ వనజాక్షి దృష్టికి పదేపదే తీసుకెళ్లినా విచారణ జరపలేదు. అతనిపై చర్యలు కూడా తీసుకోలేదు. లంచాలు తీసుకునే విషయంలో వీఆర్వో చాలా తెలివిగా వ్యవహరిస్తాడు. నేరుగా లంచం ఎప్పుడూ తీసుకోడు. డీల్ కుదిరాక ఫలానా వ్యక్తులకు డబ్బు ఇవ్వాలని తెలియచేస్తాడు. అధికారంలో ఏ పార్టీ ఉంటే వారితో చెట్టపట్టాల్ వేసుకుని తిరుగుతాడన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆపరేషన్ హెల్మెట్!

» స్పీడ్ పెంచిన ట్రాఫిక్ కాప్స్

» హెల్మెట్ ధారణ తప్పనిసరికి ప్రణాళికలు

» హెల్మెట్ లేకపోతే వాహనం సీజ్

» హెల్మెట్ తెచ్చుకున్నాకే వాహనం విడుదల

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : దేశంలోని మెట్రోపాలిటన్ నగరాల్లో రహదారులపై ఎటుచూసినా ద్విచక్ర వాహనదారుల తలపై హెల్మెట్లు కనిపిస్తాయి. దూరంతో సంబంధం లేకుండా బైక్‌పై బయటకు వచ్చారంటే తలపై హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తారు. రాజధాని అమరావతిలో భాగంగా ఉన్న విజయవాడలో ద్విచక్ర వాహనదారులు మాత్రం హెల్మెట్ సంస్కృతికి పూర్తిగా అలవాటు పడటం లేదు. హెల్మెట్ ధరించడం తలపై భారంగా భావిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు చెల్లించడానికి సిద్ధమవుతున్నారే తప్ప హెల్మెట్‌ను పెట్టుకోవడానికి ఇష్టపడటం లేదు. నగరంలో బ్లాక్‌స్పాట్‌ల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికి హెల్మెట్ లేకపోవడమే కారణమని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు నగరంలో తిరిగే ప్రతి వాహనదారుడి తలపై హెల్మెట్ ఉండేలా చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం నగర వ్యాప్తంగా ఆపరేషన్ హెల్మెట్ చేపట్టారు.

చిక్కితే బైక్ సీజ్

వాహనదారులు నగరంలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్‌ను కచ్చితంగా ధరించాలని కొద్దిరోజులుగా అన్ని విద్యాసంస్థలు, యూత్ క్లబ్‌ల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహనాల కొత్త చట్టం ప్రకారం జరిమానాలు ఏవిధంగా ఉంటాయో వివరించారు. అయినప్పటికీ విజయవాడలో హెల్మెట్‌ధారణ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కొద్దినెలలుగా ట్రాఫిక్ పోలీసులు వివిధ కూడళ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి చలాన్లు విధిస్తున్నారు. అయినా హెల్మెట్ ధారణ పెరగకపోవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ మోతాదును పెంచారు. తనిఖీల సమయంలో హెల్మెట్ లేకపోతే వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. వాహనాలను ఎంజీ రోడ్డులో ఉన్న కేఎస్ వ్యాస్ ట్రాఫిక్ కాంప్లెక్స్ వెనుక గల ఏఆర్ గ్రౌండ్‌కు తరలిస్తున్నారు. సంబంధిత వాహనదారులు హెల్మెట్ తీసుకొచ్చిన తర్వాత మాత్రమే వాహనాలను విడుదల చేస్తున్నారు. హెల్మెట్ తెచ్చుకున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు. కొంత మంది వాహనదారులు ఇళ్లకు ఫోన్లు చేసి హెల్మెట్లను రప్పించుకుంటున్నారు. మరికొంతమంది సమీపంలో ఉన్న ఆటోమొబైల్ షాపులకు వెళ్లి హెల్మెట్లను కొనుగోలు చేస్తున్నారు. ఇలా కఠినంగా వ్యవహరిస్తే వాహనదారుల్లో మార్పు వస్తుందని ట్రాఫిక్ పోలీసులు భావిస్తున్నారు. రోజుకు నగరంలో మొత్తం 200 కేసులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారికి సంబంధించినవే ఉంటున్నాయి.



రెండు నెలలు.. 10వేలకు పైగా కేసులు

ట్రాఫిక్ పోలీసులు హెల్మెట్ ధారణపై ముఖ్యంగా దృష్టి సారిస్తున్నారు. ప్రతి వాహనదారుడి తలపై హెల్మెట్ ఉండేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. విజయవాడలోని ప్రతి కూడలి, విశాలంగా ఉన్న ప్రదేశాల వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నారు. రెండు నెలల కాలంలో కేవలం హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై 10,817 కేసులు నమోదు చేశారు. గడచిన నెలలో మొత్తం 6170 కేసులు నమోదు చేశారు. అందులో 220 మంది వాహనదారులు జరిమానాలు చెల్లించారు. ఇంకా 5950 మంది చలాన్లను చెల్లించాల్సి ఉంది. ఆగస్టులో ఇప్పటి వరకు 4647 కేసులను నమోదు చేశారు. వారిలో 128 మంది చలాన్లు చెల్లించారు. మరో 4519 చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎట్టకేలకు.. చిక్కాడు

» నగరంలో వరుస స్నాచింగ్‌లు

» సీసీఎస్ పోలీసుల అదుపులో యువకుడు

» రూ.6.10లక్షల ఆభరణాలు స్వాధీనం



విలేకర్లకు కేసు వివరాలను వెల్లడిస్తున్న సీసీఎస్ ఏసీపీ స్రవంతిరాయ్, ఇతర అధికారులు

విజయవాడ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసం కోసం పొరుగు జిల్లా నుంచి బెజవాడకు వచ్చాడు. స్నేహితులతో కలిసి ఒక రూంలో ఉంటూ డిగ్రీ పట్టా పొందాడు. కాలేజీ రోజుల్లో తిరిగిన వీధులను ఇప్పుడు స్నాచింగ్ పాయింట్లుగా మార్చుకున్నాడు. చివరికి సీసీ కెమెరాల్లో చిక్కి పోలీసులకు దొరికిపోయాడు. ఈ వివరాలను సీసీఎస్ ఏసీపీ స్రవంతిరాయ్, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పటమట ఇన్‌స్పెక్టర్ వి.పవన్ కిషోర్‌తో కలిసి శుక్రవారం వెల్లడించారు. యన్నం సాయితేజరెడ్డి బీఏ పూర్తి చేశాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటకు వద్ద లింగంగుంట్ల గ్రామానికి చెందిన తేజ విజయవాడలో విద్యాభ్యాసం పూర్తి చేశాడు. అతడి తండ్రి వడ్డీ వ్యాపారి. విజయవాడలో స్నేహితులతో కలిసి రూంలో ఉండేవాడు. కాలేజీ చదువుతున్నప్పుడు నగరంలో అన్ని ప్రాంతాలపై అవగాహన పెంచుకున్నాడు. డిగ్రీ తర్వాత స్వగ్రామం వెళ్లిన తేజ వ్యవసనాలకు అలవాటుపడ్డాడు. మద్యం, సిగరెట్లు, క్రికెట్ బెట్టింగ్‌ల రుచి మరిగాడు. చెడు వ్యసనాలకు డబ్బులు లేకపోవడం, ప్రతిసారి ఎక్కువ మొత్తంలో తండ్రిని డబ్బులు అడిగితే అనుమానం వస్తుందన్న ఆలోచనతో చోరీలను ఎంచుకున్నాడు. నరసరావుపేట నుంచి బైక్ తీసుకుని, హెల్మెట్ వెంట పెట్టుకుని విజయవాడకు వస్తున్నాడు. స్నేహితుల వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పేవాడు. ఇక్కడికి వచ్చిన తర్వాత మాచవరం, పటమట ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించి ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసుకునేవాడు. వారి పక్క నుంచి వెళ్లి మెడలో ఉన్న బంగారు గొలుసులను లాక్కుని వెళ్లిపోయేవాడు. ఆ వస్తువులను అమ్మడం, తాకట్టు పెట్టడం ద్వారా వచ్చిన డబ్బులతో ఎంజాయ్ చేసేవాడు. జేబులు ఖాళీ అయిన తర్వాత మళ్లీ విజయవాడకు వచ్చి స్నాచింగ్‌లు చేసేవాడు. ఈవిధంగా మాచవరం, పటమట పోలీస్‌స్టేషన్ల పరిధిలో మూడు స్నాచింగ్‌లు చేశాడు. నరసరావుపేటలో మరో స్నాచింగ్ చేశాడు. విజయవాడలో ఇంకో నాలుగు స్నాచింగ్‌లకు విఫలయత్నం చేశాడు. స్నాచింగ్‌లు జరిగిన ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. అన్ని ఫుటేజీల్లోను బైక్ నంబరు ఒకేలా ఉండడంతో దాని ఆధారంగా తేజ చిరునామాను పోలీసులు గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని 87గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6.10లక్షలు ఉంటుంది.

బదిలీ బేరాలు

(5వ పేజీ తరువాయి)

ఎకనమిక్ కారిడార్‌లో భాగంగా ఖమ్మం-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు జరుగుతుండటం, సీఆర్డీఏ ఇన్నర్ రింగ్‌రోడ్డు ప్రతిపాదనను దృష్టిలో ఉంచుకుని నున్నకు డిమాండ్‌ను సృష్టించారు. నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.62.59 కోట్ల ఆదాయం వచ్చింది. ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ పోస్టును కూడా ఇన్నర్, ఎన్‌హెచ్-30, అవుటర్ రింగ్ తదితరాలను దృష్టిలో ఉంచుకుని భారీగా పెంచారు. ఇబ్రహీంపట్నం పోస్టుకు కూడా రూ.కోటి ధర పలుకుతున్నట్టు తెలుస్తోంది.

గన్నవరానికి కూడా గిరాకీ

కృష్ణాజిల్లా పరిధిలోని గన్నవరం సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు కూడా బేరం పెట్టడం గమనార్హం. గన్నవరం ర్యాపిడ్ గ్రోత్ ఏరియా పరిధిలో ఉంది. ఇక్కడ విజయవాడ వెస్ట్, ఈస్ట్ బైపాస్‌లు, సీఆర్డీఏ ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు, ఐటీ సెజ్‌లు, ఇండస్ట్రియల్ పార్కుల కారణంగా ఈ ప్రాంతం శరవేగంగా విస్తరిస్తోంది. రియాలిటీ రంగం అనూహ్యంగా పురోగమిస్తోంది. ఈ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఆదాయం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.53.64 కోట్లు ఉండగా, 2022-23లో రూ.61.96 కోట్లను సాధించింది. 2023-24లో అయితే రూ.81.18 కోట్ల ఆదాయం సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లకు చేరవచ్చంటున్నారు. దీంతో గన్నవరం సబ్ రిజిస్ట్రార్ పోస్టుకు కూడా రూ.కోటి ధర నిర్దేశించినట్టుగా తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, ఆగస్టు 23 : భవానీపురం పరిధిలోని 11 కెవి హైవే ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వి.వి. సుధాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వరరావు ఫౌండ్రీ రోడ్డు, హైవే రోడ్డు, వెంకటేశ్వర ఫౌండ్రీ నుంచి స్వాతి థియేటర్ వరకు, ఆశ్రమం రోడ్డు, బేతపూడి అరుణకుమారి రోడ్డు, బాజీబాబా మందిరం రోడ్డు, సభాపతి రోడ్డు, అవుట్ ఏజెన్సీ, మీరా సాహెబ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో సూచించిన సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఇండియన్ బ్యాంక్ అధికారులు, సిబ్బంది

ఇండియన్ బ్యాంక్ సేవలపై వాక్‌థాన్

లబ్బీపేట, ఆగస్టు 23 : వినియోగాదారులకు అత్యుత్తమైన సేవలందించడంలో ఇండియన్ బ్యాంక్ ముందంజలో ఉంటుందని బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రాజేష్ అన్నారు. ఇండియన్ బ్యాంక్ 118వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బ్యాంక్ జోనల్ కార్యాలయం సిబ్బంది బీఆర్‌టీఎస్ రోడ్డులో బ్యాంక్ అందించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వాక్‌థాన్ నిర్వహించారు. బ్యాంక్ వినియోగదారులకు నమ్మకమైన సేవలందిస్తోందన్నారు. వివిధ రుణాలు అందజేస్తూ ప్రజా మన్ననలు పొందుతోందన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బ్యాంక్ అందిస్తున్న సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిసున్నామని దానిలో భాగంగా వాక్‌థాన్ నిర్వహించినట్లు తెలిపారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ డి.రామారావు తదితరులు పాల్గొన్నారు.



కోల్‌కతా హత్యాచార ఘటనకు ఐద్వా నిరసన

చిట్టినగర్, ఆగస్టు 23 : కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచార ఖండిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శుక్రవారం మహంతీపురం ఖాదర్ సెంటర్ నుంచి పంజా సెంటర్ వరకు విద్యార్థులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాలికలకు, మహిళలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. ఐద్వా ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కార్పొరేటర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ, అశ్లీల సాహిత్యం, యూట్యూబ్, సోషల్ మీడియా వలన యువత చెడుమార్గంలో ప్రయాణిస్తున్నందున వాటిని నిషేధించాలన్నారు. ఐద్వా నగర కార్యదర్శి జీ, ఆదిలక్ష్మి, కె.వి. టాలెంట్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె.ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఏటీఏ ఎన్నికకు పోటాపోటీగా ప్రచారం

ఆటోనగర్ : ఆటోమొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ (ఏటీఏ) అధ్యక్ష ఎన్నికకు ప్రచారం హోరందుకుంది. 14 అనుబంధ సంఘాలకు చెందిన రెండు వేల మందికి పైగా సభ్యులున్న ఏటీఏ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. మూడు విడతలుగా అధ్యక్షుడిగా పనిచేసిన ఏటీఏ పూర్వ అధ్యక్షుడు రాజనాల వెంకటరమణారావు(బాబ్జీ), కొత్తగా అధ్యక్షపదవికి పోటీలో ఉన్న గంధం వెంకటేశ్వరరావు (కొండ) ఎవరి గెలుపుపై వారు ధీమాగా ఉన్నారు. ఎవరికివారు వివిధ పద్ధతుల్లో ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డారు. ఆటోనగర్‌లోని ప్రతి వీధి శుక్రవారం తిరిగి ఓటు వేయమని అభ్యర్థించారు. ఏటీఏ అభివృద్ధికి తాను చేసిన కృషే తనను అధ్యక్షునిగా గెలిపిస్తుందని బాబ్జీ ప్రచారం నిర్వహిస్తుండగా, మరో వైపు గంధం కొండ ఏటీఏ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని, పూర్వ అధ్యక్షుడిపై ఉన్న వ్యతిరేకత తనను గెలిపిస్తుందని, ఈ సారికి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.



అన్నక్యాంటీన్ వద్ద క్యూలైన్‌లో వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



లక్ష్మీపార్వతికి ఆర్థిక సహాయం అందజేస్తున్న గద్దె క్రాంతి కుమార్

అన్నక్యాంటీన్లలో నాణ్యమైన భోజనం అందిస్తాం

లబ్బీపేట, ఆగస్టు 23 : అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి రాజీపడకుండా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శుక్రవారం 18వ డివిజన్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు, ఈ సందర్భంగా అక్కడ భోజనం చేస్తున్న వారితో అక్కడి ఏర్పాట్లు, భోజన నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు, అదేవిధంగా నిర్వాహకులతో మాట్లాడి పరిశుభ్రంగా, వేడిగా ఆహారాన్ని అందించాలని సూచించారు. అనంతరం మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చే ప్రదేశాలుగా అన్న క్యాంటీన్లు మారాయని, ఈ క్యాంటీన్లు ఏర్పాటు నుంచి ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, ప్రజలకు అందించే పరిమాణం, క్యాంటీన్ల పరిసరాల నిర్వహణ ఇలా ఏవిషయంలోనూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజీపడకుండా వీటిని ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లో 100 క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, పూటకు 5రూపాయలతో పేదల ఆకలిని తమ ప్రభుత్వం తీరుస్తుందన్నారు.

మహిళకు ఆర్థిక సాయం

లబ్బీపేట : టీడీపీ రాజకీయ పార్టీగానే కాకుండా స్వచ్ఛంద సంస్థలా పనిచేస్తుందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అన్నారు. 19వ డివిజన్‌లో శుక్రవారం పర్యటించిన ఆయన కాపు కళ్యాణ మండపం ఏరియాకు చెందిన నల్లమామిడి లక్ష్మీ పార్వతికి వైద్యఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గద్దె హేమాన్ష్, డివిజన్ అధ్యక్షులు భాగం సాయిప్రసాద్, ఎస్.ఫిరోజ్, దున్నా ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు జాతీయ స్థాయి క్విజ్ పోటీలు

పటమట, ఆగస్టు 23 : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జోనల్ ఆఫీస్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ మేరిస్ స్టెల్లా కళాశాల ఆడిటోరియలో జాతీయ స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించినట్లు యూబీఐ చీఫ్ మేనేజర్ కె.జయశ్యామ్ తెలిపారు. ఈ క్విజ్ పోటీలల్లో వివిధ ప్రాంతాలకు చెందిన 450 పాఠశాలల్లో ఎనిమిని నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 1200 మంది పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎన్‌టీఆర్ జిల్లా ఆరోగ్య సేవ ముఖ్య కార్యనిర్వహణాధికారి లక్ష్మీషా విచ్చేసి విద్య ప్రాముఖ్యతను వివరించారు. జనరల్ మేనేజర్, జోనల్ హెడ్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ ఎన్ భాస్కరరావు, డిప్యూటీ జోనల్ హెడ్ శారదమూర్తి, ఎం శ్రీధర్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



వన్‌టౌన్, ఆగస్టు 23 : మూడో శుక్రవారం సందర్భంగావన్‌టౌన్‌లోని భ్రమరాంబ మల్లేశ్వర దేవస్థానం (పాత శివాలయం)లోఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతం, కుంకుమ పూజలను నిర్వహించారు. అమ్మవారికి విశేషంగా పుష్పలంకరణ చేశారు. దేవస్థానం ఈవో కానూరి సురేష్ బాబు, ధర్మకర్తల మండలి చైర్మన్ బొమ్ము మధు, బోర్డు సభ్యులు శ్రీదుర్గ శివసాయి సేవా సంఘం, తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ సుమంత శర్మ, నాగరాజు శర్మ, కొత్తపల్లి సాయికృష్ణ శర్మ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీవ్రతాలు, కుంకుమార్చన వంటి పూజాధికాలు జరిగాయి.

చిట్టినగర్ : పాతబస్తీలోని ఆలయాలన్నీ శుక్రవారం భక్తులతో కళకళలాడాయి. చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారిని అర్చకులు అమరలింగేశ్వర ప్రసాదశర్మ ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకొని తమ కుటుంబం ఆయురాగ్యోలతో, సుఖ సౌబాగ్యాలతో ఉండేలా చూడాలని ఆలయప్రాంగణంలో కుంకుమ పూజలు చేశారు.

- కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలోని గంగానమ్మ, మంగళగౌరి, శాంభవి అమ్మవార్లకు శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లను పూలతో ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు.
- శ్రావణ శుక్రవారంను పురస్కరించుకొని నాగమ్మసత్రం ప్రాంతంలోని వీరాంజనేయ స్వామి ధ్యానమందిరంలోని కాశీ అన్నపూర్ణ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- పాలప్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ పక్కనే గల విజయదుర్గా రామలింగేశ్వరస్వామి, పంచముఖ అంజనేయ స్వామి దేవస్థానం శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

19 యాంటీ నార్కోటిక్ బీట్లు

వన్‌టౌన్, ఆగస్టు 23 : మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాలను అరికట్టే క్రమంలో తీసుకుంటున్న చర్యల్లో భాగంగా విజయవాడ సూర్యారావుపేట, గవర్నర్‌పేట, కృష్ణలంక పరిధిలలో 19 యాంటీ నార్కోటిక్ బీట్లను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. యాంటీ నార్కోటిక్ బీట్లను పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు డిప్యూటీ పోలీస్ కమిషనర్ గౌతమి శాలి పర్యవేక్షణలో ఏసీపీ దామోదర్ ఆధ్వర్యంలో కృష్ణలంక, గవర్నర్‌పేట, సూర్యారావుపేట పరిధిలో తనిఖీలు నిర్వహించారు. సీఐలు మాట్లాడుతూ, గంజాయి అమ్మినా, కొన్నా అటువంటి వారిని సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐలు నాగరాజు, షేక్ అహ్మద్ ఆలీ, సత్యనారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి కన్పించడం లేదని ఫిర్యాదు

వన్‌టౌన్, ఆగస్టు 23 : యువతి కన్పించడం లేదని భవానీపురం పోలీస్ స్టేషన్లలో శుక్రవారం కేసులు నమోదయ్యాయి. ఒంగోలులో తల్లిదం డ్రులతో ఉంటున్న ఓ యువతి (23) స్థానికంగా ఓ యువకుడిని ప్రేమించింది. ఈ విషయం తెలుసుకున్న ఆ యువతి తండ్రి కుమార్తెను నాలుగు రోజుల క్రితం భవానీపురం భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి తీసుకువచ్చాడు. ఆ యువతి ఇంటిలో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లింది. యువతి బంధువు ఇంటికి వచ్చి చూడగా కనిపించకపోవటంతో సమీపంలో ఉన్న సీసీ పుటేజ్‌ను పరిశీలించారు. ఓ వ్యక్తి కారులో రాగా, ఆ యువతి కారులో వెళ్లినట్లు గుర్తించారు. యువతి బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుమారుడు కన్పించడం లేదని..

దుర్గమ్మ దర్శనానికి వచ్చిన సత్యసాయి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి (54) కన్పించడం లేదని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సత్యసాయి జిల్లా, పుట్టపర్తి మండలం పైపల్లి గ్రామానికి చెందిన హరిజన్ ముత్యాలప్ప (82) కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఇతనికి ఐదుగురు సంతానం. ఇతని కుమారుడు హరిజన్ నరసింహులకు వివాహమైంది. ఇతనికి ఇద్దరు సంతానం. భార్యభర్తలు మనస్పర్థలు కారణంగా ఇద్దరు విడిపోయారు. అప్పటి నుంచి నరసింహులు తండ్రి వద్ద ఉంటున్నాడు. నరసింహులకు మతిస్థిమితం సరిగ్గా ఉండకపోవటంతో అతనిని తండ్రి బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాడు. ఈ క్రమంలో తండ్రి కొడుకులు ఈనెల 14వ తేదీ ఉదయం కనకదుర్గమ్మ దర్శనానికి విజయవాడ వచ్చారు. ఉదయం 10 గంటలకు దర్శనం చేసుకుని కొబ్బరికాయలు కొట్టే ప్రదేశానికి వెళ్లారు. అక్కడ నరసింహులు కనిపించలేదు. చుట్టు ప్రక్కల వెతికినప్పటికీ, బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ నరసింహులు ఆచూకీ లభించలేదు. తండ్రి ముత్యాలప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దోమల నిర్మూలనకు సమష్టి కృషి

సత్యనారాయణపురం : సమష్టికృషితోనే దోమల నిర్మూలన సాధ్యమని 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీ మూర్తి అన్నారు సత్యనారాయణపురం 33వ డివిజన్ సత్యనారాయణపురంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. శానటరీ ఇన్‌స్పెక్టర్ జైపాల్, హెల్త్ సెక్రటరీలు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు. **భారతీనగర్ :** నాల్గవ డివిజన్ పరిధిలోని సుబ్బారావు కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, జోనల్ ఆఫీసర్ సమక్షంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి, వాటి నివారణకు తీసుకోవాలిసిన జాగ్రత్తలు తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. కాలనీ పెద్దలు సుబ్బారావు, చిట్టిబాబు, రాజమణి, సచివాలయం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఆరోగ్యశాఖ సెక్రటరీలు, స్పెషల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

కూలిన రిటైనింగ్ వాల్



చిట్టినగర్, ఆగస్టు 23 : గొల్లపాలెంగట్టు వాటర్ ట్యాంక్ కొండప్రాంతంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి జి.గురవయ్య, చిన్న గురవయ్య తాటాకు ఇల్లుకు సంబంధించిన రిటైనింగ్ వాల్ కూలిపోయింది. సమస్యను స్థానిక కార్పొరేటర్ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఏఈ శ్రీనివాస్ ఘటన ప్రాంతాన్ని పరిశీలించారు.

టాయిలెట్ ఫోటోల నుంచి మినహాయించండి

వన్‌టౌన్, ఆగస్టు 23: పాఠశాలలో టాయిలెట్ల ఫోటోలు తీయడం నుంచి తమను మినహాయించాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్, వార్డు సచివాలయం సర్వీసు అసోసియేషన్ నాయకులు జి.వి.వి. రాఘవరెడ్డి, పులిబండ్ల నరసింహారావు, చాంద్ బాషా, బి.ఆర్.ఆర్. కిషోర్‌లు గ్రామ, వార్డు సచివాలయాల ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్‌ను శుక్రవారం ఆయన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ సిబ్బంది సంక్షేమ, విద్యా సహాయకులకు స్కూళ్లలో టాయిలెట్ల ఫోటోలను తీసి పెట్టాలనటం సరికాదన్నారు. దాన్ని నుంచి తమను మినహాయించాలని ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు. ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని కోరారు.

నాయిబ్ ఖాజీ నియామకం జరగలేదు : హఫీజ్

వన్‌టౌన్, ఆగస్టు 23 : తాను ఎవరినీ నాయిబ్ ఖాజీగా నియమించలేదని వించిపేట, ఇస్లాంపేట పరిధిలో గవర్నమెంట్ ఖాజీగా పనిచేస్తున్న హఫీజ్ షేక్ ముస్తాక్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. మశీదు ఇమామ్‌లకు అందజేసే నిఖా నామ్ పుస్తకాలను తమకు కేటాయించిన పరిధిలో మాత్రమే ముస్లిం నిఖాలు వరకే ఉపయోగించాలన్నారు.



ధర్మపథం వేదిక పై కూచిపూడి నృత్యం

వన్‌టౌన్, ఆగస్టు 23 : ధర్మపథం వేదికపై శుక్రవారం కాకినాడ లక్ష్మీ జ్యోతి నృత్య కళాక్షేత్రం, లక్ష్మీజ్యోతి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనను నిర్వహించింది. కళాకారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం చేశారు. కళాకారులు తమ అభినయంతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశారు.

స్పృహ తప్పిన భక్తురాలు.. అందుబాటులో లేని డాక్టర్


వన్‌టౌన్, ఆగస్టు 23 : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలోనగరానికి చెందిన ఓ భక్తురాలు స్పృహ తప్పి పడిపోయారు. ఆ సమయంలో దుర్గగుడిలో విధుల్లో ఉండాల్సిన ఆర్ఎంపీ డాక్టర్ కనకారావు, వైద్యసిబ్బంది అందుబాటులోకి లేకపోవటం వలన దేవస్థానం ఉద్యోగులు ఆ భక్తురాలిని హుటాహుటిన దేవస్థానం అంబులెన్స్‌లో ప్రైవేట్ హాస్పటల్‌కు తీసుకువెళ్లారు. ఆర్ఎంపీ డాక్టర్, వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవటం పై పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఉద్యోగులు, కాంట్రాక్టర్‌లు టిక్కెట్లు కొనుగోలు చేయకుండా అనధికారికంగా అంతరాలయంలోకి తీసుకువెళ్లి అమ్మవారి దర్శనం చేయించారు.

విద్యార్థులు సాంకేతిక రంగాల పురోగతిని తెలుసుకోవాలి

పటమట, ఆగస్టు 23 : విద్యార్థులు శాస్త్ర, సాంకేతి రంగాల్లో వచ్చే ఆధునిక పురోగతిని తెలుసుకోవాలని చంద్రయాన్-3 ఇస్రో ఘట్టంలో ముఖ్యపాత్ర పోషించిన శాస్త్రవేత్త వై.విజయ తెలిపారు. విజయవాడ మారిస్ స్టెల్లా కళాశాలలో స్పేస్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శాస్త్రవేత్త విజయ మాట్లాడుతూ ప్రపంచ దేశాలతో పోలిస్తే చంద్రయాన్ - 2, 3 ద్వారా భారతదేశం ముందంజలో ఉందని, నూతన ఆవిష్కరణలు విద్యార్థులు చేపట్టాలని సూచించారు. బెంగళూరుకు చెం దిన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ, కమ్యూనికేషన్ రంగం, కమాండ్స్ ప్రసారం చేయడం, శాటిలైట్‌లు ఆవిష్కరించడం తదితర రంగా ల్లో యువత రాణించాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కుల్‌రేఖ, కరస్పాండెంట్ సిస్టర్ లీనా క్వాడ్రెస్, డాక్టర్ లిటిల్ ఫ్లవర్, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ వాణీలత, విద్యార్థులు పాల్గొన్నారు. **లబ్బీపేట :** దేశంలో ఏర్పడే తుఫాన్, ప్రకృతి విపత్తులతో పాటు చంద్రయాన్ 3కి సంబంధించిన పలు విషయాలను ఇస్రో మనకు అందిస్తుందని ఇస్రో శాస్త్రవేత్త మానసా బొల్లా తెలిపారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం అంతరిక్ష అంశాలపై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన తదితరులు పాల్గొన్నారు.

మహేశ్ సినిమా పేరు అదేనా?



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో డా.కె.ఎల్.నారాయణ నిర్మించే చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మహేశ్ పుట్టినరోజున సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వస్తుందని ఆశగా ఎదురు చూసిన ఆయన అభిమానులు ఏదీ రాకపోవడంతో నిరాశకు గురయ్యారు. యాక్షన్ అడ్వెంచర్‌గా ఈ సినిమా ఉంటుందన్న సమాచారం తప్ప కొత్త వార్తలేమీ బయటకు రావడం లేదు. సినిమా టీమ్ మాత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్‌లో సీరియస్‌గా నిమగ్నమై ఉంది. ఇటువంటి నేపథ్యంలో ఒక ఆసక్తికరమైన వార్త బయటకు వచ్చింది. విజువల్ డెవలప్‌మెంట్ ఆర్టిస్ట్ టీపీ విజయన్ తన ఇన్‌స్టా స్టోరీస్‌లో బంగారు వర్ణంలో ఉన్న గద్ద రెక్కలు ఉంచి మహేశ్ సినిమా టైటిల్ ఇదే అని అర్థం వచ్చేలా పోస్ట్ చేయడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. ఈ సినిమాకు 'గరుడ' అనే టైటిల్ పెట్టవచ్చు అనే ఊహాగానాలు ఊపందుకొన్నాయి. గతంలో దర్శకుడు రాజమౌళి 'బాహుబలి' తర్వాత తను చేయబోయే ప్రాజెక్ట్ 'గరుడ' అని వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ఇదే అయి ఉంటుందని, సినిమాకు 'గరుడ' అని పేరు పెడతారని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మహేశ్ చిత్రానికి 'గరుడ' టైటిల్ ఖాయమో కాదో అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

రవితేజకు శస్త్ర చికిత్స



హీరో రవితేజ కుడిచేతికి సర్జరీ జరిగింది. చికిత్స చేసిన వైద్యులు ఆయనని ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. 'ఆర్‌టీ75' సినిమా చిత్రీకరణలో రవితేజకు ఇటీవలే స్వల్ప గాయమైంది. ఆ గాయాన్ని లెక్కచేయకుండా షూటింగ్‌లో పాల్గొన్నారు. దాంతో ఆ గాయం మరింత పెద్దదవ్వడంతో డాక్టర్లు సర్జరీ చేశారు. కాగా, 'సామజవరగమన' చిత్రానికి రచయితగా పనిచేసిన భాను భోగవరపు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

అలా కామెంట్ చేసినందుకు చింతిస్తున్నా



హీరో నాని నటించిన తాజా చిత్రం 'సరిపోదా శనివారం'. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఓ మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రభాస్‌పై అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. 'ఆ వ్యాఖ్యల వల్ల అర్షద్‌కు ఎప్పుడూ రానంత ఫేమ్ వచ్చింది" అని అన్నారు. అయితే ఇప్పుడా మాటలు సోషల్‌మీడియాలో హాట్ టాపిక్కయ్యాయి. ఆ మాటల వల్ల సోషల్‌మీడియాలో అభిమానులు నాని వర్సెస్ అర్షద్ అంటూ రెండు వర్గాలుగా చీలిపోయారు. తాజాగా, 'సరిపోదా శనివారం' ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన నాని.. తాను అర్షద్‌పై చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. "అర్షద్ చాలా గొప్ప నటుడు. ఆయన గురించి అలా మాట్లాడినందుకు బాధపడుతున్నాను. నటులుగా ఉన్నప్పుడు మాట్లాడే ప్రతీ మాట విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే అవి వైరల్ అయ్యి ప్రమాదంగా మారే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభాస్‌పై అర్షద్ చేసిన వ్యాఖ్యల్లో.. అర్షద్‌పై నేను చేసిన వ్యాఖ్యల్లో ఆ పొరపాటే జరిగింది. నిజానికి నేను అర్షద్‌ని అలా అనాలనుకోలేదు. నా మాటలు సోషల్‌మీడియా ద్వారా అలా తప్పుదోవ పట్టాయి. నేను ఆయనపై అలా మాట్లాడినందుకు వచ్చిన రియాక్షన్స్‌ను చూసి అర్షద్ పూర్తి ఇంటర్వ్యూ చూశాను. అందులో ఆయన మాట్లాడిన మాటలు తప్పుదోవ పట్టాయని అర్థమైంది. అదే విధంగా నా వ్యాఖ్యలు కూడా మరో రకంగా ప్రజల్లోకి వెళ్లాయి" అని పేర్కొన్నారు.

సమంతకు ఏమైంది?



సిటాడెల్ వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించనున్నారు సమంత. ఆమె సినిమాలు తగ్గించినా.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అభిమానులతో టచ్‌లో ఉంటున్నారు. అలానే అప్పుడప్పుడు పలు ఈవెంట్లలో పాల్గొని ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తుంటారు. అయితే ఇటీవల ముంబైలో జరిగిన ఓ కార్యక్రమానికి సమంత బ్లాక్ డ్రస్సులో వచ్చారు. ఈ సందర్భంగా తీసుకున్న వీడియోను ఆమె అభిమానులతో సోషల్‌మీడియాలో పంచుకున్నారు. ఇక అప్పటి నుంచి అభిమానుల కామెంట్లు మొదలైయ్యాయి. 'సమంతకు ఏమైంది... ఆమె మునుపటిలా ఎందుకు అందంగా కనిపించట్లేదు. బరువు తగ్గినట్లుంది. ముఖంలో ఆనందం కనిపించట్లేదు' అని పలువురు అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు.

హేమపై నిషేధాన్ని తొలగించిన 'మా'



నటి హేమ ఊపిరి పీల్చుకున్నారు. ఆమెపై 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) నిషేధాన్ని తొలగించింది. 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మేలో జరిగిన ఓ రేవ్ పార్టీలో ఆమె డ్రగ్స్ తీసుకుందని.. పోలీసులు నిర్వహించిన డ్రగ్స్ టెస్టులో నిర్ధారణ కావడంతో ఆమెపై 'మా' సస్పెన్షన్ విధించింది. అయితే ఆమె అందులో నిరపరాధినని పేర్కొంటూ.. ఓ ల్యాబ్‌లో మెడికల్ టెస్టులు చేసుకుని ఆ నివేదికల్ని మంచు విష్ణుకు ఓ లేఖతో పాటు అందించారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన 'మా' ఆమెపై సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

సినీటాకు మంచు విష్ణు లేఖ

ప్రభాస్‌పై బాలీవుడ్ అర్షద్ వార్సీ చేసిన వ్యాఖ్యలు ఎంతటి దుమారాన్ని రేపాయో తెలిసిందే. ఈ వివాదంపై స్పందిస్తూ.. మంచు విష్ణు 'మా' తరపున 'సినీటా' (సినిమా అండ్ టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అధ్యక్షురాలు పూనమ్ ధిల్లాన్‌కు లేఖ రాశారు. "ప్రతీ ఒక్కరికి నచ్చినట్లు మాట్లాడే స్వేచ్ఛ ఉంది. కానీ ప్రభాస్‌ని కించపరుస్తూ ఆర్షద్ చేసిన వ్యాఖ్యల వల్ల అభిమానుల మనోభావాలు దెబ్బతిన్నాయి. సినీనటుల ఐక్యత, గౌరవాన్ని కాపాడటంలో ఎల్లప్పుడూ ముందుండే 'సినీటా'.. ఈ వివాదంపై స్పందిస్తుందని ఆశిస్తున్నాను. ఇలాంటి వ్యాఖ్యలు భవిష్యత్తులో మరోసారి పునరావృత్తం కాకుండా తగిన సూచనలు అర్షద్‌కు చేస్తారని ఆశిస్తున్నాను. మనమంతా ఒకే కుటుంబం. ఆ ఐక్యతను కొనసాగిద్దాం" అని లేఖలో పేర్కొన్నారు.

'ఎమర్జెన్సీ'ని బ్యాన్ చేయాల్సిందే!

సిక్కుల డిమాండ్



కంగనా రనౌత్ నటించిన 'ఎమర్జెన్సీ' చిత్రం ఇప్పుడు మరో వివాదంలో చిక్కుకుంది. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే సిక్కుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా 'ఎమర్జన్సీ' చిత్రం ఉందనీ, సిక్కులకు వ్యతిరేకంగా రూపుదిద్దుకున్న ఈ సినిమాను వెంటనే బ్యాన్ చేయాలనీ, విడుదల చేయడానికి వీల్లేదని శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అకల్ తఖ్త్ డిమాండ్ చేశాయి. ఎస్‌జీపీఎస్ చీఫ్ హర్‌జిందర్ సింగ్ ధామి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి కంగనను తీవ్రంగా విమర్శించడమే కాకుండా ఆమెపై కేసు పెట్టాలని కూడా కోరారు. సిక్కులను వ్యతిరేకించే సన్నివేశాలు ఈ మధ్య సినిమాల్లో ఎక్కువ అయ్యాయనీ, అందుకే సెన్సార్‌బోర్డ్‌లో సిక్కులకు కూడా తగినంత ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. 'ఎమర్జెన్సీ' చిత్రం తీస్తున్నట్లు 2021లో కంగనా ప్రకటించినప్పటి నుంచీ ఈ సినిమాకు చిక్కులే. ఇందులో ఆమె మాజీ ప్రధాని ఇందిరాగాంధీ పాత్రను పోషిస్తూ, దర్శకత్వం వహించారు. ఇది ఇందిరా గాంధీ బయోపిక్ కాదనీ, ఓ పొలిటికల్ డ్రామా అని ఎన్నో సార్లు కంగనా వెల్లడించానా వివాదాలు ఈ సినిమాను వదల్లేదు. ఎన్నో అవరోధాలు తట్టుకుని, విడుదలకు సిద్ధం చేస్తే ఇప్పుడు సిక్కుల నుంచి కంగనాకు ప్రతిఘటన ఎదురైంది.

పెళ్లిపీటలపై మరో హీరోయిన్!



తెలుగు హీరోయిన్లు వరుసగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ పెళ్లి అయిన రోజునే అంటే గురువారం రాత్రే మరో హీరోయిన్ మేఘా ఆకాశ్, ఆమె చిరకాల ప్రియుడు సాయివిష్ణుల నిశ్చితార్థం కేరళలో జరిగింది. తమకు ఎంగేజ్‌మెంట్ జరిగిన విషయాన్ని గురువారం అర్ధరాత్రి వెల్లడించి, ఫొటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది మేఘా ఆకాశ్. పెళ్లి ఎప్పుడన్నది మాత్రం ఆమె పేర్కొనలేదు. సాయివిష్ణు, మేఘా ఆకాశ్ ఆరేళ్లుగా ప్రేమలో ఉన్నారట.

నవ్య

కుటుంబ కదంబం

శనివారం • 24 ఆగస్టు 2024



క్రీడాకారిణిగా విజయాలు, వైఫల్యాలే కాదు... కోచ్‌గా అవమానాలు, ఛీత్కారాలు కూడా చూశారు దీపాలి దేశ్‌పాండే. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ రైఫిల్ షూటింగ్ జట్టు దారుణ వైఫల్యం, ఆ తరువాత కోచ్‌గా తనను తొలగించడం ఆమెను మానసికంగా కుంగదీసింది. దాని నుంచి బయటపడి, సర్వశక్తులూ కూడదీసుకొన్నారు. నిన్నటి ఒలింపిక్స్‌లో... దీపాలి శిష్యుడు స్వప్నిల్ కుశాలె గెలిచిన కాంస్యం... కోచ్‌గా ఆమె స్థాయిని చాటి చెప్పింది.

పడి లేచిన కెరటం

"విజయాన్ని ఆస్వాదించినంత సులువుగా వైఫల్యాన్ని స్వీకరించలేం. కానీ క్రీడల్లోనే కాదు, జీవితంలో కూడా వైఫల్యాలు ఎదురవుతూనే ఉంటాయి. ఎంత త్వరగా వాటి ప్రభావం నుంచి తేరుకున్నామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది" అంటారు దీపాలి దేశ్‌పాండే. ముంబయిలో పుట్టి పెరిగిన ఈ ఆర్కిటెక్చర్ గ్రాడ్యుయేట్‌ను రైఫిల్ షూటింగ్ అమితంగా ఆకర్షించింది. తీవ్ర సాధన చేసి... పలు పోటీల్లో తన నైపుణ్యాన్ని చాటారు. 2004 ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించారు. అదే ఏడాది ఒలింపిక్స్‌లో భారత్ తరఫున పోటీ పడ్డారు. క్రీడాకారిణిగా బరిలో నుంచి క్రమంగా తప్పుకొని... కోచింగ్ మీద దృష్టి సారించారు. 'నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా' (ఎన్‌ఆర్‌ఎఐ)లో పదేళ్ళపాటు సీనియర్ కోచ్‌గా వ్యవహరించారు. ఎంతోమంది యువ షూటర్స్ ప్రతిభకు మెరుగులు దిద్దారు. కానీ టోక్యో ఒలింపిక్స్ తరువాత ఆమెకు తీవ్ర అవమానాలు ఎదురయ్యాయి.

ఆ రోజులు పెద్ద పీడకల...

'ఒలింపిక్స్‌లో ఏ క్రీడాంశంలోనైనా విఫలం కావచ్చు కానీ... షూటింగ్‌లో మాత్రం భారత్‌కు పతకం పక్కా' అనే నమ్మకం ఒకప్పుడు ఉండేది. 2004 నుంచి 2012 వరకూ... మూడు ఒలింపిక్స్‌లో ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్యం గెలిచిన చరిత్ర మనది. కానీ 2016 రియో ఒలింపిక్స్‌కు ఎన్నో ఆశలతో వెళ్ళిన భారత షూటర్స్ బృందం ఉత్తచేతులతో తిరిగొచ్చింది. ఈ నేపథ్యంలో మాజీ షూటర్స్ దీపాలి దేశ్‌పాండే, జస్పాల్ రాణాలతో యువ షూటర్లకు ఎన్‌ఆర్‌ఎఐ ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. 2018లో ప్రపంచకప్ పోటీల్లో గొప్పగా రాణించిన భారత షూటర్లు టోక్యో ఒలింపిక్స్‌లో తేలిపోయారు. దాంతో కోచింగ్ సిబ్బందిని మార్చడానికి ఎన్‌ఆర్‌ఎఐ సిద్ధపడింది. ఆరుగురు కోచ్‌లు తమ కాంట్రాక్టులు నిలబెట్టుకున్నారు. దీపాలి బయటకు రావలసి వచ్చింది. ఇది ఆమె మానసిక ఆరోగ్యం మీద తీవ్రమైన ప్రభావం చూపించింది. "మెలకువగా ఉన్నంతసేపూ అవే ఆలోచనలు. నాకేమవుతోందో అర్థమయ్యేది కాదు. ఇంటినుంచి ట్రైనింగ్ సెంటర్‌కు బయలుదేరి... ఎటో వెళ్ళిపోయేదాన్ని. కొంతసేపటికి ఆలోచనల్లోంచి బయటపడ్డాక... నేను నా గమ్యానికి వ్యతిరేక దిశలో... చాలా దూరంగా వచ్చానని అర్థమయ్యేది. ఇలా పదిహేను రోజుల వ్యవధిలో రెండుసార్లు జరిగింది. ఎన్నో ఏళ్ళుగా నేను ప్రయాణిస్తున్న మార్గంలో డ్రైవ్ చేస్తున్నప్పుడే నా ఆలోచనలు స్తంభించిపోతున్నాయంటే... నాలో ఏదో తేడా జరుగుతోందని గ్రహించాను" అన్నారు దీపాలి. పరిస్థితి మరీ ముదిరిపోకుండా దిద్దుబాటు చర్యలను వెంటనే తీసుకున్నారు. "షూటర్స్‌కు ఏకాగ్రత చాలా ఎక్కువగా ఉండాలి. కానీ ఒక దాని మీద దృష్టి కేంద్రీకరిస్తున్నప్పుడు... మిగిలిన విషయాలను పెద్దగా పట్టించుకోకపోవడం, మరచిపోవడం సాధారణంగానే జరుగుతూ ఉంటుంది. అది మతిమరపుగా మారితే ప్రమాదం. షూటింగ్ కాకుండా డ్రాయింగ్, ట్రెక్కింగ్, పెయింటింగ్ నా అభిరుచులు. అవి కూడా ఆ సమయంలో నాకు గుర్తుకురాలేదు. అదృష్టవశాత్తూ... నాకు మంచి కుటుంబం ఉంది. అన్ని విషయాలను మేము కలిసి చర్చించుకుంటాం. వారి సలహాతో యోగా, వ్యాయామం మళ్ళీ ప్రారంభించాను. క్రమం తప్పకుండా కొనసాగించాను. ఆ రోజులు నా జీవితంలో 'పెద్ద పీడకల" అంటారు దీపాలి.



అది నా అదృష్టం...

అయితే దీపాలి దగ్గర శిక్షణ పొందుతున్న షూటర్స్‌కు ఆమెపై అపారమైన నమ్మకం ఉంది. తమకు వ్యక్తిగత కోచ్‌గా ఆమే ఉండాలని పట్టుపట్టారు. "వారు నా పక్షాన ఉండడం నా అదృష్టం. నేను త్వరగా కోలుకోవడానికి వాళ్ళు కూడా కారణం. వారు టీనేజ్‌లోకి రాక ముందు నుంచీ చూస్తున్నాను. అందరూ నా బిడ్డల్లాంటివారు" అని ఆమె చెప్పారు. ఇక సంస్థలకు కాకుండా... షూటర్లకు వ్యక్తిగత కోచ్‌గా ఉండాలనీ, ప్యారిస్ ఒలింపిక్స్ మీద దృష్టి కేంద్రీకరించాలనీ దీపాలి నిర్ణయించుకున్నారు. కానీ మళ్ళీ ఎదురుదెబ్బ తగలకూడదంటే... ప్రణాళికలు మరింత కచ్చితంగా ఉండాలని ఆమెకు తెలుసు. "ప్రపంచం మీద కొవిడ్ విరుచుకుపడడానికి ముందు... 2019 డిసెంబర్‌లో భారత రైఫిల్ షూటింగ్ సీనియర్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాను. అప్పట్లో నేను వేసుకున్న ప్రణాళికలు ఫలితాన్ని ఇవ్వలేదు. దానికి కారణాలేవిటి? కొవిడ్ కారణంగా యువ షూటర్లలో మానసికంగా ఒత్తిడి ఏర్పడి, వాళ్ళ సామర్థ్యం దెబ్బతిందా? వాళ్ళ సామర్థ్యాన్ని మరీ ఎక్కువగా ఊహించుకున్నామా? లేదంటే... ఒలింపిక్స్ వాయిదా కారణంగా మరీ ఎక్కువ కాలం శిక్షణ శిబిరంలో ఉండడం వారి ప్రదర్శన మీద ప్రభావం చూపించిందా? ఈ ప్రశ్నలన్నిటికీ జవాబులు తెలుసుకోవాలని ప్రయత్నించాను" అని చెప్పారు. దీపాలి. ఏం చేయాలనే స్పష్టత వచ్చాక... ఆమె వెనుతిరగలేదు. తనను నమ్మి వచ్చిన యువ షూటర్లకు కఠినమైన శిక్షణ ఇచ్చారు. వారందరూ ప్యారిస్ ఒలింపిక్స్ కోటాలో ఎంపికయ్యారు. అయితే ఇద్దరు ట్రయల్స్‌లో వెనుకపడగా... నలుగురు ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు.

ఆ బాధ పోయింది...

షూటర్ స్వప్నిల్ కుశాలె 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం అందుకున్నాడు. ఈ విభాగంలో భారత్ పతకం సాధించడం ఇదే తొలిసారి. "ఈ ఘనత ఎవరికైనా దక్కాలంటే... అది నా కోచ్ దీపాలికే" అంటూ తను గెలిచిన పతకాన్ని స్వప్నిల్ ఆమె చేతికి అందించినప్పుడు... ఆమె ఉద్వేగాన్ని ఆపుకోలేకపోయారు. "అర్జున్ బబుతా కనీసం రజత పతకం సాధిస్తాడనుకున్నాను. కొద్దిలో కాంస్య పతకాన్ని కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచాడు. కానీ అది చిన్న విషయం కాదు. టోక్యో ఒలింపిక్స్ నాటికి భారత జట్టుకు నేను అత్యున్నతస్థాయి రైఫిల్ కోచ్‌గా ఉన్నాను. కానీ ఆ తరువాత ఎలాంటి ఉద్యోగం లేకుండా మిగిలిపోయాను. నన్ను మాత్రమే తొలగించినందుకు ఎంతో బాధపడ్డాను. కానీ కుశాలె పతకంతో ఆ బాధ తొలగిపోయింది. ఇదంతా ఉద్యోగం పోయినందుకు మాత్రమే కాదు... నేనిక పనికిరాననే భావనకు ఆ సంఘం వచ్చినందుకు. క్రీడాకారులు ఓడిపోయినా... వారిని కాపాడడానికి ఎవరో ఒకరుంటారు. కోచ్‌ల మీద కనీసమైన సానుభూతి కూడా ఎవరూ చూపించరు. వైఫల్యముద్రతో జీవితాంతం బతకాల్సిందే. ఇప్పుడు ఆ ముద్ర పోయినందుకు సంతోషంగా ఉంది" అంటున్నారు 55 ఏళ్ళ దీపాలి.

వేసవారం... విషదోషాలకు విరుగుడు



ఇప్పుడైతే అన్ని రకాల పొడులు మనకు మార్కెట్లో దొరికేస్తున్నాయి. కానీ ఒకప్పుడు వీటిని ఇళ్లలోనే తయారు చేసుకొనేవారు. ఇలా తయారు చేసుకున్న పొడినే వేసవారం అంటారు. దీన్ని అన్ని రకాల కూరల్లోనూ వాడుకోవచ్చు. కూరలకు రుచినివ్వడమే కాదు... ఆరోగ్యదాయిని కూడా.

క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వేసవారాన్ని ఆరు సుగంధ ద్రవ్యాల మిశ్రమంగా అభివర్ణించాడు. ఇంగువ, అల్లం, మిరియాలు, జీలకర్ర, పసుపు, ధనియాలతో చేసిన ఈ మిశ్రమాన్ని చాలా శ్రద్ధతో.. జాగ్రత్తగా చేయాలని ఆయన సూచించాడు. ఈ మిశ్రమంలో ఏఏ పదార్థాన్ని ఎంత పాళ్లలో వేయాలో కూడా చెప్పాడు. 'క్షేమకుతూహలం' గ్రంథం ప్రకారం... ఒక చెంచా ఇంగువపొడి తీసుకుంటే.. దానికి రెట్టింపు అల్లం ముద్ద తీసుకోవాలి. ఆ అల్లం ముద్దకు రెట్టింపు మిరియాల పొడి తీసుకోవాలి. ఆ మిరియాల పొడికి రెట్టింపు జీలకర్ర పొడి, దానికి రెట్టింపు పసుపు, దీనికి



రెట్టింపు ధనియాల పొడిని వేసి బాగా నూరాలి. ఇలా నూరిన మిశ్రమంలో తగినంత సైంధవ లవణం వేసి కలపాలి. ఈ వేసవారం చాలా కాలం నిల్వ ఉంటుంది.

విషదోషాల నివారణ...

మనం రోజూ తినే ఆకుకూరలు, కూరగాయాల్లో రకరకాల రసాయనాలు కలుస్తున్నాయి. వీటివల్ల మన శరీరంలో అనేక విషాలు ప్రవేశించవచ్చు. ఈ విషాలన్నింటినీ వేసవారం తొలగిస్తుందని క్షేమశర్మ పేర్కొన్నాడు. అంతే కాకుండా వేసవారంవల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దీనిని మసాలాలకు బదులుగా కూరలు, పచ్చళ్లు, పులుసుల్లోనూ వాడవచ్చు. కూరగాయాలను ఉడికించి.. దానిలో పెరుగు, వేసవారం వేస్తే అది సుగంధభరితమైన పెరుగుపచ్చడి అవుతుంది. పప్పులో కానీ.. పులుసులో కానీ వేస్తే, తాళింపు పెట్టుకొనే అవసరం ఉండదు.

మాంసం శుద్ధి...

మాంసం, చేపలు మొదలైన వాటిలో వాసన ఉంటుంది. ఈ వాసన పోవటానికి వేసవారం ఉపకరిస్తుంది. మాంసం లేదా చేపలను తీసుకొని వాటిని వేసవారం వేసిన నీళ్లలో ఉడికించాలి. ఇలా ఉడికించిన తర్వాత మళ్లీ ఆ మాంసం లేదా చేపలను మజ్జిగలో ఉడికించాలి. దీనివల్ల మాంసం లేదా చేపల్లో ఉన్న విష పదార్థాలేమైనా ఉంటే అవి తొలగిపోతాయి. ఒకవేళ మజ్జిగ లేకపోతే దానిమ్మ రసంలోనైనా వీటిని ఉడికించవచ్చు.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు



దక్కనీ రుచులు

రొటీన్‌కు కాస్త భిన్నంగా... ఇంట్లోనే వండుకోగలిగిన దక్కనీ వంటకాలున్నాయి. అవే పనీర్ చట్‌పట్, ముర్గ్ మజెదార్, ఘోష్ కాలీమిర్చీ. ఈ వీకెండ్‌లో వీటిని ప్రయత్నించి చూడండి.



ఘోష్ కాలీమిర్చీ


కావాల్సిన పదార్థాలు: మటన్- అర కేజీ, అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు- రుచికి సరిపడ, పసుపు- అర టీస్పూన్, షాజీరా- టీస్పూన్, నల్లమిరియాల పొడి- 2 టీస్పూన్లు, దాల్చిన చెక్క- 1, ధనియాల పొడి- టీస్పూన్, పెరుగు- 200 గ్రాములు, కొత్తిమీర- 1 టేబుల్ స్పూన్, పుదీనా- టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి-2 (సన్నగా తరగాలి), ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), నూనె- 4 టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ రసం- అర టీస్పూన్

తయారీ విధానం: శుభ్రం చేసిన మటన్ ముక్కలను బౌల్‌లో వేయాలి. ఇందులోకి పసుపు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేయాలి. ఆ తర్వాత షాజీరా, దాల్చిన చెక్క, నల్లమిరియాల పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఇందులో పెరుగు పోసి బాగా కలిపితే మటన్ ముక్కలకు పడుతుంది. ఇందులోకి కొత్తిమీర, పుదీనాతో పాటు పచ్చిమిర్చి వేసి కలపాలి.

కుక్కర్‌లో నూనె పోసి ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. గోల్డెన్ బ్రౌన్ రంగు వచ్చాక మటన్ మిశ్రమాన్ని వేయాలి. పొంగులా వచ్చే ముందు గరిటెతో కదుపుతూ ఉండాలి. ఇలా ఐదు నిముషాలు కుక్ చేశాక కుక్కర్ మీద మూత ఉంచి ఐదారు విజిల్స్ వచ్చేంత వరకు ఉడికించాలి. మటన్ ముక్కలు బాగా ఉడికిన తర్వాత కొత్తిమీరతో గార్నిష్ చేసుకోవాలి. ఘోస్ట్ కాలీ మిర్చీ కర్రీ రెడీ.

పనీర్ చట్‌పట్

కావాల్సిన పదార్థాలు: పనీర్ క్యూబ్స్- 250 గ్రాములు, తరిగిన అల్లం- టీస్పూన్, తరిగిన వెల్లుల్లి- టీస్పూన్, నెయ్యి- రెండు టీస్పూన్లు, తరిగిన పచ్చిమిర్చి- 1 టీస్పూన్, కారం- టీస్పూన్, ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, చిల్లీ సాస్- రెండు టేబుల్ స్పూన్లు, టమోటా సాస్- రెండు టేబుల్ స్పూన్లు, నిమ్మకాయ-1, తరిగిన కొత్తిమీర- టీస్పూన్, చాట్ మసాలా- టీస్పూన్



తయారీ విధానం: పనీర్ ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. ప్యాన్ వేడయ్యాక నెయ్యి వేయాలి. అందులో సన్నగా తరిగిన వెల్లుల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. సన్నగా తరిగిన అల్లం వేసి కలపాలి. ఈ రెంటినీ వేయించాక.. పచ్చిమిర్చి ముక్కలు వేసిన వెంటనే ఉల్లిపాయ ముక్కలు వేసి లోఫ్లేమ్‌లో వేయించాలి. బంగారు రంగులోకి ఉల్లిపాయ ముక్కలు మారిన తర్వాత పసుపు, కారంతో పాటు సరిపడినంత ఉప్పు వేసి కలపాలి. చిల్లీ సాస్‌తో పాటు టమోటా సాస్ వేసి రెండు నిముషాల పాటు కలపాలి. కొన్ని నీళ్లు వేయాలి. పనీర్ ముక్కలను వేసి ముక్కలు విరగకుండా కలపాలి. మూడు నిముషాల తర్వాత కాస్త కొత్తిమీర వేసి కలపాలి. కొద్దిగా చాట్ మసాలా వేసి చివరగా నిమ్మకాయ రసం వేసి కలపాలి. ఈ పనీర్ చట్‌పట్‌ను చపాతీతో కలిపి తినొచ్చు.

ముర్గ్ మజెదార్

కావాల్సిన పదార్థాలు: బోన్‌లెస్ చికెన్- 600 గ్రాములు, ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి ముక్కలు- అర టీస్పూన్, జీడిపప్పు పేస్ట్- టేబుల్ స్పూన్, టమోటా పేస్ట్- టేబుల్ స్పూన్, అల్లం, వెల్లుల్లి పేస్ట్- రెండు టేబుల్ స్పూన్లు, కారం పొడి- టేబుల్ స్పూన్, కసూరీ మేతీ- కొద్దిగా, గరం మసాలా- టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నూనె- టేబుల్ స్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, వెన్న- టీస్పూన్, క్రీమ్- టీస్పూన్, పసుపు- చిటికెడు, ధనియాల పొడి- టేబుల్ స్పూన్, తరిగిన వెల్లుల్లి- టీస్పూన్



తయారీ విధానం: ముందుగా బోన్‌లెస్ చికెన్‌ను శుభ్రం చేసి క్యూబ్స్‌లా కట్ చేసుకోవాలి. ప్యాన్‌లో వెన్న, నూనె వేసి కలపాలి. ఇందులో తరిగిన వెల్లుల్లి ముక్కలతో పాటు ఉల్లిపాయ ముక్కలు వేసి కలపాలి. ఉల్లిపాయ రంగు మారిన తర్వాత జింజర్ గార్లిక్ పేస్ట్ వేసి కలపాలి. ఆ తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, చికెన్ ముక్కలు వేసి కలపాలి. మూడు నిముషాల పాటు కుక్ అయ్యాక.. ఇందులోకి జీడిపప్పు పేస్ట్, టమోటా పేస్ట్ వేసి కలపాలి. తగినన్ని నీళ్లు పోసి నాలుగైదు నిముషాలు కలుపుతూ ఉండాలి. వెంటనే ధనియాల పొడి, కారంపొడి, కొద్దిగా పసుపు, కసూరీ మేతీ పౌడర్ వేసి కలపాలి. రుచికి తగినంత ఉప్పు వేసి మళ్లీ కలపాలి. చివరగా క్రీమ్, వెన్న వేసి కలపాలి. చివరగా కొత్తిమీర వేసి కలపాలి. చికెన్ ముక్కలు ఉడికేంత వరకూ లోఫ్లేమ్‌లో కుక్ చేసి సర్వ్ చేసుకోవాలి. అన్నం లేదా చపాతీలోకి రుచిగా ఉంటుంది.

'హెయిర్ సైక్లింగ్' తెలుసా?

నిగనిగలాడే జుట్టు కావాలంటే సరైన ఆహారం తీసుకోవాలి. జాగ్రత్తలు పాటించాలి. అయితే కొందరు ఒకే తరహా ఉత్పత్తులను జుట్టు కోసం వాడుతూ ఉంటారు. ఇలా ఉపయోగించటం సరి కాదంటున్నారు నిపుణులు. వారు ప్రతిపాదిస్తున్న కొత్త పద్ధతే హెయిర్ సైక్లింగ్.

అంటే ఏమిటి?

అందరి జుట్టు అన్ని సమయాల్లో ఒకే విధంగా ఉండదు. వయస్సు, మనం తినే ఆహారం, మన చుట్టూ ఉన్న వాతావరణం- వీటన్నింటిపైనా ఆధారపడి ఉంటుంది. అందువల్ల మన జుట్టుకు అవసరమైన వాటిని- అవసరమైన సమయంలో అందించటాన్నే హెయిర్ సైక్లింగ్ అంటారు. ఉదాహరణకు బయట తిరగటం వల్ల కొందరి జుట్టు రాలిపోతూ ఉంటుంది. ఆ సమయంలో జుట్టు రాలిపోకుండా ఉండాలంటే- పౌష్టికాహారం తీసుకోవాలి. తగిన షాంపులు వాడాలి. ఆ సమయంలో కూడా మనకు అలవాటు అయిన ఆహారమే తింటే- పరిస్థితిలో మార్పు రాదు. ఇదే విధంగా కొందరికి జుట్టు పొడిగా ఉంటుంది. మరి కొందరికి నూనె రాసినట్లు ఉంటుంది. వయస్సు మీద పడినప్పుడు- పొడి జుట్టు నూనె రాసినట్లు మారిపోవచ్చు. నూనె రాసినట్లు ఉండే జుట్టు పొడిగా అవ్వచ్చు. ఇలాంటి సమయంలో సౌందర్య నిపుణులను అడిగి తగిన ఉత్పత్తులను వాడితే మంచి ఫలితాలు ఉంటాయి.



ఎలా మొదలుపెట్టాలి?

1) ముందు- మన జుట్టు పరిస్థితి ఏమిటో అంచనా వేసుకోవాలి. జుట్టు పొడిగా ఉందా? రాలిపోతోందా? చివర్లు చీలిపోతున్నాయా? చుండ్రు పడుతోందా? తలపై నల్లటి మచ్చలు వస్తున్నాయా? మొదలైన విషయాలను జాగ్రత్తగా గమనించాలి.

2) మన అంచనాలకు తగిన ఉత్పత్తులను ఎంచుకోవాలి. ఉదాహరణకు జుట్టు పొడిగా ఉంటే- తేమను అందించే హైడ్రేటింగ్ షాంపును వాడాలి. నూనె రాసినట్లు ఉంటే క్లారిఫైయింగ్ షాంపును వాడాలి. వీటితో పాటుగా మనకు ముందు నుంచి అలవాటు ఉన్న ఉత్పత్తులను కూడా వెంటనే మానకూడదు. వాటిని కూడా ఉపయోగిస్తూ ఉండాలి. మనకు అనువైన ఒక రొటీన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.

3) మన ప్రయత్నాలు ఎంత వరకు ఫలిస్తున్నాయో- ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ ఉండాలి. ఒక వేళ ఎక్కడైనా తేడా వస్తే- వెంటనే ఉత్పత్తులను మార్చుకోవాలి.



దీపికకు మేకప్ చేసేది నేనే!

చిన్నప్పుడు అమ్మ మేకప్ కిట్ తస్కరించిన అమ్మాయి... ఇప్పుడు బాలీవుడ్ భామల అందానికి మెరుగులు అద్దుతోంది. కార్పొరేట్ కొలువును కాదనుకుని... అభిరుచికి పట్టం కట్టి... చిత్ర పరిశ్రమలో తిరుగులేని కెరీర్‌ను నిర్మించుకుంది. దీపికా, అలియా, కత్రినా, కరీనా... అందరికీ అభిమాన మేకప్ ఆర్టిస్ట్ అయిన సంధ్యా శేఖర్ జర్నీ ఇది.

"ఇది నేను కోరివచ్చిన రంగం. కానీ ఈ స్థాయికి వస్తానని, ఇంతమంది అభిమాన తారలకు రంగులు అద్దుతానని ఎన్నడూ ఊహించలేదు. చిన్నప్పటి అభిరుచే నన్ను ఇక్కడివరకు నడిపించింది. కర్ణాటకలోని ఉడుపి మా సొంత పట్టణం. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తయింది. ఫైనాన్స్ అండ్ మార్కెటింగ్‌లో ఎంబీఏ చదివాక యస్‌బ్యాంక్‌లో మంచి ఉద్యోగం వచ్చింది. ఎందుకో తెలియదు... ఆ కార్పొరేట్ కొలువు నాకు అస్సలు నచ్చలేదు. ఉదయం లేవడం... ఆఫీసుకు పరుగెత్తడం... తిరిగి ఇంటికి రావడం... 'ఇదేనా జీవితం' అనిపించింది. అతి కష్టం మీద పన్నెండు నెలలు గడిచాయి.

వద్దంటే వినలేదు...

ఉద్యోగం మానేస్తానని అమ్మానాన్నలకు చెప్పాను. 'మానేసి ఏంచేస్తావ్' అన్నారు. మేకప్ ఆర్టిస్ట్‌గా కొత్త కెరీర్ ప్రారంభిస్తానని బదులిచ్చాను. వాళ్లు వద్దంటే వద్దన్నారు. రెండు నెలలు నచ్చజెప్పే ప్రయత్నం చేశాను. అయినా వారి నిర్ణయం మార్చు రాలేదు. ఇంత మంచి ఉద్యోగం వదిలేసి, ఏమాత్రం అవగాహన లేని రంగంలోకి దూకుతానంటే ఏ తల్లితండ్రులైనా అలానే స్పందిస్తారు. వాళ్ల ఆందోళన నాకు అర్థమవుతోంది. కానీ దాని కోసం నా ఇష్టాన్ని చంపుకోదలుచుకోలేదు. చివరకు 2005లో, నా పుట్టినరోజునాడు ఇల్లు వదిలి బెంగళూరు వెళ్లిపోయా. ప్రొఫెషనల్ మేకప్ కోర్సులు ఎక్కడెక్కడ నేర్పిస్తారు? నేర్పించేవారికున్న అర్హతలేమిటి? ఇలా నగరమంతా తిరిగి అన్నిటి గురించీ తెలుసుకున్నా.

చిన్న కోర్సుతో...

నాకున్న అవగాహనతో మొదట బెంగళూరులో నాకు తెలిసిన ఒక హెయిర్ అండ్ మేకప్ ఆర్టిస్ట్ దగ్గర చిన్న కోర్సు నేర్చుకున్నాను. తరువాత బ్రిటన్ వెళ్లాను. అక్కడి 'లండన్ స్కూల్ ఆఫ్ బ్యూటీ అండ్ మేకప్'లో నెల రోజుల కోర్సు పూర్తి చేశాను. తిరిగి వచ్చాక ముంబయిలో మరో ప్రొఫెషనల్ కోర్సు నేర్చుకున్నాను. ఇప్పటికీ నేర్చుకోవడం నా వృత్తిలో ఒక భాగం అయింది. దానికోసం దేశవిదేశాల్లోని వర్క్‌షాప్‌లు, మాస్టర్‌క్లాస్‌లు, ట్రేడ్ ఎగ్జిబిషన్లకు వెళుతూ ఉంటాను. వాటివల్ల ప్రస్తుత ట్రెండ్, నూతన పద్ధతులు తెలుసుకొనే అవకాశం కలుగుతుంది.

అలా తిరిగింది...

నా కెరీర్‌కు అతిపెద్ద బ్రేక్ వచ్చింది మాత్రం ఎంటీవీ ప్రోమో షూట్‌తో. దాని కోసం నేను మేకప్, హెయిర్ డ్రెస్సింగ్ చేశాను. అది నాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇక అక్కడి నుంచి నా ప్రయాణం జెట్ స్పీడ్ అందుకుంది. కొన్ని టీవీ షోలకు న్యాయనిర్ణేతగా కూడా వ్యవహరించాను. ఔత్సాహికులకు తరగతులు నిర్వహిస్తున్నాను. గెస్ట్ లెక్చర్స్ ఇస్తున్నాను. దీపికా పదుకొనే, కత్రినా కైఫ్, అనుష్కా శర్మ, కంగనా రనౌత్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, అదితీరావ్ హైదరీ, పరిణీతి చోప్రా తదితర టాప్ బాలీవుడ్ స్టార్స్‌కు మేకప్ వేశాను. ముఖ్యంగా దీపికా పదుకొనేకు అయితే కేన్స్ ఫిలిమ్ ఫెస్టివల్, మెట్ గాలా, కొన్ని అంతర్జాతీయ మ్యాగజైన్స్ కోసం పని చేశాను. ఆమె పెళ్లి మేకప్ కూడా నేనే వేశాను. అన్నిటికంటే ప్రతిష్ఠాత్మక మెట్ గాలా కోసం దీపికను ముస్తాబు చేయడాన్ని నేను ఎంతో గౌరవంగా భావిస్తాను. అలాగే కేన్స్ ఉత్సవానికి కూడా. ఇది నాకు దక్కిన అద్భుత అవకాశం.


ప్రముఖులు ఎందరితోనో...

ఈ వృత్తిలోకి వచ్చాక సితారా కుడిగె పనితనం నాకు ప్రేరణనిచ్చింది. తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి ఉంది. ఏ రంగంలోనైనా పోటీని తట్టుకొని నిలబడాలంటే మనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి కదా. దాని కోసం నేనూ ప్రయత్నించాను. ఇప్పుడు నా పేరు చెప్పగానే 'నో మేకప్ లుక్స్' అనే ట్యాగ్‌లైన్ గుర్తుకువస్తుంది పరిశ్రమలో ఎవరికైనా. ఇదే నా మేకప్ ప్రత్యేకత. అందానికి మెరుగులు అద్దాలే కానీ, మేకప్ పేరుతో సహజ సౌందర్యాన్ని దాచేయకూడదనేది నా ఉద్దేశం. అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందిన ఫ్రెంచ్ హెయిర్ డ్రెస్సర్ లారెంట్ ఫిలిప్పన్, అమెరికా మేకప్ ఆర్టిస్ట్ రోషర్‌తో కలిసి కొన్ని ప్రాజెక్ట్‌లో పని చేశాను. ఆ అనుభవం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. అలాగే వోగ్, హార్పర్ బజార్, గ్రాజియా, జీక్యూ, కాస్మోపాలిటన్ తదితర మ్యాగజైన్లు, టెలివిజన్ కమర్షియల్స్‌కు సేవలు అందించాను. అందుకే చెబుతున్నాను... మనసు చంపుకొని పని చేయవద్దు. నచ్చిన రంగంలో మనసు పెట్టి కష్టపడితే విజయం తప్పక వరిస్తుంది."

ఎన్నడూ ఊహించలేదు...

నాకు చిన్నప్పటి నుంచి మేకప్ అంటే అమితమైన ఇష్టం. అందుకు మా అమ్మే నాకు ప్రేరణ. ఆవిడ మేకప్ వేసుకోవడం చూసి నాకూ ఆసక్తి కలిగింది. ఒకసారి తన మేకప్ కిట్ తస్కరించి, ఎవరికీ తెలియకుండా నాకు నేను మేకప్ వేసుకున్నాను. నన్ను నేను చూసుకుని మురిసిపోయాను. వయసుతోపాటు ఆ అభిరుచి కూడా నాలో అంతర్లీనంగా పెరుగుతూ వచ్చింది. కెరీర్ ఆరంభంలో కొన్నాళ్లు బ్రైడల్ మేకప్‌లు కూడా చేశాను. రోజువారీ ఖర్చుల కోసం. అయితే సెలబ్రిటీ మేకప్ ఆర్టిస్ట్ కావాలని ఎప్పుడూ అనుకోలేదు. అసలు అది నా ఊహల్లోనే లేదు. ఈ వృత్తి పట్ల నాకున్న అంకితభావం, కష్టపడి పని చేసే తత్వమే ఇవాళ నన్ను ఇంత ఎత్తులో నిలబెట్టిందనేది నా నమ్మకం.





అనిల్ అంబానీపై సెబీ వేటు

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల మళ్లింపు వ్యవహారంలో కఠిన చర్యలు

రూ.25 కోట్ల జరిమానా

- ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా నిషేధం
- కుప్పకూలిన రిలయన్స్ గ్రూప్ షేర్లు
- మరో 24 సంస్థలపైనా చర్యలు

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్ అంబానీతో పాటు మరో 24 మందికి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ పెద్ద షాకిచ్చింది. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఆర్‌హెచ్ఎఫ్ఎల్) నిధుల మళ్లింపు వ్యవహారంలో ఆయనపై ఏకంగా రూ.25 కోట్ల జరిమానా విధించింది. దీనికి తోడు ఆయన ఐదేళ్ల పాటు సెక్యూరిటీస్ మార్కెట్లో పాల్గొనకుండా నిషేధం విధించింది. ఈ కాలంలో అనిల్ ఏ లిస్టెడ్ కంపెనీలో గానీ, సెబీ వద్ద నమోదైన సంస్థల్లో గానీ ఎటువంటి డైరెక్టర్ లేదా కీలక మేనేజ్‌మెంట్ పదవులు (కేఎంపీ) చేపట్టకూడదని స్పష్టం చేసింది. దీంతో ఇప్పటికే పీకల్లోతు సమస్యల్లో ఉన్న అనిల్ అంబానీ వ్యాపార సామ్రాజ్యం కథ ముగిసినట్టేనని భావిస్తున్నారు. భారత కార్పొరేట్ చరిత్రలో సెబీ ఒక పారిశ్రామికవేత్తపై ఇంత భారీగా జరిమానా విధించడం ఇదే మొదటిసారి. కాగా ఈ విషయంపై అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ ఇంతవరకు స్పందించలేదు.

ఇదీ కథ

అనిల్ అంబానీ.. అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ (అడాగ్) చైర్మన్‌గా తన పరపతిని ఉపయోగించి రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ బోర్డు పదే పదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా, కంపెనీ నిధులను రుణాల పేరుతో తన నిర్వహణలోని అల్లాటప్పా కంపెనీలకు రూ.14,577.68 కోట్లు దారి మళ్లించినందుకు సెబీ ఈ చర్య తీసుకుంది. ఇందులో రూ.12,487.56 కోట్ల మొత్తాన్ని ఊరూ పేరు లేని 47 డొల్ల కంపెనీలకు మళ్లించారని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఫోరెన్సిక్ ఆడిట్‌లో తేలింది. ఈ విషయంలో అనిల్ అంబానీకి సహకరించిన 24 సంస్థలపైనా ఐదేళ్ల నిషేధంతో పాటు రూ.21 కోట్ల నుంచి రూ.25 కోట్ల చొప్పున మొత్తం రూ.625 కోట్ల భారీ జరిమానాలు విధించింది. ఆర్‌హెచ్ఎఫ్ఎల్‌పైనా ఆరు నెలల నిషేధంతో పాటు రూ.6 లక్షల జరిమానా విధించింది. మరోవైపు సెబీ కూడా 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సంస్థ ఖాతాలను పరిశీలించి నిధుల మళ్లింపు నిజమేనని నిర్ధారించుకుంది. ఈ విషయంలో అనిల్ అంబానీకి అమిత్ బప్నా, రవీంద్ర సుధాల్కర్, పింకేష్ ఆర్ షా అనే వ్యక్తులు సహకరించినట్టు విచారణలో తేలింది.



గ్రూప్ షేర్లు ధమాల్

తాజా పరిణామాలతో రిలయన్స్ గ్రూప్ కంపెనీల షేర్లు శుక్రవారం కుప్పకూలాయి. బీఎస్ఈలో రిలయన్స్ ఇన్‌ఫ్రా షేరు 10.07 శాతం నష్టంతో రూ.211.70 వద్ద ముగియగా ఎన్ఎస్ఈలో 10.91 శాతం నష్టంతో రూ.209.99 వద్ద క్లోజైంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ షేరు కూడా బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో 5 శాతం నష్టంతో రూ.4.46 వద్ద ముగిసింది. రిలయన్స్ పవర్ షేరు బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో ఏకంగా లోయర్ సర్క్యూట్ బ్రేకర్‌ను తాకి వరుసగా రూ.34.48, రూ.34.45 వద్ద ముగిశాయి.

ఇతర సమస్యలు

రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో పాటు తన నిర్వహణలోని రిలయన్స్ క్యాపిటల్‌తోనూ అనిల్ అంబానీ నిండా మునిగారు. రూ.24,000 కోట్ల విలువైన రుణ పత్రాలు చెల్లించలేక 2021లో ఈ కంపెనీ కూడా దివాలా తీసింది. ముంబైలో తొలి మెట్రో లైన్‌ను నిర్మించిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ కూడా ప్రస్తుతం రుణ పత్రాల బకాయిలు చెల్లించలేక ఆపసోపాలు పడుతోంది.

మసకబారిన చరిత్ర

తండ్రి ధీరూభాయ్ అంబానీ మరణానంతరం ఆస్తుల పంపకం దగ్గర అన్న ముకేశ్ అంబానీతో అనిల్ అంబానీ బాగానే గొడవ పడ్డారు. చివరికి కొంతమంది పెద్దల మధ్యవర్తిత్వంతో 2005లో ఇద్దరి మధ్య ఆస్తుల పంపకం ఒప్పందం కుదిరింది. టెలికాం, ఇంధనం, ఫైనాన్స్ రంగాలను అనిల్ తన అధీనంలోకి తెచ్చుకున్నారు. ముకేశ్ అంబానీ పెట్రో రసాయనాలతో సరిపుచ్చుకున్నారు. ఆస్తుల పంపకం తర్వాత అనిల్ అంబానీ పెద్ద ఎత్తున తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇవేవీ కలిసి రాక చివరికి దాదాపు అన్ని సంస్థలు దివాలా తీశాయి. దీంతో 2008లో 4,200 కోట్ల డాలర్ల ఆస్తులతో ప్రపంచ కుబేరుల్లో ఆరో స్థానంలో ఉన్న అనిల్ అంబానీ ఇప్పుడు కనీసం సోదిలో కూడా లేకుండా పోయారు. మరోవైపు అన్న ముకేశ్ అంబానీ మాత్రం టెలికాం, ఫైనాన్స్, రిటైల్ రంగాల్లోకి ప్రవేశించి ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎదిగారు. రిలయన్స్ కమ్యూనికేషన్ (ఆర్‌కామ్) కోసం ఎరిక్సన్ ఏబీ ఇండియా నుంచి తీసుకున్న రూ.550 కోట్ల అప్పు చెల్లించలేక పోవడంతో 2019లో సుప్రీంకోర్టు.. అప్పు చెల్లిస్తారా? లేక జైలుకు వెళతారా? అని అనిల్ అంబానీని హెచ్చరించింది. దాంతో తమ్ముడిని జైలు శిక్ష నుంచి రక్షించేందుకు, ముకేశ్ అంబానీ ఆ అప్పు తీర్చి అనిల్ అంబానీని ఆదుకున్నారు.

వడ్డీ రేట్ల కోతకు సమయం ఆసన్నమైంది..

యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్

కాన్సాస్ సిటీ (అమెరికా): ప్రామాణిక వడ్డీ రేట్లను త్వరలో తగ్గించనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ స్పష్టమైన సంకేతాలిచ్చారు. జాక్సన్ హోల్, వ్యోమింగ్‌లో శుక్రవారం జరిగిన ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ కాన్సాస్ సిటీ వార్షిక సదస్సులో పావెల్ ప్రసంగించారు. "ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను సర్దుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్ ప్రయాణ దిశ స్పష్టంగా ఉంది. అయితే, వడ్డీ రేట్లను ఎప్పుడు తగ్గించాలి, ఎంత మేర తగ్గించాలనేది ముందుముందు విడుదల కానున్న స్థూల ఆర్థిక గణాంకాలు, భవిష్యత్ పరిణామాలు, లాభ, నష్టాల సమతుల్యత వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంద"ని ఆయన అన్నారు. దేశం (అమెరికా)లో వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణం క్రమంగా ఫెడ్ నియంత్రణ లక్ష్యమైన 2 శాతం దిశగా తగ్గుతూ వస్తోందన్న నమ్మకం పెరిగిందన్నారు. చారిత్రక గరిష్ఠానికి పెరిగిన ద్రవ్యోల్బణానికి కళ్లెం వేసేందుకు ఫెడ్ రిజర్వ్ 2022 మార్చి నుంచి 2023 జూలై మధ్యకాలంలో ప్రామాణిక వడ్డీ రేట్లను వరుసగా 11 సార్లు పెంచింది. దాంతో ఫెడ్ ప్రామాణిక రేట్ల శ్రేణి రెండు దశాబ్దాలకు పైగా గరిష్ఠ స్థాయి 5.25-5.50 శాతానికి చేరుకుంది. గడిచిన కొన్ని నెలల్లో అమెరికాలో ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడంతో వచ్చే నెలలో ఫెడ్ రేట్లు తగ్గవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఇప్పటికే ఊపందుకున్నాయి. పావెల్ తాజా వ్యాఖ్యలు ఆ అంచనాలకు మరింత బలం చేకూర్చాయి.

జడ్చర్లలో పిడిలైట్ రోఫ్ ప్లాంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పిడిలైట్ ఇండస్ట్రీస్‌కు చెందిన టైల్స్ అతికింపు (అడ్‌హెసివ్) ఉత్పత్తుల తయారీ సంస్థ రోఫ్ తెలంగాణలోని జడ్చర్లలో కొత్త ప్లాంట్‌ను ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఈశాన్య కర్ణాటక మార్కెట్ల అవసరాలు ఈ ప్లాంట్ తీరుస్తుందని కంపెనీ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లలో ప్రీమియం, స్పెషలైజ్డ్ ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని పిడిలైట్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ పురి అన్నారు. టైల్స్, రాళ్లు అతికించే ఉత్పత్తుల పరిశ్రమను ఆధునీకరించాలన్న తమ విజన్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌ను నెలకొల్పినట్టు చెప్పారు. అయితే ప్లాంట్‌పై ఎంత పెట్టుబడి పెట్టిందీ ఆయన వెల్లడించలేదు. కస్టమర్లకు అత్యున్నత నాణ్యత గల అడ్‌హెసివ్ ఉత్పత్తులు అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని ఆయన అన్నారు. జడ్చర్ల ప్లాంట్‌ను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించుకోగల సదుపాయాలు కూడా మెండుగా ఉన్నాయన్నారు.

ఊగిసలాటల్లోనూ స్వల్ప లాభం

సెన్సెక్స్ 33 పాయింట్లు అప్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో తీవ్ర ఊగిసలాటలకు లోనైన ప్రామాణిక ఈక్విటీ సూచీలు.. చివరికి అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 33.02 పాయింట్ల వృద్ధితో 81,086.21 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 11.65 పాయింట్ల పెరుగుదలతో 24,823.15 వద్ద క్లోజైంది. జాక్సన్ హోల్ సింపోజియమ్‌లో అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం నేపథ్యంలో అంతర్జాతీయంగా ఈక్విటీ ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని కనబరిచారని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే లాభపడ్డాయి.

ఇంటర్నేషనల్ జెమ్మాలజికల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్ పెట్టుబడులు కలిగిన ఇంటర్నేషనల్ జెమ్మాలజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు సిద్ధమైంది. ఐపీఓ ద్వారా రూ.4,000 కోట్ల సమీకరణకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది.

ఎకోస్ మొబిలిటీ ఇష్యూ ధరల శ్రేణి రూ.318-334: ఎకోస్ (ఇండియా) మొబిలిటీ అండ్ హాస్పిటాలిటీ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 28న ప్రారంభమై 30న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.601 కోట్ల వరకు సమీకరించనుంది. కాగా ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.318-334 గా నిర్ణయించింది.

నిఫ్టీ-50 నుంచి దివీస్ ఎగ్జిట్

హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్‌తో పాటు ఎల్‌టీఐ మైండ్‌ట్రీ.. నిఫ్టీ-50 సూచీ నుంచి వైదొలగనున్నాయి. వీటి స్థానాన్ని టాటా గ్రూప్ కంపెనీ ట్రెంట్, ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) భర్తీ చేయనున్నాయి. సెప్టెంబరు 30 నుంచి ఈ మార్పు జరగనుందని ఎన్ఎస్ఈ ఇండిసెస్ వెల్లడించింది.

అదానీ కుటుంబం.. రూ.30,000 కోట్ల వాటాల విక్రయం!

అంబుజా సిమెంట్స్‌లో ఇప్పటికే రూ.4,250 కోట్ల వాటా అమ్మకం

న్యూఢిల్లీ: భారత్‌లో రెండో అతిపెద్ద ధనవంతుడైన గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం.. తమ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల్లో వాటాలను సర్దుబాటు చేసుకునే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. వచ్చే 9 నెలల్లో గ్రూప్ కంపెనీల్లో మొత్తం రూ.30,000 కోట్ల విలువైన వాటాలను విక్రయించాలనుకుంటున్నట్లు తెలిసింది. ఈ కుటుంబం అంబుజా సిమెంట్స్‌లో రూ.4,250 కోట్ల విలువైన 2.8 శాతం వాటాను బహిరంగ మార్కెట్లో బ్లాక్‌డీల్స్ ద్వారా శుక్రవారం విక్రయించింది. భారతీయ అమెరికన్ రాజీవ్ జైన్‌కు చెందిన జీక్యూజీ పార్ట్‌నర్స్‌తో పాటు నేషనల్ పెన్షన్ సిస్టమ్ ట్రస్ట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సహా పలువురు ఇన్వెస్టర్లు ఈ వాటా షేర్లను చేజిక్కించుకున్నాయి. అంబుజా సిమెంట్స్‌లో ప్రమోటరైన అదానీ కుటుంబానికి 70.33 శాతం వాటా ఉంది. బ్లాక్‌డీల్ తర్వాత ఇది 67.53 శాతానికి తగ్గింది. కాగా, ఈ ఏడాది చివరికల్లా అదానీ పవర్‌లోనూ 3 శాతం వరకు వాటా విక్రయం ద్వారా రూ.8,000-10,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల్లో వాటాను 64-68 శాతం స్థాయిలో ఉండేలా అదానీ ఫ్యామిలీ విక్రయ ప్రణాళికను రూపొందించుకుందని ఓ ఆంగ్లదినపత్రిక కథనం పేర్కొంది.

అంబుజాలో జీక్యూజీకి 3.13 శాతం వాటా: అంబుజా సిమెంట్స్‌లో ఇప్పటికే 1.35 శాతం వాటా కలిగిన జీక్యూజీ పార్ట్‌నర్స్.. తాజా లావాదేవీలో మరో 1.78 శాతం వాటాను రూ.2,746.79 కోట్లకు కొనుగోలు చేసింది. దాంతో కంపెనీలో జీక్యూజీ మొత్తం వాటా 3.13 శాతానికి పెరిగింది.

మహిళల కోసం ప్రత్యేక పొదుపు ఖాతా

బంధన్ బ్యాంక్

బంధన్ బ్యాంక్ తన వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కొత్తగా రెండు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా మహిళల కోసం ప్రత్యేకంగా అవ్ని పేరుతో పొదుపు ఖాతాను ప్రారంభించింది. ఈ ఖాతా కింద మహిళలకు లాకర్ అద్దెపై 25 శాతం రాయితీతో పాటు బంగారం రుణాల ప్రాసెసింగ్ ఫీజుపై 50 శాతం డిస్కౌంట్‌ను ఆఫర్ చేస్తోంది. అలాగే అవ్ని ఖాతా ద్వారా ప్రత్యేక డెబిట్ కార్డుతో ఉచిత ఎయిర్‌పోర్ట్ లాంజ్ ప్రవేశం, రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమాను ఆఫర్ చేస్తోంది. దీంతో పాటు బంధన్ బ్యాంక్ డిలైట్స్ పేరుతో కస్టమర్ లాయల్టీ ప్రోగ్రామ్‌ను బ్యాంక్ అందుబాటులోకి తీసుకువచ్చింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,650 ▼	66,600 ▼	91,700 ▼
ముంబై	71,424 ▼	65,424 ▼	84,615 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	102
కర్నూలు	109	నెల్లూరు	102
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

స్పోర్ట్స్

ఈ స్టార్ల ప్రతిభకు పసిడి పంటే!

పారాలింపిక్స్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

సమ్మర్ ఒలింపిక్స్‌ను ఘనంగా ముగించిన పారిస్ ఇప్పుడు పారాలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. 22 క్రీడాంశాల్లో 4500 మంది అథ్లెట్లు పాల్గొనబోతున్న ఈ ఈవెంట్ ఈనెల 29 నుంచి 11 రోజుల పాటు జరగనుంది. ఇందులో గత పారాగేమ్స్‌లో విశేష ప్రతిభ కనబర్చడంతో పాటు బరిలోకి దిగిన ప్రతీ అంతర్జాతీయ వేదికపై అద్భుతంగా రాణిస్తున్న గ్లోబల్ స్టార్లున్నారు. తాజా గేమ్స్‌లోనూ వారిపై అంచనాలు ఆకాశాన్నంటాయి. ఓసారి అలాంటివారిపై లుక్కేద్దాం..



బంగారు చేప.. సిమోన్ బార్లామ్ — స్విమ్మింగ్

పారాగేమ్స్ స్విమ్మింగ్‌లో ఇటలీ ఆధిపత్యానికి బార్లామ్‌దే కీలక పాత్ర. మిలన్‌కు చెందిన 24 ఏళ్ల సిమోన్ కాలు మరో కాలితో పోలిస్తే చిన్నదిగా ఉంటుంది. చిన్నతనంలో సర్జరీల కోసం అతను పారిస్‌లో కొంతకాలం గడిపాడు. 14 ఏళ్ల వయస్సులో స్విమ్మింగ్‌ను కెరీర్‌గా ఎంచుకున్న బార్లామ్ ఎస్ 9 కేటగిరీలో టోక్యో గేమ్స్‌లో ఓ స్వర్ణం, రెండు రజతాలు, ఓ కాంస్యం సాధించాడు. అలాగే గతేడాది వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆరు విభాగాల్లో ఆరు స్వర్ణాలు అందుకుని తాజా పారాలింపిక్స్‌లో ప్రత్యర్థులకు దడ పుట్టించబోతున్నాడు.



అజేయుడు... అలెక్సిస్ హాన్‌క్విన్‌క్వాంట్ — ట్రయాథ్లాన్

పీటీఎస్4 ట్రయాథ్లాన్‌లో పోటీపడే 38 ఏళ్ల అలెక్సిస్ డిఫెండింగ్ చాంపియన్ కూడా. టోక్యో గేమ్స్ తర్వాత అతను పాల్గొన్న ఏ టోర్నీలోనూ అపజయమే లేదు. 2010లో యాక్సిడెంట్‌కు గురైన అలెక్సిస్ కుడి మోకాలి కింది భాగం నుంచి కాలును తీసేయాల్సి వచ్చింది. అయినా నిరాశచెందకుండా 2016 నుంచి పారా ట్రయాథ్లాన్‌లో జోరు కొనసాగిస్తున్నాడు.



నెంబర్‌వన్.. డీడే డి గ్రూట్ — వీల్‌చెయిర్ టెన్నిస్

వీల్ చెయిర్ టెన్నిస్‌లో 27 ఏళ్ల డీ గ్రూట్ మహిళల సింగిల్స్, డబుల్స్‌లోనూ వరల్డ్ నెంబర్‌వన్‌గా కొనసాగుతోంది. ఆమె ఖాతాలో మొత్తం 42 టైటిళ్లున్నాయి. ఆ జోరుతోనే టోక్యో పారాలింపిక్స్ సింగిల్స్, డబుల్స్‌లోనూ స్వర్ణాలు సాధించగలిగింది. కుడి కాలు లోపంతో జన్మించిన గ్రూట్ ఏడో ఏట టెన్నిస్‌పై ఆసక్తి పెంచుకుంది. 2017లో తొలి టైటిల్ అందుకున్న తర్వాత ఇక వెనుదిరిగి చూడలేదు. అంతేకాకుండా 2021 నుంచి ఈ ఏడాది వరకు వరుసగా ఆస్ట్రేలియన్, ఫ్రెంచ్, వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను ఖాతాలో వేసుకుని చరిత్ర సృష్టించింది. ఈ ఘనతలకు గుర్తుగా ఈ ఏడాది ఆరంభంలో అంగవైకల్య విభాగంలో ప్రతిష్టాత్మక లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్‌గానూ నిలవడం విశేషం.



బ్లేడ్ జంపర్.. మార్కస్ రెహ్మ్ — అథ్లెటిక్స్

ఇప్పటికే 4 ఒలింపిక్ స్వర్ణాలను ఖాతాలో వేసుకున్న మార్కస్ రెహ్మ్‌ను అంతా బ్లేడ్ జంపర్‌గా పిలుచుకుంటారు. లాంగ్‌జంప్‌లోనే అతను మూడు గోల్డ్ మెడల్స్ సాధించాడు. పారిస్ పారా అథ్లెటిక్స్‌లోనూ అతడినే ఫేవరెట్‌గా పరిగణిస్తున్నారు. నీటిలో వేక్‌బోర్డింగ్ చేస్తున్న సమయంలో రెహ్మ్ తన కుడి కాలిని కోల్పోయాడు. 2011లో ప్రొస్థెసిస్ కాలుతో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొని టీ64 ఈవెంట్‌లో ఆధిక్యం ప్రదర్శిస్తున్నాడు. అలాగే 8.72మీ. దూరంతో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు.

సిల్వర్ బుల్లెట్.. మార్సెల్ హగ్ — అథ్లెటిక్స్

తలకు సిల్వర్ హెల్మెట్‌తో బరిలోకి దిగే మార్సెల్ దృష్టి మాత్రం ఎప్పుడూ స్వర్ణంపైనే ఉంటుంది. ఎందుకంటే 38 ఏళ్ల ఈ స్విస్ గ్రేట్ ఖాతాలో ఇప్పటికే ఆరు పారాలింపిక్స్ స్వర్ణాలున్నాయి. వెన్నెముక సమస్యతో జన్మించిన హగ్ టోక్యో పారాగేమ్స్ టీ54 కేటగిరీలో మారథాన్‌తో పాటు 800, 1500, 5000మీ.లలోనూ స్వర్ణాలు దక్కించుకున్నాడు. అంతకుముందు రియో పారాగేమ్స్‌లో రెండు స్వర్ణాలు అందుకున్నాడు. ఈసారి కూడా హగ్ ఈ నాలుగు విభాగాలను క్లీన్‌స్వీప్ చేస్తాడనే అంతా భావిస్తున్నారు.





ఒక్సానా మాస్టర్స్ — సైక్లింగ్

చెర్నోబిల్ రియాక్టర్ పేలుడు జరిగిన మూడేళ్లకు శారీరక లోపాలతో జన్మించిన ఒక్సానా అనాథాశ్రమంలో పెరిగింది. ఆ తర్వాత ఏడేళ్ల వయస్సులో యూఎస్ మహిళ దత్తత తీసుకోవడంతో ఉక్రెయిన్ నుంచి తరలివెళ్లింది. ముందు రోయర్‌గా లండన్ పారాగేమ్స్‌లో కాంస్యం సాధించిన ఒక్సానా అనంతరం పారా సైక్లింగ్, క్రాస్ కంట్రీ స్కీయింగ్ వైపు దృష్టి సారించింది. టోక్యోలో సైక్లింగ్ రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు దక్కించుకుంది.



కాజల్‌కు స్వర్ణం

అమ్మాన్ (జోర్డాన్): అండర్-17 వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత మహిళా రెజ్లర్ల జోరు కొనసాగుతోంది. శుక్రవారం మన మహిళలు స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. మహిళల 69 కి. ఫైనల్లో ఒలెక్సాండ్రా (ఉక్రెయిన్)ను 9-2తో చిత్తు చేసిన కాజల్ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఇక..మహిళల 46 కి. స్వర్ణ పతక పోరులో యు కట్సుమి (జపాన్) చేతిలో ఓడిన శ్రుతిక రజత పతకంతో సరిపెట్టుకుంది. మహిళల 40 కి.లలో రాజ్‌బాల, మహిళల 53 కి.లలో ముస్కాన్ కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అయితే పురుషుల విభాగంలో బరిలోకి దిగిన ఐదుగురు భారత రెజ్లర్లలో ఒక్కరు కూడా సెమీస్‌కు చేరలేకపోయారు. కాగా..మహిళల ఫ్రీస్టయిల్‌లో గురువారం భారత్ నాలుగు స్వర్ణాలు సాధించిన విషయం విదితమే.

ఇస్లామ్ సెంచరీ మిస్



బంగ్లాదేశ్ 316/5
పాక్‌తో తొలి టెస్ట్

రావల్పిండి: ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (93) పునరాగమనంలో శతకం చేజార్చుకోగా, మోమినుల్ హక్ (50), ముష్ఫికర్ రహీమ్ (55 బ్యాటింగ్), లిటన్ దాస్ (52 బ్యాటింగ్) రాణించడంతో తొలి టెస్ట్‌లో పాకిస్థాన్‌కు బంగ్లాదేశ్ దీటైన జవాబిచ్చే దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 27/0తో శుక్రవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన పర్యాటక జట్టు మూడోరోజు ఆఖరికి ఐదు వికెట్లకు 316 పరుగులు చేసింది. పాకిస్థాన్ స్కోరుకు ఇంకా 132 పరుగుల వెనుకంజలో నిలిచింది. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 448/6 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. కాగా..ఈ మ్యాచ్ మిగిలిన రెండో రోజులు అభిమానులకు ఉచితంగా ప్రవేశం కల్పించాలని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు నిర్ణయించింది.

విజయం దిశగా ఇంగ్లండ్

మాంచెస్టర్: శ్రీలంకతో తొలి టెస్ట్‌లో ఇంగ్లండ్ జట్టు విజయం దిశగా అడుగులు వేస్తోంది. రెండో ఇన్నింగ్స్‌లో శుక్రవారం ఆట ఆఖరికి శ్రీలంక 204/6 స్కోరు చేసింది. 82 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉన్న పర్యాటక జట్టుకు కేవలం నాలుగు వికెట్లే చేతిలో ఉన్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ 259/6తో మూడోరోజు మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 358 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

కిశోర్ కుమార్ రికార్డు

మాల్దీవ్స్: అండర్-18 ఆసియన్ సర్ఫింగ్ చాంపియన్‌షిప్స్‌లో సెమీస్‌కు చేరిన తొలి భారత ప్లేయర్‌గా కిశోర్ కుమార్ రికార్డు నెలకొల్పాడు. మొత్తం ఎనిమిది మంది భారత ఆటగాళ్లు పాల్గొనగా తమిళనాడుకు చెందిన కిశోర్ ఒక్కడే పోటీలో మిగిలాడు. హీట్ 3 క్వార్టర్స్‌లో కిశోర్ అత్యధికంగా 11.50 స్కోరు సాధించాడు. అలాగే ఈ చాంపియన్‌షిప్స్‌లో భారత్ తరపున ఇదే అత్యధికం కావడం విశేషం. శనివారం సెమీస్ జరుగుతుంది.

90 మీ. లక్ష్యానికి చేరువలో నీరజ్



లాసన్నే డైమండ్ లీగ్‌లో రెండో స్థానం

లాసన్నే: డిఫెండింగ్ చాంపియన్‌గా పారిస్ ఒలింపిక్స్ బరిలో దిగిన భారత స్టార్ నీరజ్ చోప్రా..జావెలిన్ త్రోలో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. అయితే పారిస్‌లో నీరజ్ విసిరిన ఆరు త్రోలలో ఐదు ఫౌల్ కావడం ఆశ్చర్యపరిచింది. గజ్జల్లో గాయంతో బాధపడుతుండడమే అన్ని ఫౌల్స్‌కు కారణమని చోప్రా ఆ తర్వాత వివరణిచ్చాడు. ఈ నేపథ్యంలో నీరజ్..గురువారం అర్ధరాత్రి జరిగిన లాసన్నే డైమండ్ లీగ్ జావెలిన్ ఫైనల్లో ప్రశంసనీయ రీతిలో రాణించాడు. ఎంతో కాలంగా తనను ఊరిస్తున్న 90 మీటర్ల మార్క్ సమీపానికి చేరుకున్నాడు. పారిస్ ఒలింపిక్స్ (89.45మీ.) ను మించి 89.49మీ. దూరం ఈటెను విసిరిన చోప్రా రెండో స్థానం దక్కించుకున్నాడు. ఈ దూరం అతడి సీజన్ బెస్ట్ . పారిస్‌లో కాంస్యం నెగ్గిన అండర్సన్ పీటర్స్ (గ్రెనడా, 90.61మీ.) డైమండ్ లీగ్ మీట్ రికార్డుతో లాసన్నేలో అగ్ర స్థానంలో నిలిచాడు. జూలియన్ వెబర్ (జర్మనీ) 87.08 మీ.లతో మూడో స్థానం సాధించాడు. ఇక..లాసన్నే ప్రదర్శనతో వచ్చే నెల బ్రస్సెల్స్‌లో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్‌కు నీరజ్ క్వాలిఫై అయ్యాడు.

అతడి సలహాతోనే..: కెన్యా జావెలిన్ త్రోయర్ జూలియస్ ఎగో ఇచ్చిన సలహా పాటించి తాను లాసన్నేలో రెండో స్థానం చేజిక్కించుకున్నట్టు నీరజ్ వెల్లడించాడు. ఐదో ప్రయత్నంలో 85.58 మీ. దూరం విసరడంతో టాప్-3లోకి దూసుకొచ్చాడు. 'ఆఖరి రౌండ్‌లో అండర్సన్ 90 మీ. విసరడంతో నాలో ఒత్తిడి ఏర్పడింది. అయితే ప్రశాంతంగా ఉంటే అనుకున్న దూరం విసరగలుగుతావని ఎగో సలహా ఇచ్చాడు' అని నీరజ్ తెలిపాడు. అది ఫలించి చోప్రా దాదాపు 90 మీ. దరిదాపులకు రావడం విశేషం.

ఆ టెస్టుకు రెస్ట్ డే

కివీస్‌తో శ్రీలంక సిరీస్

కొలంబో: శ్రీలంక-న్యూజిలాండ్ జట్ల మధ్య వచ్చేనెల 18నుంచి గాలె వేదికగా జరిగే టెస్టుకు రెస్ట్ డే కేటాయించారు. ఇందులో 21వ తేదీని విశ్రాంతిరోజుగా ప్రకటించారు. రెండో టెస్టు మాత్రం ఐదు రోజులే జరుగనుంది.

ఎందుకీ విశ్రాంతి? : సెప్టెంబరు 21ని విశ్రాంతి దినంగా ప్రకటించడం వెనుక కారణం.. అదే రోజు శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు ఉండడమే. అందుకే తొలి రెండు రోజుల మ్యాచ్ తర్వాత మూడో రోజున మ్యాచ్‌ను నిర్వహించడం లేదు. మరోవైపు 23 ఏళ్ల తర్వాత శ్రీలంక జట్టు స్వదేశంలో ఆరు రోజుల టెస్టును నిర్వహించబోతోంది. 2001లో జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లోనూ విశ్రాంతి దినం కేటాయించారు. 2008లో బంగ్లాదేశ్ కూడా పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా శ్రీలంకతో ఆరు రోజుల టెస్టు ఆడింది.

ధోనీ విషయంలో తప్పు చేశా



దినేశ్ కార్తీక్

చెన్నై: మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ గతవారం తన ఆల్‌టైమ్ ఫేవరెట్ ఎలెవన్ జట్టును ప్రకటించాడు. అయితే ఇందులో ఆశ్చర్యకరంగా ఎంఎస్ ధోనీకి చోటివ్వలేదు. దీంతో నెట్టింట డీకేపై తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో అతడు వివరణ ఇచ్చాడు 'ధోనీ విషయంలో నేను చాలా పెద్ద తప్పు చేశాను. ఆ జాబితా బయటికి వచ్చాకే ఈ పొరపాటును గమనించాను. అందుకే అందరూ నన్ను క్షమించాలి. లిస్టులో ద్రవిడ్ ఉండడంతో అతడినే కీపర్‌గా అనుకున్నారు. కానీ నిజానికి నేను కీపర్ పేరును మర్చిపోయా. నా జట్టుకు ధోనీనే కెప్టెన్' అని డీకే తెలిపాడు.

వరుసగా నాలుగో డ్రా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్యూఫీల్డ్ కప్ చెస్ టోర్నమెంట్‌లో గుకేష్, ప్రజ్ఞానందకు వరుసగా నాలుగో డ్రా ఎదురైంది. నాలుగో రౌండ్‌లో ఫ్రాన్స్ జీఎం అలీరెజా ఫిరౌజాతో గుకేష్, మరో బోర్డుపై నెదర్లాండ్స్ జీఎం అనిష్ గిరితో తలపడిన ప్రజ్ఞానంద తమ గేమ్‌లను డ్రా చేసుకున్నారు.

పెను విషాదం



ప్రాణాలు తీస్తున్న ఫార్మా!

నిత్యం ప్రమాదాలు, మరణాలు.. యాజమాన్యాలకు పట్టని నిబంధనలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ఫార్మారంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎక్కడెక్కడి నుంచో పెట్టుబడిదారులు వచ్చి ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వం వారి కోసం కొత్తగా ఫార్మాసిటీలు నిర్మిస్తోంది. భారీ ఎత్తున మందులు తయారీ చేస్తున్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో కూడా ఫార్మా కంపెనీలు వందల సంఖ్యలో ఉన్నాయి. కానీ అక్కడ ప్రమాదాల సంఖ్య చాలా తక్కువ. మరణాల రేటూ స్వల్పమే. ఇక్కడ మాత్రం ఫార్మా కంపెనీలు నిత్యం మండుతూనే ఉన్నాయి. విశాఖ పరిసరాల్లోని పరవాడ, అచ్యుతాపురం, నక్కపల్లిని ఫార్మా క్లస్టర్లుగా వ్యవహరిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏటా కనీసం ఐదుకు తక్కువకాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. పది మందికిపైగా ఉద్యోగులు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది మృతిచెందారు. నాలుగేళ్ల క్రితం విశాఖలో జరిగిన ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదంలో 12మంది చనిపోయారు. ఇక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే మృతుల సంఖ్య అధికంగా ఉంటోంది. అదే తెలంగాణలో స్వల్పంగా ఉంటోంది. ఇందుకు కారణం ఏంటి? ఎక్కడ లోపం ఉంది? అనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.



ఎల్జీ పాలిమర్స్‌లో ప్రమాద దృశ్యం (ఫైల్)

> విశాఖపట్నం పరిసరాల్లోని పరవాడలో 90, అచ్యుతాపురంలో 208, శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరంలో 40 ప్రమాదకరమైన ఫార్మా కంపెనీలు ఉన్నాయి.
>
> 2019 నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో ఫార్మా కంపెనీల్లో 119 ప్రమాదాలు జరగగా, 120 మంది ప్రాణాలు కోల్పోయారు.
>
> - ఎసెన్షియా బాధితుల పరామర్శ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు

బల్క్ డ్రగ్స్ తయారీలోనే ఎక్కువ

ఫార్మా కంపెనీలు రెండు రకాలు. ఒకటి బల్క్ డ్రగ్స్ తయారు చేసేవి. మరొకటి ఫార్ములేషన్స్ తయారు చేసేవి. రెండింటి మధ్య చాలా తేడా ఉంది. ఫార్ములేషన్స్ అంటే మాత్రలు, ఆయింట్‌మెంట్లు, ఇంజక్షన్లు వంటివి తయారు చేస్తాయి. వీటికి రియాక్టర్లు అవసరం లేదు. ముడి పదార్థాలు తెచ్చుకొని వాటిని కలిపి, మందులు తయారు చేసుకుంటాయి. ఇక్కడ ప్రమాదాలు జరగడానికి అవకాశం లేదు. ఏదైనా జరిగితే ప్రాసెస్‌కు సంబంధం లేనివే ఉంటాయి. తెలంగాణలో ఎక్కువ శాతం ఫార్ములేషన్స్ కంపెనీలే. అందుకే అక్కడ ప్రమాదాలు తక్కువ. ఇక బల్క్ డ్రగ్స్ అంటే... రసాయనాలు, సాల్వెంట్స్, పౌడర్లు పెద్దఎత్తున తయారు చేస్తారు. వీటికి రియాక్టర్లు అవసరం. ఫార్ములేషన్స్‌కు అవసరమైన ముడి పదార్థాలన్నీ ఇక్కడే తయారవుతాయి. బల్క్ డ్రగ్స్‌ను తయారు చేయకపోతే పెద్దఎత్తున దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వీటిని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. వీటిలో రియాక్టర్లు, ప్రమాదకరమైన రసాయనాలు ఉంటాయి. వీటితో జాగ్రత్తగా వ్యవహరించకపోతే తీవ్ర ప్రమాదాలు జరుగుతాయి.

'సెల్ఫ్ సర్టిఫికేషన్'తో తంటాలు

ఫార్మా కంపెనీల్లో జగన్ ప్రభుత్వం 'సెల్ఫ్ సర్టిఫికేషన్' విధానం తీసుకు వచ్చింది. ఏదైనా కంపెనీ ఏర్పాటు చేసినపుడు అక్కడ భద్రతాపరంగా కొన్ని ప్రమాణాలు పాటించాలి. వాటిని అధికారులు తనిఖీ చేసి సర్టిఫై చేయాలి. కానీ జగన్ ప్రభుత్వ విధానం వల్ల అధికారులు తనిఖీ చేయకుండా.. ఏ సంస్థకు ఆ సంస్థ 'మేము అన్నీ చేసేశాం'.. అని 'సెల్ఫ్ సర్టిఫికేషన్' చేసి ఒక పత్రం పడేస్తే ఉత్పత్తి చేసుకునే అవకాశం లభిస్తుంది. దానివల్ల పలు కంపెనీలు ఖర్చును తగ్గించుకోవడానికి భద్రత ఏర్పాట్లు చేయకుండా మమ అనిపిస్తున్నాయి. అటువంటి చోట్ల ప్రాణనష్టం అధికంగా ఉంటోంది.

శిక్షణ కూడా పూజ్యమే

ఫార్మా కంపెనీలో నైపుణ్యం గల వారిని నియమించుకోవాలి. వారికి రసాయనాలు, పౌడర్లు, అక్కడ ఉండే యంత్రాలపై అవగాహన ఉండాలి. ప్రమాదకర పరిస్థితులు వస్తే ఎలా స్పందించాలో శిక్షణ ఇవ్వాలి. వాటిపై రెగ్యులర్‌గా మాక్‌డ్రిల్ నిర్వహించాలి. ఇది నిత్యం జరగాలి. ఇవన్నీ 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్'లో ఉంటాయి. కానీ చాలామంది వీటిని పాటించడం లేదు. అందువల్లే ప్రమాదాలు జరిగినపుడు ప్రాణనష్టం అధికంగా ఉంటోంది. డిగ్రీ చదివిన యువతను రూ.15వేల జీతానికి తీసుకువచ్చి పనులు చేయించుకుంటున్నారు. అధిక లాభాలు సంపాదించాలనే ఆశతో నిబంధనలు పాటించడం లేదు. కొత్తగా వస్తున్న కంపెనీలన్నీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్నాయి. వాటిని తనిఖీ చేసి సర్టిఫై చేసే పరిజ్ఞానం ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే అధికారుల్లో చాలామందికి లేదు. థర్డ్ పార్టీతో తనిఖీలు చేయించి నివేదికలు తీసుకుంటున్నారు. తనిఖీలకు వచ్చే థర్డ్ పార్టీలను ఫార్మా యాజమాన్యాల్లో కొందరు లోబరుచుకొని తప్పుడు నివేదికలు ఇప్పించుకుంటున్నారు. ఇది కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. ఎసెన్షియా విషయానికి వస్తే రెండేళ్ల క్రితమే థర్డ్ పార్టీ తనిఖీ చేసి లోపాలను నివేదించింది. కానీ వారు దానిని పట్టించుకోకపోవడంతో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

> ఫార్మా రంగం అంటే... జబ్బులను నియంత్రించి ప్రజల ప్రాణాలు కాపాడేదే. కానీ రాష్ట్రంలో ఫార్మా కంపెనీలు వరస ప్రమాదాలతో ఉద్యోగుల ప్రాణాలు తీస్తున్నాయి. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఏటా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పదుల సంఖ్యలో ఉద్యోగులు మృత్యువాత పడుతున్నారు. యాజమాన్యాలు నిబంధనలు పాటించకపోవడం, ఉద్యోగులకు కనీస అవగాహన కల్పించకపోవడం, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడమే ప్రమాదాలకు కారణాలని తెలుస్తోంది.

బజరింగ్ సిస్టమ్ పాటించాలి

రియాక్టర్లు ఉపయోగించే పరిశ్రమలతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అన్ని కంపెనీల్లో బజరింగ్ విధానం అమలు చేయాలి. రియాక్టర్లలో నిర్దీత ఉష్ణోగ్రత దాటితే అవి పేలిపోతాయి. అలా జరగకుండా ఆటోమేటిక్ స్విచ్ఛాఫ్ సిస్టమ్ పెట్టుకోవాలి. దానివల్ల ప్రాసెస్ ఆగిపోతుంది. ప్రమాదం తప్పుతుంది. అనుకోనిది ఏదైనా జరిగితే అలారమ్ మోగించే విధానం ఉండాలి. అంతా అప్రమత్తమై బయటకు వెళ్లిపోవచ్చు. ఎసెన్షియాలో ఇలాంటి ఏర్పాట్లు లేకపోవడం వల్ల భారీ ప్రాణనష్టం జరిగింది. ముందుజాగ్రత్తగా మాక్ డ్రిల్స్ చేయించాలి. పరవాడ, అచ్యుతాపురం ప్రాంతాల్లో 30 పడకల ఆస్పత్రులను నిర్మించాలి.

- దాడి మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్, ఫార్మసీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

ఆధిపత్య పోరే ముంచిందా?

- ఎసెన్షియా భాగస్వాముల మధ్య విభేదాలు
- 74% వాటా కొన్న డెక్కన్ కెమికల్స్‌కు నో ఎంట్రీ
- ట్రిబ్యునల్ తీర్పునూ ఖాతరు చేయని నిర్వాహకులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదం జరగడానికి సంస్థ భాగస్వాముల మధ్య విభేదాలే కారణమనే వాదన బలంగా వినిపిస్తోంది. అమెరికాలో స్థిరపడిన ఆంధ్రుడే ఈ కంపెనీ వ్యవస్థాపకుడు. ఆయన పేరు పెండ్రి యాదగిరిరెడ్డి. తానే సీఈఓగా వ్యవహరిస్తున్నారు. కోరాడ శ్రీనివాసరావు సీఎఫ్ఓగా ఉన్నారు. పెండ్రి కిరణ్‌రెడ్డి, దండు చక్రధర్, అజిత్ అలెగ్జాండర్, వివేక్ వసంత్ డైరెక్టర్లు. ఈ కంపెనీలో 74 శాతం వాటాను డెక్కన్ కెమికల్స్ సంస్థ ఇటీవల కొనుగోలు చేసింది. అయితే వారిని సంస్థ ఆవరణలోకి కూడా రానీయడం లేదు. దీనిపై డెక్కన్ ప్రతినిధులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆ ఆదేశాలను కూడా ఎసెన్షియా యాజమాన్యం పక్కన పెట్టేసింది. తమకు కంపెనీలో ఉన్న వాటా ప్రకారం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)ను నియమించుకునే హక్కుందని, కానీ అసలు పరిశ్రమ ఆవరణలోకే రానీయడం లేదని పేర్కొంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు డెక్కన్ కెమికల్స్ ప్రతినిధులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కంపెనీలో ఏమి జరుగుతున్నదో తమకు తెలియదని, నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడం లేదని వారు ఆరోపించారు. అంటే తాజాగా జరిగిన ప్రమాదానికి, తమకు ఎటువంటి సంబంధం లేదని వారు పరోక్షంగా తెలియజేశారు. మరోవైపు ఎసెన్షియాకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న యాదగిరి రెడ్డి ఇంత పెద్ద ప్రమాదం జరిగిన తరువాత కూడా సంస్థ తరఫున ఇప్పటివరకు ప్రకటన చేయలేదు. ప్రభుత్వ అధికారులకు కూడా అందుబాటులోకి రాలేదు. ఆయన విశాఖపట్నంలోనే ఉన్నారని ప్రభుత్వ అధికారులకు సమాచారం అందింది. సంస్థ నిర్వహణ కోసం జరుగుతున్న ఆధిపత్య పోరులో పడి అసలు అక్కడ వ్యవహారాలు సరిగ్గా జరుగుతున్నాయా? లేదా? అనే విషయాలను పట్టించుకోలేదని, థర్డ్ పార్టీ ఇన్‌స్పెక్షన్‌లో లోపాలు వెల్లడించినా వాటి గురించి పట్టించుకోలేదనే వాదన వినిపిస్తోంది. ఈ ఘటనపై రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు 106(1), 125(ఏ), 125(బి) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి రూ.కోటి

పొందూరు, ఆగస్టు 23: ఎసెన్షియా ఫార్మా కంపెనీ బాధిత కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మృతుల కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం అందజేస్తోంది. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ కుటుంబానికి తహసీల్దార్ రమేశ్ రూ.కోటి చెక్కును అందజేశారు. ప్రశాంత్ భార్య జ్యోతికి చెక్ అందజేశామని ఆయన తెలిపారు.

లోతైన విచారణ చేయాలి

- ఎసెన్షియాపై ప్రభుత్వ స్పందన సరిగా లేదు: జగన్

అనకాపల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాలపై లోతైన విచారణ జరిపి, తప్పు ఎక్కడజరిగిందో గుర్తించి చర్యలు చేపట్టాలని మాజీ సీఎం జగన్ డిమాండ్ చేశారు. శుక్రవారం అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీ ప్రమాద క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎసెన్షియా ఫార్మా ప్రమాద ఘటనపై ప్రభుత్వం వ్యవహరించిన, స్పందించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన ఈ ప్రభుత్వంలో కనిపించడం లేదన్నారు. బాధిత కుటుంబాలకు సకాలంలో పరిహారం ఇవ్వాలని, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలోని మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు న్యాయం జరగకపోతే అనకాపల్లిలో ధర్నా చేస్తామని, అవసరమైతే ధర్నాలో పాల్గొని బాధితుల పక్షాన నిలబడతానన్నారు. కాగా, ఎసెన్షియా ప్రమాద బాధితుల పరామర్శకు అనకాపల్లి వచ్చిన జగన్ ఆద్యంతం క్షతగాత్రులను నవ్వుతూ పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి బయట మీడియాతో మాట్లాడుతూ రాజకీయ ప్రసంగం చేశారు. ప్రభుత్వ పథకాల అమలుపై విమర్శలు చేశారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకుండా కక్షసాధింపు చర్యలకు దిగుతోందని జగన్ విమర్శించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. పెట్టుబడి సాయం, పంటల బీమా చెల్లించలేదన్నారు. ప్రభుత్వంలో అవినీతి పెరుగుతోందని విమర్శించారు.

'ఎసెన్షియా'పై నివేదికను తొక్కిపెట్టావెందుకు?

- కార్మికుల ప్రాణాలు పట్టవా?.. జగన్‌ను నిలదీసిన వైఎస్ షర్మిల



అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గతేడాది చివర్లో అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా నిర్వాహకాలను ఓ రిపోర్టు బయట పెట్టిందని, ఎన్నో ప్రమాదాలపై హెచ్చరికలు జారీ చేసిందని, అయినా వైసీపీ ప్రభుత్వం ఆ నివేదికను ఎందుకు తొక్కిపెట్టిందని వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల నిలదీశారు. శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా.. పలు అంశాలను ప్రస్తావించారు. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉండగానే నివేదిక వచ్చినా కార్మికుల భద్రతను గాలికొదిలేసి రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కంపెనీకి పాతిక కిలోమీటర్ల దూరంలో కొండను పిండిచేసి రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడానికి డబ్బు, తీరిక ఉంటాయా? కార్మికుల ప్రాణాలు పట్టవా? అంటూ జగన్‌ను నిలదీశారు. తక్షణమే ఎసెన్షియా ఫార్మాను సీజ్ చేయాలని కూటమి సర్కారుకు షర్మిల విజ్ఞప్తి చేశారు.

ఎసెన్షియా పాపం ముమ్మాటికీ జగన్‌దే: సవిత

ఎసెన్షియా పరిశ్రమ దుర్ఘటన పాపం ముమ్మాటికీ జగన్‌దేనని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. జగన్ నీరో చక్రవర్తిలా ఇంట్లో కూర్చొని పబ్జీ గేమ్‌లు ఆడుతూ ఐదేళ్లు నెట్టుకొచ్చేశారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని, వ్యవస్థల్ని విధ్వంసం చేసిన ఘనత జగన్‌దేనన్నారు.

'ఎసెన్షియా'పై క్రిమినల్ కేసులు: హెచ్ఆర్ఎఫ్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) డిమాండ్ చేసింది. చాలాకాలంగా సేఫ్టీ ఆడిట్ జరగకపోవడమే ప్రమాదానికి కారణమని ఉప ముఖ్యమంత్రి కూడా చెబుతున్నారని, పరిశ్రమల్లో భద్రతా పర్యవేక్షణను యాజమాన్యం, అధికారులు పూర్తిగా గాలికొదిలేశారని హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శరత్, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అనూరాధ విమర్శించారు. సెజ్ చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

అచ్యుతాపురంపై జగన్ శవ రాజకీయాలు: కొల్లు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 23: అచ్యుతాపురం ఘటనపై జగన్ శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. సెజ్ ప్రమాదంపై రాష్ట్రంలోని ప్రజలందరూ బాధపడుతుంటే జగన్‌రెడ్డి రాజకీయం చేయాలని తాపత్రయపడుతున్నారని విమర్శించారు. బాధితుల దగ్గరకు వెళ్లి రాజకీయాలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

ఎల్జీ పాలిమర్స్ బాధితులకు చేసిన మోసం గుర్తు లేదా?

- జగన్‌కు అచ్చెన్నాయుడు ప్రశ్న

అమరావతి, ఆగస్ట్ 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎల్జీ పాలిమర్స్ కంపెనీలో దుర్ఘటన జరిగినప్పుడు తాను గొప్పగా ఆదుకొన్నానని కబుర్లు చెబుతున్న మాజీ సీఎం జగన్‌కు ఆ ప్రమాద బాధితుల్లో కొందరికి చేసిన మోసం గుర్తు లేదా అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిలదీశారు. 'ఎల్జీ పాలిమర్స్ ప్రమాదంలో చనిపోయిన వారందరికీ తలకు రూ.కోటి ఇస్తానని సీఎం హోదాలో జగన్ ప్రకటించారు. బాధితుల్లో ముగ్గురు చికిత్స తీసుకొంటూ 15 రోజుల తర్వాత చనిపోతే వారికి కేవలం రూ.లక్ష చొప్పున పరిహారం ఇచ్చి సరిపెట్టారని అచ్చెన్న ఆక్షేపించారు. కాగా, ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా టీడీపీ కేంద్ర కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు.

పరిశ్రమల్లో భద్రతపై చర్యలు: హోంమంత్రి అనిత

విశాఖపట్నం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో భద్రతను పెంపొందించే చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. పరవాడ సినర్జిన్ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ... ఫార్మా పరిశ్రమలో రసాయనాలు కలిపేటప్పుడు ప్రమాదం జరిగిందని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే పరిశ్రమల భద్రతపై సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రమాదాల నియంత్రణకు కమిటీ వేసి పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు.

ఎసెన్షియా విషాదంపై సీఎస్, డీజీపీకి ఎన్‌హెచ్ఆర్‌సీ నోటీసులు

- రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాద ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) స్పందించింది. రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ సీఎస్, డీజీపీకి శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మరణించారని, మరో 50 మంది గాయపడ్డారని మీడియాలో వచ్చిన వార్తలను కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఈ ఘటన వెనుక కారణాలు ఇప్పటికీ స్పష్టంగా లేవని, పేలుడు తర్వాత శిథిలాల్లో ఎవరైనా ప్రాణాలతో ఉన్నారా? అని స్టేట్ డిజాస్టర్స్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు వెతుకుతున్నట్లు సమాచారం వచ్చిందని కమిషన్ పేర్కొంది. పేలుడు జరిగిన సమయంలో ఎంతమంది కార్మికులు విధుల్లో ఉన్నారనే దానిపై స్పష్టత లేదని తెలిపింది. దీనివల్ల మృతదేహాలు చిక్కుకుపోయి ఉంటాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే ఆందోళన నెలకొన్నదని నోటీసుల్లో పేర్కొంది. అధికారుల నిర్లక్ష్యంతో బాధితుల జీవించే హక్కు ఉల్లంఘించినట్లు మీడియా కథనాల్లోని అంశాలు సూచిస్తున్నాయని అభిప్రాయపడింది. యాజమాన్యం భద్రతా నియమాలు, చట్టపరమైన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తోందా? సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారా? లేదా? దీనిపై తనిఖీ చేయడానికి సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తూ సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ఎఫ్ఐఆర్ పరిస్థితి, క్షతగాత్రుల ఆరోగ్యం, చికిత్స, నష్ట పరిహారం పంపిణీ, గాయపడిన వారితో పాటు చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అందించిన ఇతర ఉపశమనం, పునరావాసం, బాధ్యులైన అధికారులపై తీసుకున్న చర్యలేమిటి? తదితర సమగ్ర వివరాలు నివేదికలో పొందుపరచాలని సూచించింది.

ఫుడ్ పాయిజన్ ఘటనల్లోనూ నోటీసులు

చిత్తూరు అపోలో హెల్త్ యూనివర్సిటీ, అనకాపల్లి జిల్లాలోని అనాథాశ్రమంలో కలుషిత ఆహారం ఘటనలపై మీడియాలో వచ్చిన వార్తలను జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఆ రెండు ఘటనలపై రెండు వారాల్లో సమగ్ర నివేదికలు సమర్పించాలని సీఎస్, డీజీపీలను ఆదేశించింది. చిత్తూరు అపోలో హెల్త్ యూనివర్సిటీలో 70 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యిందని, వారు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపింది. అలాగే, అనకాపల్లి జిల్లాలోని ఓ అనాథాశ్రమంలో ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు చిన్నారులు మృతి చెందారని, 37 మంది అనకాపల్లి, విశాఖపట్నంలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని పేర్కొంది. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా తీసుకున్న, ప్రతిపాదించిన చర్యలేమిటో నివేదికలో తెలపాలని ఆదేశించింది.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తదితరులు

'ఎసెన్షియా' మరువకముందే... పరవాడ ఫార్మాసిటీ 'సినర్జిన్'లో ప్రమాదం

- రసాయనాలు ఎగసిపడి నలుగురికి గాయాలు

పరవాడ (అనకాపల్లి జిల్లా), ఆగస్టు 23: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా విషాదకర సంఘటన వెంటాడుతుండగానే, అదే జిల్లాలో పరవాడ వద్దగల ఫార్మాసిటీలోని సినర్జిన్ యాక్టివ్ ఇన్‌గ్రేడియంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యూనిట్-3లో గురువారం అర్ధరాత్రి ప్రమాదం జరిగింది. రియాక్టర్ మ్యాన్‌హోల్ నుంచి రసాయనాలు ఎగసిపడడంతో అక్కడ పనిచేస్తున్న కెమిస్ట్, ముగ్గురు హెల్పర్లు తీవ్రంగా గాయపడ్డారు. పరిశ్రమ బి-బ్లాక్ మొదటి అంతస్థులో విజయనగరం జిల్లాకు చెందిన కెమిస్ట్ సూర్యనారాయణ పర్యవేక్షణలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన హెల్పర్లు రోయా అర్జి (23), లాల్‌సింగ్ (23), వయాబన్‌కోహా (23) పనిచేస్తున్నారు. 6కేఎల్ సామర్థ్యం గల రియాక్టర్‌లో లొనస్ట్రాన్(ఎల్ఓ) కెమికల్ వేసి చార్జ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రియాక్టర్ మ్యాన్‌హోల్ నుంచి ఒక్కసారిగా స్పార్క్ (స్థిర విద్యుత్) రావడంతో రసాయనాలు ఎగసి ఆ నలుగురిపై పడ్డాయి. దీంతో వారంతా తీవ్రంగా గాయపడ్డారు. సూర్యనారాయణ శరీరం 30శాతానికి పైగా కాలిపోయింది. యాజమాన్యం క్షతగాత్రులను విశాఖలో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించింది. వీరంతా నాలుగేళ్లుగా ఈ పరిశ్రమలో పనిచేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ దీపిక, ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సందర్శించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ఫార్మాసిటీలో తరచూ ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రమాదాల నివారణకు త్వరలో ఫార్మాసిటీలోని యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

వరుస ప్రమాదాలపై పవన్ ఆవేదన

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో ప్రమాదం జరిగి 16 మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటన మరువక ముందే సినర్జిన్ యాక్టివ్ ఇన్గ్రేడియంట్స్ సంస్థలో అర్ధరాత్రి వేళ సంబంధించిన ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారని తెలిసిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం జార్ఖండ్ నుంచి వచ్చిన కార్మికులు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉండడం విషాదకరమన్నారు. ప్రమాదకరమైన రసాయనాలతో ఉత్పత్తులను తయారుచేసే ఫార్మా కంపెనీల్లోనే ప్రమాదాలు తరచూ జరుగుతున్న నేపథ్యంలో యాజమాన్యాలు, అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బాధితులను ఆదుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును ఆదేశించామని, ఆయన ద్వారా వివరాలు ఎప్పటికప్పుడు అందుతూనే ఉన్నాయని తెలిపారు. బాధితులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షిస్తూ.. ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు.

పరామర్శకు వెళ్లి గొప్పలా?

- పనిలో పనిగా రాజకీయ విమర్శలు
- జగన్ వ్యవహార శైలిపై ఆక్షేపణ
- విస్తుపోయిన 'ఎసెన్షియా' బాధితులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి హోదాలో జగన్ ఘోరంగా విఫలమయ్యారు. ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా ప్రజలు చిత్తుగా ఓడించినా ఆయన వైఖరిలో మార్పురాలేదు. ఎసెన్షియా ఫార్మా కంపెనీ ప్రమాదంలో కుటుంబ సభ్యులను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన జగన్ శవరాజకీయాలు చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. సందర్భానికి భిన్నంగా లేనిపోని గొప్పలకు పోవడంతో పాటు రాజకీయ ప్రసంగం చేశారు. శుక్రవారం అనకాపల్లిలో బాధితుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన గురించి గొప్పగా చెప్పుకోవడంతో పాటు రాజకీయ విమర్శలు చేయడంతో అక్కడున్నవారంతా విస్తుపోయారు. బాధితులకు 15రోజుల్లో పరిహారం అందకుంటే తానే వచ్చి ధర్నా చేస్తానంటూ పదే పదే చెప్పారు. తానొచ్చి ధర్నా చేస్తానంటే చంద్రబాబు భయపడతారంటూ డప్పు కొట్టుకున్నారు. ఎల్జీ పాలిమర్స్ ఘటనను గుర్తుకు తెస్తూ తానప్పుడు రూ.కోటి పరిహారం ప్రకటించానంటూ ఘనంగా చెప్పుకొన్నారు. ఈ సందర్భంగా పక్కనే ఉన్న ఒక వైసీపీ మహిళా నేత చప్పట్లు కొట్టారు. వెనుక ఉన్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆమెను వారించాల్సి వచ్చింది. ఆప్తులను కోల్పోయి బాధలో ఉన్న బాధితుల ఎదుట గొప్పలు చెప్పుకోవడం అవసరమా? అన్న విమర్శలు వినపడ్డాయి. జగన్ తానొచ్చిన సందర్భాన్ని మరచి రాజకీయ విమర్శలు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలన్నీ ఆగిపోయాయన్నారు. వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కావడం లేదని, రైతుభరోసా దక్కడం లేదని, పంటల బీమా చెల్లించలేదని, ప్రీమియం కట్టలేదని, గోరుముద్ద పథకం అమలు కావడం లేదని.. కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరువయ్యాయని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని రాజకీయ ఉపన్యాసం చేశారు. ఇదెక్కడి శవరాజకీయమంటూ బాధిత కుటుంబాలు ఈసడించుకున్నాయి.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏదీ?

2020లో విశాఖలో ఎల్జీ పాలిమర్స్ ఘటనలో తొమ్మిది మంది చనిపోయారు. తెల్లవారుజామున సంఘటన జరగగా, విషవాయువులు వెలువడి 15,000 మంది ఊపిరి ఆడక, కళ్ల మంటలతో నరకయాతన అనుభవించారు. ఘటన జరిగిన రోజు నాటి సీఎం జగన్ క్షతగ్రాతులను పరామర్శించారు. బాధితుల కుటుంబాలతో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ప్రకటించారు. వెంటిలేటర్ మీద ఉన్నవారికి పది లక్షలు సాయం చేస్తామన్నారు. వెంకటాపురం తదితర గ్రామాలకు నిరంతరం వైద్య సేవలందించేందుకు వీలుగా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మిస్తానని నాడు జగన్ హామీఇచ్చారు. హెల్త్ కార్డులు జారీ చేస్తానని, జీవితాంతం ఉచిత వైద్య సేవలు అందిస్తానని ప్రకటించారు. తర్వాత ఎల్జీ పాలిమర్స్ నుంచి మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించారు. ఆ తర్వాత మరో ముగ్గురు చనిపోయినా ప్రమాద ఘటనతో సంబంధం లేదని చెప్పి పరిహారం చెల్లించలేదు. చనిపోయిన పశువులకు నష్టపరిహారం లేదు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం హామీని గాలికొదిలేశారు.

జగన్ తీరుపై విమర్శలు

ఎసెన్షియా ఘటన అనంతరం సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత తదితరులు క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను పరామర్శించారు. వైద్యసేవలు అందుతున్న తీరుపై సమీక్షించారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం అందించారు. ఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. స్థానిక వైసీపీ నేతలెవరూ సహాయ కార్యక్రమాల్లో పాల్గొనలేదు. వైసీపీ తరఫున బాధిత కుటుంబాలకు సహాయాన్ని ప్రకటించలేదు. అయినా జగన్, ఆయన రోత పత్రిక ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేశారు. ప్రమాదం జరిగిన 48 గంటల తర్వాత పరామర్శకు వెళ్లిన వైసీపీ అధ్యక్షుడు జగన్ అంతటితో పాటు పరిమితం కాకుండా రాజకీయం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ విభాగాల రాష్ట్రాధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ మహిళా అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడిగా ఎంవీఎస్ నాగిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా ఖాదీర్‌బాషా, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా గౌతంరెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షుడిగా మనోహర్ రెడ్డి, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలిగా వంగపండు ఉష, వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా బందెల కిరణ్‌రాజు, టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర రెడ్డి, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా చిన్నమ్మను నియమించారు.

న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జస్టిస్ నరేందర్



అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం 22న ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. ఇటీవల వరకు న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరించిన జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు పదవీ విరమణ చేయడంతో.. సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ నరేందర్‌ను ఆ పోస్టులో నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది.

ఇదొక అద్భుత అవకాశం

- అమరావతికి ఆర్థిక సాయమే కాదు.. సాంకేతిక మద్దతు కూడా అందిస్తాం
- 'ఆంధ్రజ్యోతి'తో ప్రపంచబ్యాంకు ప్రతినిధి సుదీప్ మజుందార్

న్యూఢిల్లీ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసంతో దారుణంగా దెబ్బతిన్న అమరావతి రాజధానికి ప్రపంచ బ్యాంకు జవసత్వాలు అందించనుంది. రాజధానిగా అమరావతి అభివృద్ధి ఒక అద్భుత అవకాశమని ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ప్రాంతం లీడ్ విదేశీ వ్యవహారాల సలహాదారు సుదీప్ మజుందార్ శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రాజధాని నిర్మాణానికి ఆర్థిక సహాయం మాత్రమే కాదు, సాంకేతిక మద్దతు కూడా అందిస్తామని స్పష్టం చేశారు. అందరి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, ఎలాంటి వాతావరణానికైనా తట్టుకుని, ఆర్థికంగా సుస్థిరం కాగలిగిన ఒక గ్రీన్ ఫీల్డ్ నగరాన్ని అభివృద్ధి చేయడం అవసరమని పేర్కొన్నారు. దీనివల్ల ఏపీలోనే కాకుండా.. మొత్తం భారత్‌లోనే ఆర్థిక ప్రగతి పుంజుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. భారత ప్రభుత్వ అభ్యర్థన మేరకు ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు బృందం అమరావతిని సందర్శించి, కొత్త రాజధాని నగరాన్ని అభివృద్ధి చేసేందుకు సాంకేతిక, ఆర్థిక మద్దతు అందించే అవకాశాలు అధ్యయనం చేస్తోందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు సహకారంతో ప్రపంచంలోని ఇతర నగరాల ప్రాజెక్టుల అనుభవాన్ని, నైపుణ్యాన్ని అమరావతి నిర్మాణంలో వినియోగించుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోందన్నారు. దీనివల్ల ఒక అద్భుత రాజధానిని నిర్మించాలన్న ఆ ప్రభుత్వ బృహత్తర ఆకాంక్షకు సహకరిస్తున్నట్టు తాము భావిస్తున్నామని తెలిపారు. తమ బృందం అమరావతిలో జరిపిన పర్యటన ప్రాథమిక అంచనా కోసమేనని, ఇక్కడ మరిన్ని సార్లు పర్యటించి ఏపీ ప్రభుత్వంతో చర్చలు పూర్తిచేసిన అనంతరం తమ మద్దతుకు సంబంధించిన అంశాలను ఖరారు చేస్తామని మజుందార్ పేర్కొన్నారు. ఇతర భాగస్వాములు, స్థానిక ప్రజలతో కూడా తాము చర్చిస్తామని చెప్పారు.

సందడిగా గ్రామసభలు

13,326 పంచాయతీల్లో ఒకేరోజు.. అట్టహాసంగా నిర్వహించిన కూటమి ప్రభుత్వం


పార్వతీపురం మండలం వెంకంపేట గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్


శ్రీకాకుళం మండలం సానివాడ గ్రామసభలో మాట్లాడుతున్న అచ్చెన్న

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఒక్కరోజే 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఈ గ్రామసభల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టబోయే పనులకు సంబంధించి జాబితాతోపాటు స్వర్ణ గ్రామ పంచాయతీకి సంబంధించి పలు పనులకు ఆమోదం లభించింది. సర్పంచులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు ఈ సభల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కోనసీమ జిల్లా వానపల్లిలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొనగా, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కడప జిల్లా రైల్వేకోడూరు మండలంలోని మైసూరావారిపల్లెలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. ఆయనతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ పాల్గొన్నారు. మంత్రులు ఆయా జిల్లాల్లో గ్రామసభల్లో పాల్గొని సర్పంచులలో నూతనోత్తేజాన్ని కలిగించారు. ఎమ్మెల్యేలు కూడా విధిగా ఏదో ఒక గ్రామసభలో పాల్గొని గ్రామసభల ప్రాధాన్యాన్ని తెలియజేశారు. ప్రతి పంచాయతీకి ఒక ప్రత్యేకాధికారిని నియమించి గ్రామ సభ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లో ఏయే పనులు అవసరమో? ముందుగానే అధికారులు గుర్తించి గ్రామసభలో ప్రవేశపెట్టి ఆమోదించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామసభల ద్వారా ఉపాధి పనులకు ఆమోదం లభించడంతో ఉపాధి హామీ సిబ్బందికి ఊరట లభించింది. సర్పంచులు ఇకపై గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇది మార్గదర్శకంగా నిలిచిందంటున్నారు. చంద్రబాబు వానపల్లిలో, పవన్‌కల్యాణ్ మైసూరావారిపల్లెలో చేసిన ప్రసంగాలు రాష్ట్రవ్యాప్తంగా సర్పంచుల్లో ఆత్మస్థైర్యం నింపాయి. గ్రామ పంచాయతీలు ఒక వైభవ స్థితికి వస్తాయని, కేరళ, తమిళనాడుల్లో మాదిరిగా గ్రామ పంచాయతీల బలోపేతానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని నమ్ముతున్నారు. దీంతో గ్రామాలకు దక్కాల్సిన నిధులు, విధులు సమకూరతాయని, సాక్షాత్తు ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధిశాఖను నిర్వహించడంతో ఆ శాఖకు అత్యంత ప్రాధాన్యమేర్పడిందని పేర్కొంటున్నారు. చాలా జిల్లాల్లో 75 శాతం వరకు వైసీపీ సర్పంచులు ఉన్నప్పటికీ, పార్టీలకతీతంగా వారు పాల్గొని గ్రామ సభలను నిర్వహించారు.

ఏ మంత్రి ఎక్కడ? ఏం చెప్పారంటే..?

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళంలోని సానివాడ గ్రామసభలో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి పల్లె ప్రాంతాలే పట్టుకొమ్మలని, ప్రతి పల్లెను స్వర్ణ గ్రామంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.
- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గుంటూరు జిల్లా కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామసభలో మాట్లాడుతూ ప్రజలు కోరుకున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం చేసి చూపుతుందన్నారు.
- గృహనిర్మాణ- సమాచారశాఖల మంత్రి కొలుసు పార్థసారథి ఏలూరు జిల్లా ముసునూరు మండలం రమణక్కపేట గ్రామసభలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో మంత్రి విచారణకు ఆదేశించారు.
- రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ బాపట్ల జిల్లా నగరం మండలం ధూళిపూడి గ్రామసభలో మాట్లాడుతూ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసి, గ్రామాలను అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తామని చెప్పారు.
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామసభలో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి గ్రామసభలు వారధిగా ఉపయోగపడతాయన్నారు.
- రోడ్లు-భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం టంగుటూరు గ్రామసభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామపంచాయతీల రూపురేఖలు మారబోతున్నాయని చెప్పారు.
- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పార్వతీపురం మన్యం జిల్లా వెంకంపేట గ్రామసభలో.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే పేదల కోసం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తోందని తెలిపారు.
- గిరిజన-మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విజయనగరం జిల్లా మెంటాడ మండలం కుంటినవలస, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కూర్మరాజు పేట గ్రామసభల్లో పాల్గొన్నారు. పంచాయతీల అభివృద్ధి నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రూ.4,500 కోట్లు విడుదల చేస్తుందని, ఆ నిధుల్లో రూ.990 కోట్లను నేరుగా సర్పంచుల ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు.
- గనులు-ఎక్సైజ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్ర కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం బోగిరెడ్డిపల్లి, చిన్నాపురం, తాళ్లపాలెం గ్రామసభల్లో మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు.
- అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం ఉపమాకలో హోంమంత్రి వంగలపూడి అనిత, మాకవరపాలెం గ్రామసభకు స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపట్టనున్న పనులు, 2025-26 నుంచి వరుసగా నాలుగేళ్లకు ప్రణాళికలపై సభల్లో చర్చించారు. స్వర్ణగ్రామాలుగా రూపొందించే అంశాలపై సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చర్చించి, తీర్మానాలు తీసుకున్నారు.

వాగ్వాదాలు.. ఘర్షణలు..: శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం తొగరాం పంచాయతీలో నిర్వహించే గ్రామ సభకు తనకు సమాచారం ఇవ్వలేదని... గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ తమ్మినేని వాణి (మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భార్య) నిరసన వ్యక్తం చేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం వన్నెపూడి సభలో సర్పంచ్, జనసేన వర్గీయులు తన్నుకున్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం సర్పవరం గ్రామసభలో జనసేన ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే పంతం నానాజీ ఫొటోలు లేకపోవడంతో నేతలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మాది 'భవిత'

2014-19 మధ్య మా హయాంలో స్వర్ణయుగాన్ని చూశారు. 2019-24 మధ్య చీకటి రాజ్యాన్ని చవిచూశారు. నరేగాతో సహా ఉపాధి హామీ పనుల సొమ్ములు దుర్వినియోగమయ్యాయి. మా ప్రభుత్వం ఎప్పుడూ తాగునీటికి, సిమెంటు రోడ్లకే ప్రాధాన్యం ఇస్తుంది. ఎమ్మెల్యే ఎంత ముఖ్యమో, గ్రామానికి సర్పంచ్ కూడా అంతే ముఖ్యం.

వారిది 'భూతం'

ఎన్నికల్లో కూటమి పార్టీలకు 57 శాతం మంది ఓట్లు వేశారు. 93 శాతం సీట్లు కట్టబెట్టారు. రాష్ట్రానికి పట్టిన శనిని పారదోలారు. ఇప్పుడు వైసీపీ భూతం తయారై వేలాడుతోంది. దాన్ని భూస్థాపితం చేయాలి. దీనికి ప్రజలంతా సంఘటితం కావాలి.

- సీఎం చంద్రబాబు

పల్లెలు పచ్చగా..!

(మొదటి పేజీ తరువాయి)

వాటిని తీర్చడమే లక్ష్యమని.. కాంట్రాక్టర్ల అవసరాలు తీర్చేందుకు కాదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట పరిధిలోని స్వర్ణవానపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేగా నిధులతో రూ.4,500 కోట్ల అంచనా వ్యయంతో 87 రకాల పనులకు గ్రామసభల ద్వారానే ఆమోదం పొందుతున్నామని చెప్పారు. ఉపాధి పనుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల కుటుంబాలకు 9 కోట్ల పనిదినాలు కల్పిస్తున్నామని, తద్వారా అందరికీ ఉపాధి లభిస్తుందన్నారు. "ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో వైసీపీ ఏంచేసిందో చూశారు. పోలింగ్ సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారు. అయినా ప్రజలు కూటమి పార్టీలకే అండగా నిలిచారు. మాకు 93 శాతం సీట్లు ఇచ్చారు. 57 శాతం ఓట్లు వేశారు. అయినా.. వైసీపీ భూతం వేలాడుతోంది. దానిని భూస్థాపితం చేయాలి. అప్పుడే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది" అని చంద్రబాబు తేల్చి చెప్పారు. కూటమి ప్రభుత్వంలో వైసీపీ నేతలనుగానీ, మాజీ ముఖ్యమంత్రిని గానీ ఏనాడు తాము అడ్డుకోలేదన్నారు.

ఏనాడైనా గ్రామ సభలు పెట్టారా?

"కొందరు సైకోలు ఐదేళ్ల పాలనను అధ్వానంగా కొనసాగించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడైనా ఇలా గ్రామ సభలు పెట్టారా? ముఖ్యమంత్రిగాని, డిప్యూటీ సీఎంగానీ మీ ముందుకు వచ్చి మాట్లాడారా? ఒకవేళ వారు వస్తే పచ్చదనం కనిపించకూడదు. చెట్లన్నీ నరికేయాలి. పరదాలు కట్టాలి. వానపల్లిలోని పళ్లాలమ్మ గుడి వద్ద కూడా ఇదే స్థాయిలో విధ్వంసం చేశారు" అని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ఆనాటి ప్రభుత్వంలో సభలకు వచ్చే మహిళలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని తెలిపారు. "మాది సింపుల్ గవర్నెన్స్.. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నమెంట్" అన్నారు. "నెత్తిమీద రూపాయిపెట్టి వేలం వేస్తే ఎవరూ కూడా ఆ వ్యక్తిని కొనరు" అని మాజీ సీఎం జగన్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు మొత్తంగా గంటా 20 నిమిషాలపాటు అనర్గళంగా ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే..

సర్పంచ్‌లను డమ్మీ చేశారు

రాష్ట్రంలో 2014-19 మధ్య మా హయాంలో 27,444 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశాం. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో 6,643 కిలోమీటర్ల సీసీ రోడ్లే నిర్మించింది. మా హయాంలో గ్రామాల్లో ఉత్పత్తి అయ్యే చెత్త ద్వారా కేంద్రాలు పెట్టి ఆదాయం సృష్టిస్తే.. వైసీపీ హయాంలో ఆ చెత్తను రోడ్లపై వేసి.. మరుగుదొడ్ల మాదిరిగా రోడ్లను మార్చేశారు. 9,590 కేంద్రాలను ఏర్పాటు చేసి రంగులు వేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మా హయాంలో 25.22 లక్షల ఎల్ఈడీ బల్బులు వెలిగిస్తే.. వైసీపీ హయాంలో 40 శాతం బల్బులు వెలగకుండా చేశారు. సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా చేసిన ఘనత వైసీపీదే. వారి అధికారాలను హరించారు. గ్రామాలకు విడుదలయ్యే నిధులను మళ్లించి ఇష్టానుసారం స్వాహా చేశారు. మా ప్రభుత్వం వచ్చిన కొన్ని రోజుల్లోనే రూ.2100 కోట్లను గ్రామసీమల అభివృద్ధికి విడుదల చేశాం. 3.67 లక్షల హార్టీకల్చర్ పనులు చేశాం. సోషల్ ఆడిట్‌లు చేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా 32,693 బోర్లు ఏర్పాటు చేశాం. వచ్చే ఐదేళ్లలో ప్రతి గ్రామంలోను సీసీ రోడ్లతోపాటు మురుగునీటి కాల్వలను ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం. ఇవి కాకుండా పశువులు, మేకలు, మూగజీవాల కోసం షెడ్ల నిర్మాణం చేపడతాం. ఉపాధి కూలీలకు ఆదాయం పెరిగేలా దినసరి వేతనాన్ని పెంచి ఆదుకుంటాం.గ్రామాల్లో ఇంటిస్థలం లేనివారికి 3 సెంట్లు చొప్పున భూమి ఇస్తాం. వానపల్లిలో 610 మందికి ఇళ్లు లేవని చెప్పారు. వారందరికీ స్థలాలు ఇస్తాం. ప్రజల ఆరోగ్యం కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే అన్ని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది. పిల్లల చదువు కోసం ఏ సౌకర్యాలు కావాలో అన్నీ కల్పిస్తాం. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారులన్నింటినీ అధ్వాన స్థితికి తీసుకువచ్చారు. దీంతో ప్రజలు నేటికీ పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిన ఘనత వైసీపీదే. కూటమి తరపున గెలిచిన 21 మంది ఎంపీలు కేంద్రంలో కీలకమయ్యారు. వారి కృషి ద్వారా రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వ రాజముద్రతో మళ్లీ పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేసే బాధ్యత తీసుకున్నాం.

ప్రజలు ఇస్తేనే 'హోదా'

ల్యాండ్ టైట్లింగ్ యాక్టు అమలు చేయాలనే వైసీపీ ప్రభుత్వ వ్యూహం చూసి నాకే భయమేసింది. ఆ చట్టంతో నా భూమి నాకే దక్కకుండా పోతుంది. అందుకే దాన్ని రద్దు చేశాం. అలాంటి భయంకర చట్టాలు తెచ్చారు. ప్రజలు ఇస్తే వచ్చేది హోదా(వైసీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదాను ప్రస్తావిస్తూ).. ప్రజలు గెలిపిస్తే వచ్చేది పదవి. బెదిరిస్తేనో, నేరాలు చేస్తేనో పదవులు, హోదాలురావు అనే విషయాన్ని గుర్తెరగాలి. ప్రతి నెల 1న 'పేదల సేవలో ప్రభుత్వాధికారులు' అనే లక్ష్యంతో పింఛన్ల పంపిణీ చేపట్టి దిగ్విజయంగా పూర్తిచేశాం. సంపద సృష్టిస్తాం. ఆ సంపదను పేదవారికి పంపిణీ చేస్తూనే ఉంటాం. ఉద్యోగులకు కూడా మొదటి తేదీనే జీతాలు ఇచ్చాం. ఉచిత ఇసుక విధానాన్ని మరింత సులభతరం చేస్తాం. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలు తెస్తున్నాం. స్వర్ణ వానపల్లి గ్రామంలో రూ.10 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేసి గ్రామసభ ఆమోదం పొందారు. వాటన్నింటినీ పూర్తిచేసే బాధ్యత మేం తీసుకుంటాం.

వైసీపీ దోపిడీతో ఢిల్లీలోనూ అవమానం

ఇక్కడే పోలవరం ఉంది. జగన్ హయాంలో డయాఫ్రం వాల్‌ను ధ్వంసం చేశారు. 2021కి పూర్తి కావాల్సిన ప్రాజెక్టు పడకేసింది. మొన్నే ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రిని కలిసి ఒప్పించాం. ఈ దుర్మార్గుడు(జగన్) చేసిన పనితో మళ్లీ డయాఫ్రం వాల్ కట్టాలి. గతంలో రూ.440 కోట్లతో పూర్తిచేసిన వాల్ పోయింది. ఇప్పుడు రూ.990 కోట్ల భారం పడుతోంది. వైసీపీ హయాంలో కేంద్రం వివిధ పథకాలకు వేల కోట్లు ఇచ్చింది. కానీ, వాటిని మళ్లించి, దుర్వినియోగం చేసి.. లెక్కా, పత్రం లేకుండా చేశారు. మొన్న ఢిల్లీకి వెళ్తే మీ రాష్ట్రానికి ఇచ్చిన డబ్బులకు లెక్కలు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఇది ఎంత అవమానం!!

పంచాయతీల బలోపేతమే లక్ష్యం

- గత ఐదేళ్లలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం
- ఏటా నాలుగు గ్రామ సభలు నిర్వహించాలి
- మైసూరివారిపల్లె గ్రామసభలో పవన్ కల్యాణ్


అన్నమయ్య జిల్లా మైసూరువారిపల్లిలో గ్రామ సభను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

రాయచోటి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): "నాకు ప్రజాదరణ ఉండవచ్చు. అయితే చంద్రబాబుకు అనుభవం ఉంది. రాష్ట్రానికి చంద్రబాబు అనుభవం కావాలి. గత ప్రభుత్వంలో ఎన్నో అప్పులు చేశారు. ఇప్పుడు ఎన్ని సమీక్షలు చేసినా.. డబ్బు లేదు. అయితే ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ తెలిసిన చంద్రబాబు.. ఒకటో తేదీకి లక్షలాది మందికి పెన్షన్లు ఇచ్చారు. సమాజం గురించి బాగా ఆలోచించే వాళ్లు.. సమాజానికి మేలు చేసే వాళ్లు ఉంటే.. వాళ్ల దగ్గర పనిచేయడానికి.. వాళ్లతో కలిసి నడవడానికి నాకు ఏ ఇబ్బందీ లేదు. నేర్చుకోవడానికి చంద్రబాబుతో కలసి పనిచేయడం నాకు నామోషీ కాదు.. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. అటువంటి వ్యవస్థను బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. పల్లెలు పచ్చగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుంది. ఆడబిడ్డల చదువు దేశానికే మేలు" అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం మైసూరివారిపల్లెలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన ప్రసంగించారు. స్థానిక సర్పంచ్ సంయుక్త అధ్యక్షతన జరిగిన స్వర్ణ పంచాయతీ గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో కోటి మందికి పైగా ప్రజలు పాల్గొన్నారని చెప్పారు. రూ.4,500 కోట్ల విలువైన పనులకు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి కోసం సర్పంచులు, పంచాయతీ ప్రజలు కలసి సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సర్పంచ్‌కు విశిష్టమైన అధికారాలు ఉన్నాయని, వాటిని సరైన రీతిలో ఉపయోగించుకుంటే ప్రతి గ్రామం మహారాష్ట్రలోని రాలేగావ్‌సిద్ధిగా మారుతుందని పవన్ పేర్కొన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. పంచాయతీల నుంచి బలమైన నాయకులు తయారవుతారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.41 వేల కోట్ల పనులు చేశారు. అయితే వీటికి లెక్కాపత్రం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కేవలం రూ.15 వేల కోట్ల పనులు మాత్రమే కనిపిస్తున్నాయి. మిగిలిన నిధులు ఏమయ్యాయో, ఎలా ఖర్చు చేశారో తెలీడం లేదు. గ్రామసభలు నిర్వహించకుండా ఇష్టానుసారం పనులు చేయడం వల్ల.. చాలాచోట్ల సర్పంచులకు కూడా ఆ వివరాలు తెలియవు. చేసిన పనికి సంబంధించి కాంట్రాక్టరు పేరుతో సహా అన్ని వివరాలతో సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. పల్లెలు సుసంపన్నం అయితే రాష్ట్ర అప్పులను కూడా సులభంగా తీర్చే అవకాశం ఉంటుంది.

చదువుల నేల రాయలసీమ

రాయలసీమ విద్యల నేల. అత్యధిక గ్రంథాలయాలున్న నేల. ఇక్కడి యువతకు ఉన్న శక్తి అపూర్వం. కర్నూలులో సుగాలి ప్రీతికి అన్యాయం జరిగిందని నేను పోరాటం చేస్తే నాతో లక్షలాదిగా ఇక్కడి యువత కదిలారు. అన్యాయంపై పోరాడే నైజం సీమ యువతకు సొంతం. వారికి స్థానికంగా ఉద్యోగ అవకాశాలు పెరగాలి. ఉద్యాన పంటలకు సంబంధించిన పరిశ్రమలు రావాలి. అలాగే మంగంపేట బెరైటీస్ గనుల్లో స్థానిక యువత తగిన నైపుణ్యాలను సాధించేందుకు స్కిల్ వర్సిటీ ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్తా. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో కనిపించిన ప్రతి ప్రభుత్వ భూమినీ దోచుకున్నారు. మైసూరువారిపల్లె గ్రామానికి కేవలం 8 సెంట్ల ప్రభుత్వ భూమి మాత్రమే ఉందని తెలిసి ఆశ్చర్యపోయా. కనీసం భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా భూమి లేకుండా గ్రామానికి అవసరమయ్యే పనులు ఎలా చేసుకుంటాం? దాతలు ముందుకు వచ్చి స్థలాలు కేటాయిస్తే వారికి ప్రభుత్వం, పంచాయతీ తరపున తగిన గౌరవం ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో రెవెన్యూ సభలు నిర్వహించి భూసమస్యలను పరిష్కరిస్తాం. అవసరమైతే ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ప్రయత్నం చేసి, ప్రభుత్వ భూములు కబ్జా చేసేవారిపై గూండా యాక్టు తీసుకొచ్చేలా సీఎం, కేబినెట్ దృష్టికి తీసుకెళ్తా. ప్రతి ఏటా నాలుగు గ్రామ సభలు నిర్వహించాలి. దీని వల్ల గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు ఏవిటో స్థానికులు అందరికీ తెలుస్తాయి" అని పవన్ పేర్కొన్నారు. కాగా.. పంచాయతీలో అత్యంత తక్కువ ప్రభుత్వ భూమి ఉందని తెలుసుకుని, తన సొంత భూమి 30 సెంట్లు ఇవ్వడానికి ముందుకు వచ్చిన మైసూరివారిపల్లెకు చెందిన కారుమంచి నారాయణను పవన్ అభినందించారు. ఈ గ్రామసభలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, ఆరణి శ్రీనివాసులు, పంచాయతీరాజ్ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గుంటూరులో జరిగిన గ్రామసభలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

'అన్నమయ్య' బాధితులను ఆదుకుంటాం

మైసూరివారిపల్లెలో గ్రామసభ అనంతరం పవన్ రాజంపేట నియోజకవర్గం పులపత్తూరు వెళ్లి అన్నమయ్య ప్రాజెక్టు బాధితులతో సమావేశమయ్యారు. ప్రాజెక్టు కొట్టుకుపోయినప్పుడు జరిగిన నష్టం తాలుకు ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. పులపత్తూరు వీధుల్లో తిరిగి.. బాధితుల అవస్థలు కళ్లారా చూశారు. నిర్మాణం పూర్తికాని ఇళ్లను పరిశీలించారు. బాధితులు ఇంకా ప్లాస్టిక్ కవర్లు కప్పిన గుడిసెల్లో ఉండడాన్ని గమనించారు. హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసి, బాధితులందరికీ న్యాయం జరిగేలా చూస్తానని పవన్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి వెళ్లారు.

గ్రామ స్వరాజ్యానికి బాటలు: నాగబాబు

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న ఆధునిక జీవన శైలిలో నిర్లక్ష్యానికి గురవుతున్న గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం, గ్రామ స్వరాజ్యం కోసం బాటలు వేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా అడుగులు వేద్దామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

బడులు తెరిచే నాటికే పుస్తకాలు

- ఇకపై ప్రైవేటు ఆశ్రమాలపైనా పర్యవేక్షణ
- పరీక్షల అనంతరం సీబీఎస్ఈపై నిర్ణయం
- పాఠశాల విద్యపై సమీక్షలో మంత్రి లోకేశ్


పాఠశాల విద్యపై సమీక్ష సమావేశంలో మంత్రి లోకేశ్, అధికారులు


అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికే పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉండాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖపై శుక్రవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనకాపల్లి అనాథ శరణాలయంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతిచెందిన ఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఏజెన్సీలోని పాఠశాలలతోపాటు ప్రైవేటు ఆశ్రమాలపై కూడా పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఇంటర్నల్ సహా ఏ ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీబీఎస్ఈ అమలౌతున్న వెయ్యి పాఠశాలల్లో అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతున్నాయని, ఫలితాలు వచ్చాక దానిపై విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. టీచర్ల సర్దుబాటు ప్రక్రియ మండల స్థాయిలో దాదాపుగా పూర్తికావొచ్చిందని, ఆ తర్వాత డివిజన్ స్థాయిలో చేస్తామన్నారు. సర్దుబాటులో ఉపాధ్యాయ సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. ఈ ఏడాది గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామన్నారు. నవంబరులో మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశం నిర్వహించాలన్నారు. అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో సైన్స్ ఫేర్, స్పోర్ట్స్ మీట్స్ నిర్వహించాలని ఆదేశించారు. బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన యాప్‌ల భారాన్ని టీచర్లకు తప్పించామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఈ బాధ్యతలు అప్పగించామని, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు కూడా ఇందులో భాగస్వామ్యం అవుతాయని తెలిపారు. ఇంటర్‌లో పదోన్నతులు, కోర్టు కేసులపై చర్చించారు. వీలైనంత త్వరగా కేసుల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. సమావేశంలో ఉన్నతాధికారులు కోన శశిధర్, వి.విజయ రామరాజు, కృతికా శుక్లా పాల్గొన్నారు.

నైపుణ్య గణన మొక్కుబడిగా వద్దు

- యువతకు ఉపాధి కల్పనే అంతిమ లక్ష్యం: లోకేశ్

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నైపుణ్య గణన మొక్కుబడిగా ఉండకూడదని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. యువత విద్య, ఉపాధి, నైపుణ్యాలను క్రోడీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోందని తెలిపారు. శుక్రవారం నైపుణ్యాభివృద్ధిపై సమీక్షించిన ఆయన మాట్లాడుతూ యువత నైపుణ్య వివరాలను కంపెనీలు నేరుగా చూసుకునే విధానం తెస్తామన్నారు. దానివల్ల ఆయా కంపెనీలకు వారికి అవసరమైన నైపుణ్యాలున్న యువతను ఎంపిక చేసుకుని ఉద్యోగాలిస్తాయన్నారు. నైపుణ్య గణనలో ప్రజలను అపోహలకు గురిచేసే అనవసరమైన ప్రశ్నలు అడగొద్దని అధికారులకు స్పష్టం చేశారు. నైపుణ్య గణన అంతిమ లక్ష్యం యువత ఉపాధి కల్పన మాత్రమేనని, ఆ దిశగానే గణన ఉండాలన్నారు. ఓవైపు యువత ఉద్యోగాలు రావట్లేదంటున్నారని, మరోవైపు కంపెనీలు నైపుణ్యాలున్న యువత దొరకట్లేదని అంటున్నాయని వ్యాఖ్యానించారు. ఈ రెండు సమస్యలను పరిష్కరించేలా నైపుణ్య గణన జరుగుతుందన్నారు. పరిశ్రమల్లో అవసరమైన నైపుణ్య శిక్షణను అందించేందుకు చర్యలు ప్రారంభించాలన్నారు. పూర్తిస్థాయి ప్రణాళిక సిద్ధమైన తర్వాత మంగళగిరిలో పైలెట్ ప్రాజెక్టుగా గణన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. న్యాయపరమైన చిక్కులు తొలగించి యూనివర్సిటీల్లో ఖాళీ అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. యూనివర్సిటీల ర్యాంకుల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో అధికారులు గౌరబ్‌గౌర్, జి.గణేష్‌కుమార్, కె.దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.













వారెవ్వా.. వాల్ పెయింట్స్

కళాత్మక చిత్రాలతో కళకళలాడుతున్న సబ్‌వేలు

ప్రకాశం బ్యారేజీ సమీపంలోని కనకదుర్గా ఫ్లైవోవర్ సబ్‌వేలలో గోడలపై కళాత్మకంగా వేసిన పెయింట్స్ ప్రజలతో వారెవ్వా అనిపిస్తున్నాయి. వాల్స్‌పై వేసిన పెయింట్లు సబ్‌వేలను మరింత సుందరంగా మార్చాయి. కళాత్మక చిత్రాలతో కళకళలాడుతూ సబ్‌వేలు కమనీయంగా దర్శనమిస్తున్నాయి. నగరవాసులు, వాహనదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. - విజయవాడ



ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ చూపిన ఉద్యోగులను అభినందిస్తున్న కె.ఆనంద్

85 శాతం ఫిర్యాదులకు పరిష్కారం

● రైల్వే సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి కె.ఆనంద్

వన్‌టౌన్, ఆగస్టు 23: విజయవాడ రైల్వే డివిజన్‌లో శాఖాపరమైన ఫిర్యాదులను 85 శాతం పరిష్కరించామని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కట్టా ఆనంద్ తెలిపారు. ఇప్పటి వరకు 2,000 ఫిర్యాదులను స్వీకరించగా, వాటిలో 1,700 పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన అభిలాష విభాగంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అభిలాషలో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ రోజా సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. పీఎంజీఆర్ఎస్‌లో మొబైల్ ఆధారిత ఫిర్యాదులను స్వీకరిస్తారని, స్నేహం హస్తం అవుట్ రీచ్ క్యాంపుల్లో ఉద్యోగులతో మమేకమయ్యేందుకు క్యాంప్‌లు నిర్వహిస్తారని తెలిపారు. ఫిర్యాదులను రికార్డు చేశామని, వాటి ప్రాధాన్యాల దృష్ట్యా పరిష్కారానికి 7 రోజులు, 14 రోజులు, 28 రోజులు గడువు పెట్టామని ఆయన తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారంలో చొరవ చూపిన ఉద్యోగులను అభినందించారు. పర్సనల్ డిపార్టుమెంట్ సిబ్బందిని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, ఏడీఆర్ఎం అడ్మిన్లు అభినందించారు.

వందే భారత్ రైలులో తనిఖీలు

రైల్వే స్టేషన్, ఆగస్టు 23: సికింద్రాబాద్ -విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి సామర్లకోట వరకు విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు శుక్రవా రం ప్రయాణించి విస్తృత తనిఖీలు చేశారు. కేటరింగ్ సేవలను, ఆహార పదార్థాల నాణ్యత, పరిమాణాన్ని పరిశీలించారు. ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకు న్నారు. సామర్లకోట స్టేషన్‌లో ఆయన తనిఖీలు చేశారు. వివిధ విభాగా లను పరిశీలించారు. రైలు కార్యకలాపాల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యమి చ్చామని తెలిపారు. ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తు న్నామని తెలిపారు. భువనేశ్వర్ - ఎస్ఎంబీ బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌లో పాంట్రీ కార్‌ను రాంబాబు తనిఖీ చేశారు. భద్రత, పరిశుభ్రత, ప్రోటోకాల్ ను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు.



వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేస్తున్న అధికారులు

జాగ్రత్తలు తీసుకున్నా ప్రయోగాలు విఫలం కావొచ్చు

● విద్యార్థులతో ఇస్రో సీనియర్ సైంటిస్టు డాక్టర్ రేమిళ్ల మూర్తి

విద్యాధరపురం, ఆగస్టు 23: చంద్రయాన్ విజయం వెనుక ఎంతో మంది సిబ్బంది, శాస్త్రవేత్తల కృషి ఉందని, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఒక్కోసారి సాంకేతికంగా ప్రయోగాలు విఫలం కావొచ్చని ఇస్రో సీనియర్ సైంటిస్టు, గగన్‌యాన్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ రేమిళ్ల మూర్తి తెలిపారు. శుక్రవారం అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులతో బెంగళూరు నుంచి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులతో మూర్తి మాట్లాడారు. గగన్‌యాన్ ప్రాజెక్టులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు బానిస కాకూడదని సూచించారు. విద్యార్థులు ఆలోచించగలిగితే ఎన్నో నూతన సాంకేతికతలను ఆవిష్కరించవచ్చన్నారు. గంటన్నర సేపు ఆయన విద్యార్థులతో మాట్లాడారు. పలు సందేహాలకు సమాధానాలిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాతంగి కోటయ్య పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ విజేతలుగా స్టెల్లా ఏ, సీబీఎన్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 23: నగరంలోని మారిస్ స్టెల్లా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న మేరీ మెమోరియల్ సిటీ లెవెల్ బాస్కెట్‌బాల్ కళాశాల స్థాయి పోటీల్లో బాలికల విభాగంలో మారిస్ స్టెల్లా ఏ-టీమ్, బాలుర విభాగంలో విజయవాడ సీబీఎన్ కళాశాల టీమ్‌లు విజేతలుగా నిలిచాయి. బాలికల విభాగంలో రెండోస్థానంలో వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ టీమ్, మూడో స్థానంలో మారిస్ స్టెల్లా బీ-టీమ్, బాలుర విభాగంలో రెండో స్థానంలో కేబీఎన్ కళాశాల, మూడో స్థానంలో ఆగిరిపల్లి హీల్ ప్యారడైజ్ కళాశాల బాలుర టీమ్‌లు నిలిచాయి. విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. బహుమతుల ప్రధానోత్సవంలో ఏపీబీఏ జనరల్ సెక్రటరీ జి.చక్రవర్తి, ఎన్టీఆర్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు. జి.సుభాష్‌చంద్రబోస్, ఉపాధ్యక్షుడు జాన్సన్, కార్పొరేట్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ప్రేమ్‌కుమార్, జేవియర్ బోర్డు ఇండియా మాజీ డైరెక్టర్ ఎస్‌జే ధనపాల్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కులరేఖ, పీడీలు రాజా, సునీత పాల్గొన్నారు.



మేరీ మెమోరియల్ బాస్కెట్‌బాల్ విజేత మారిస్ స్టెలా ఏ టీమ్

స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటాం

● తొలిదశలో 56 లక్షల ఇళ్లలో బిగించడానికి రంగం సిద్ధం

● టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పడం సబబేనా?: సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు

గుణదల, ఆగస్టు 23: "మోదీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసీపీ ప్రభుత్వం ప్రతి ఇంటికి, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఒప్పందం చేసుకుంది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అంగీకరించబోమన్న టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాట తప్పింది. స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయకపోగా 56 లక్షల గృహాలకు మొదటి దశలో మీటర్లు బిగించడానికి రంగం సిద్ధమైంది. ఇది ఎంతవరకు సబబు." అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రశ్నించారు. రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు నగరంలోని విద్యుత్ సౌధలోని గోడౌన్‌లోకి నాలుగు కంటెయినర్లలో శుక్రవారం స్మార్ట్‌మీటర్లు వచ్చాయని తెలుసుకున్న బాబూరావు సీపీఎం నాయకులతో కలిసి విద్యుత్‌సౌధ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నాయకులు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్లు వేశారన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో భారీ అవినీతి జరిగిందన్నారు. అదానీ, వైసీపీ నేతల బినామీ సంస్థ షిరిడిసాయి కంపెనీలకు స్మార్ట్ మీటర్ల కాంట్రాక్టు కట్టబెట్టారన్నారు. అదానీ సంస్థ సాంకేతిక నిపుణులు, సిబ్బంది విద్యుత్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారన్నారు.



విద్యుత్ సౌధ వద్ద గేటు వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

విద్యుత్‌సౌధలోని గోడౌన్‌లో రెండంతస్థులు ఖాళీ చేసి అదానీ కంపెనీకి అప్పగించారన్నారు. ప్రీ పెయిడ్ స్మార్ట్‌మీటర్ల వలన ముందుగానే బిల్లు చెల్లించాల్సి ఉంటుందని, ప్రతి మీటరుకు రూ.13వేల నుంచి రూ,15 వేల వరకు వినియోగదారులే భరించాల్సి ఉంటుందని, ఒకసారి చెల్లించలేకపోతే 93 నెలలపాటు వాయిదాల పద్ధతిలో చెల్లించాలని ఆయన తెలిపారు. టీడీపీ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.



ఓరియంటేషన్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ విజయ సారథి, డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్, డాక్టర్ వీవీ రామచంద్రరావు

బయోటెక్నాలజీలో నూతన ఒరవడులపై అవగాహన

మొగల్రాజపురం ఆగస్టు 23: బయోటెక్నాలజీలో నూతన ఒరవడులపై విద్యార్థులకు నీతి ఆయోగ్ సభ్యుడు, సుజయ్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ వివరించారు. బయోటెక్నాలజీ, బోటనీ, జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో బీఎస్సీ ప్రథమ సంవ్సతరంలో చేరిన విద్యార్థులకు పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. జీవ సాంకేతిక శాస్త్రం అనువర్తనాలు, ఇటీవల కాలంలో వ్యాపిస్తున్న వివిధ రకాల క్యాన్సర్ రుగ్మతలు, జన్యుమార్పిడి ద్వారా క్యాన్సర్ నిర్మూలన, అత్యాధునిక చికిత్స విధానాలపై హైదరాబాద్ బయోగ్నసిస్ ల్యాబొరేటరీ వ్యవస్థాపకుడు డాక్టర్ వీవీ రామచంద్రరావు అవగాహన కల్పించారు. విశిష్ట అతిథిగా మస్కట్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ విజయసారథి విచ్చేశారు. జీవ శాస్త్ర పరిశోధనలో ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మనోరంజని, బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.లలితా ప్రియాంక, బోటనీ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్ నాయక్, శ్రావణి, శిరీష, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఏఎస్ఐ, హెచ్‌సీలు

విజయవాడ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల పదోన్నతి పొందిన ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబును కమిషనరేట్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఏఎస్ఐలు డేవిడ్‌రాజు, కోటేశ్వరరావు, దానస్, హెచ్‌సీలు రాజేంద్రప్రసాద్, ఆనంద్, ఇక్బాల్‌బాషా, రాజీ, శ్రీధర్, మధుబాబులు సీపీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారిని సీపీ అభినందించారు.

సీపీవోలో టంగుటూరి జయంతి

పోలీసు కమిషనర్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం నిర్వహించారు. సీపీ రాజశేఖరబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీపీ గౌతమి శాలి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో ఉద్యోగుల అభ్యర్థనలకు ప్రాధాన్యమివ్వాలి

కృష్ణలంక, ఆగస్టు 23: బదిలీల్లో ఉద్యోగుల అభ్యర్థనను పరిగణనలోనికి తీసుకోవాలని అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల అభ్యర్థనకు ప్రాధాన్యం ఇవ్వాలని రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎస్.శివరామప్రసాద్‌ను రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కేవీవీ నాగమురళి కోరారు. నగరంలోని రవాణాశాఖ కార్యాలయంలో శుక్రవారం శివరామప్రసాద్‌ను వారు కలిసి వినతి పత్రం అందించారు. అనారోగ్య సమస్యలతో కొంతమంది ఉద్యోగులు వారి కుటుంబసభ్యులు బాధపడుతున్నారని వారు కోరుకున్న హాస్పిటల్స్‌లో చికిత్స పొందేందుకు, వారు కోరుకున్న చోటకు బదిలీ చేయాలని కోరారు. ఏడాదిలోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లోని సంఘం కార్యవర్గసభ్యులైన ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను నిర్వహిస్తామని, ఉద్యోగులకు న్యాయం జరిగేలా పారదర్శకంగా బదిలీలు చేస్తామని సంయుక్త కమిషనర్ శివరామప్రసాద్ తెలిపారు.



రవాణా శాఖ సంయుక్త కమిషనర్ శివరామప్రసాద్‌కు వినతిపత్రమిస్తున్న రాజుబాబు, నాగమురళి

అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

● ఆర్పీఐ జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు డిమాండ్

ధర్నాచౌక్, ఆగస్టు 23: నగరంలోని అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) జాతీయ కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. నిందితులు ఏపార్టీకి చెందిన వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకుంటే జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి కొన్ని లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అచ్యుతాపురం ఫార్మా ఫ్యాక్టరీలో జరిగిన దుర్ఘటనపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు, క్షతగాత్రులకు రూ. 50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని మృతుల కుటుంబ సభ్యులకు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కృష్ణానదిపై అవనిగడ్డ నుంచి చెక్ డ్యామ్‌లు నిర్మించాలన్నారు. వీటిపై విన్నవించేందుకు సీఎం చంద్రబాబును కలిసే అవకాశం ఇవ్వాలని కోరారు. లేదంటే నిరాహార దీక్షలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి, వక్కదారు శ్రీనివాస్, షేక్ సంజీద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎసెన్షియా' యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలి

సీఐటీయూ డిమాండ్ ● లెనిన్ సెంటర్‌లో నిరసన

గవర్నర్‌పేట, ఆగస్టు 23: పద్దెనిమిది మంది కార్మికులను బలి తీసుకున్న ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యంపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మిక కుటుంబాలకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని డిమాండ్ చేస్తూ విజయవాడ లెనిన్ సెంటర్‌లో శుక్రవారం సీఐటీయూ నాయకులు ధర్నా చేశారు. ఫార్మా ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ఫ్యాక్టరీల్లో రక్షణ చర్యలు తీసుకోవాలని బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని కార్మిక సంఘాల నేతలు నినాదాలు చేశారు. ఫార్మా కంపెనీలో ప్రమాదానికి పూర్తి బాధ్యత దాని యాజమాన్యానిదే అని, భద్రతా చర్యలు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రమాదాల్లో కార్మికులు మరణిస్తే యాజమాన్యాలపై హత్యా నేరం కేసులు నమోదు చేసి అరెస్టులు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వం హడావుడి చేసి నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకోవడం కాకుండా ప్రమాదాలు నివారణపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. లాభాలే పరమావధిగా యాజమాన్యాలు వ్యవహరిస్తున్నాయన్నారు. కార్మికుల భద్రత, ప్రాణాల పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవడం లేదన్నారు. సీఐటీయూ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, కె.దుర్గారావు, ఈవీ నారాయణ, ఎం.సీతారాములు, సీహెచ్ దేవదాసు, జి.వెంకటరావు, వై.సుబ్బారావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.బాబూరావు, రమణ పాల్గొన్నారు.



మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని లెనిన్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి వ్యవస్థాపకుడు

గుళ్లపల్లి ఎన్ రావుకు స్వర్ణపతకం

పెనమలూరు, ఆగస్టు 23: తాడిగడప ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ గుళ్లపల్లి ఎన్ రావుకు ఐసీవో జూల్స్ ఫ్రాన్సువా సంస్థ స్వర్ణపతకాన్ని ప్రదానం చేసింది. ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఆప్తమాలజీ 2024 ఐసీవో అవార్డును ప్రదానం చేసిన సందర్భంగా శుక్రవారం ఎల్వీప్రసాద్ ఆస్పత్రిలో విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ పురస్కారం పొందిన మొదటి భారతీయ వైద్యుడు, ప్రపంచ వ్యాప్తంగా 11వ గ్రహీతగా గుళ్లపల్లి ఎన్ రావు గుర్తింపు పొందారన్నారు. 2013లో డాక్టర్ రావు జీవోహెచ్ న్యూమన్ పురస్కారం పొందారన్నారు.





మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ కంచర్ల అచ్యుతరావు


చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

ధర్నాచౌక్, ఆగస్టు 23: రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌కు నూతన చైర్మన్‌గా ఎన్నికైన కంచర్ల అచ్యుతరావు తెలిపారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీలో చిత్రపరిశ్రమ అభివృద్ధి చెందితే చలనచిత్ర కార్మికులకు మేలు జరుగుతుందని అచ్యుతరావు అన్నారు. రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధి చెందడానికి, 24 క్రాఫ్ట్ సభ్యుల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని అచ్యుతరావును చైర్మన్‌గా ఎన్నుకున్నామని ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా తెలిపారు. ఉపాధ్యక్షుడు కొండపల్లి, ప్రధాన కార్యదర్శి చవల మురళీకృష్ణ, ముత్తుకూరు నరసింహులు, నరసింహారావు, పోలుదాసు రంగనాయకులు, పూల శ్రీను, ముళ్లపూడి రాధ, చెన్నుపల్లి పుష్ప పాల్గొన్నారు.

యూనిట్ రక్తంతో మూడు

ప్రాణాలు కాపాడొచ్చు

వన్‌టౌన్, ఆగస్టు 23: "దేశంలో ప్రతి రెండు సెకన్లకు ఒకరికి రక్తం అవసరమవుతోంది. రక్తదానం ఎంతో విశిష్టమైనది. ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను రక్షిస్తుంది. ప్రతి ఒక్కరూ విద్యతో పాటుగా మానవీయ కోణంలో ఆలోచించాలి." అని గోరా టెక్నో హబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ జి.సమరం సూచించారు. పొట్టిశ్రీరాములు చల వాది మల్లికార్జునరావు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర వారం రక్తదాన ప్రాధాన్యంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో డాక్టర్ సమరానికి చిరు సత్కారం చేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టా అమర సుధీర్, జాయింట్ సెక్రటరీ గ్రంధి పవన్ కుమార్, కోశాధికారి కాజా రాఘవయ్య రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవో శ్రీకాంత్ రెడ్డి, కో ఆర్డినేటర్ బి.నవీన్‌కుమార్, డాక్టర్ పి.నరేష్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



రక్తదానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జి.సమరం

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని

యువకుడి ఆత్మహత్య

వన్‌టౌన్: విజయవాడ నగరపాలక సంస్థ పూల మార్కెట్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని శుక్రవారం రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు విజయవాడ రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ కె.వి.ప్రసాద్‌కు సమాచారం అందింది. దీంతో జీఆర్పీ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు, ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల లోపు వయస్సు ఉంటుందని, మృతుడి ఒంటి పై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, వైట్, సిమెంట్ కలర్ షర్ట్ ధరించి, కుడిచేతి మణికట్టు మధ్యలో పుట్టుమచ్చ ఉందని పోలీసులు తెలిపారు.



సాగు మీటర్లు వచ్చిన కంటైనర్ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

అదానీ స్మార్టు మీటర్లు వచ్చేశాయ్!

▸▸ సీపీడీసీఎల్ గోదాముకు చేరిన మీటర్లు.. నిరసన తెలిపిన సీపీఎం

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ సర్కారు కొనుగోలు చేసిన స్మార్టు మీటర్లు.. ఇప్పుడు కూటమి సర్కారు వచ్చాక వచ్చేశాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్ ఒత్తిడితో డిస్కమ్‌లు షిర్డీసాయి, అదానీ కంపెనీలకు చెందిన స్మార్ట్ మీటర్లను ఆర్డర్ చేసిన విషయం తెలిసిందే!. ఇప్పటికే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించేందుకు వీలుగా షిర్డీసాయి మీటర్లను సరఫరా చేసేసింది. పట్టణప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్టు మీటర్లను బిగించేందుకు అదానీ నుంచి 4కంటైనర్లలో శుక్రవారం సెంట్రల్ పవర్‌డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (సీపీడీసీఎల్)కు తీసుకొచ్చారు. విషయం తెలిసి సీపీఎం కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు నేతృత్వంలో ఆ పార్టీ నేతలు మీటర్లు దిగకుండా అడ్డుకునే ప్ర యత్నం చేశారు. కాగా.. త్వరలోనే వీటిని ప్రభుత్వ కార్యాలయాలకు, తర్వాత 200యూనిట్లు పైబడి వినియోగించే వినియోగదారుల ఇళ్లకు బిగించనున్నారు.

ఐదేళ్ల తర్వాత రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్

▸▸ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, ఆగస్టు 23: ఐదేళ్ల తర్వాత రాజకీయాల నుంచి రిటైర్‌మెంట్ తీసుకుంటానని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. శుక్రవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెం సచివాలయంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామాన్నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల ముందే రిటైర్‌మెంట్ తీసుకుంటానని స్పష్టం చేశారు.

వ్యాపార స్థాయి ఆధారంగా పీఏసీఎస్‌ల వర్గీకరణ

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వార్షిక వ్యాపార స్థాయి ఆధారంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యాపార స్థాయిని బట్టి పీఏసీఎస్‌లను ఏ++, ఏ+, ఏ, బీ, సీ, డీ కేటగిరిలుగా చేయనున్నది. రూ.100కోట్లపైన ఏ++, 50-100కోట్ల వరకు ఏ+, 10-50కోట్ల వరకు ఏ, 5-10కోట్ల వరకు బీ, 2-5కోట్ల వరకు సీ, 2కోట్లలోపు వ్యాపారం చేసే పీఏసీఎస్‌లను డీ కేటగిరిగా పరిగణించనున్నారు. సహకార సంఘాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, మానవ వనరుల విధానం(హెచ్‌ఆర్ పాలసీ)ని సవరించి, క్యాడర్ సిబ్బందిని సర్దుబాటు చేయాలని సహకారశాఖ ఉన్నధికారులు ప్రతిపాదించారు. వర్గీకరణ అమలుకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

పెద్దిరెడ్డి ఆక్రమించిన భూములు తిరిగి రైతులకివ్వాలి

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 982 ఎకరాల భూమిని బినామీల పేరుతో బదలాయించుకున్నారని, వాటిని తిరిగి రైతులకు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూ ఆక్రమణలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 28న విజయవాడలో భూ బాధితుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నిరసిస్తూ, అర్హులైన పేదలకు కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1 నుంచి 6 వరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎసెన్షియా పరిశ్రమ ఘటనలో ఆ కంపెనీ ఎండీని కనీసం అదుపులోనికి కూడా తీసుకోకపోవడంపై అనుమానాలున్నాయని పేర్కొన్నారు.

పలువురు జైలు అధికారుల బదిలీ

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జైళ్లశాఖకు సంబంధించి పలువురు అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పి పరిపాలనా సౌలభ్యం కోసం బదిలీలు చేస్తూ జైళ్లశాఖ డీజీ కుమార్ విశ్వజీత్ ఆదేశాలిచ్చారు. కడప సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతల్లో ఉన్న అడిషనల్ సూపరింటెండెంట్ ఐఎస్‌హెచ్ ప్రకాశ్‌ను నెల్లూరులోని ఏపీ స్టార్స్‌కు ప్రిన్సిపాల్‌గా ఆటాచ్ చేశారు. నెల్లూరు సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరరావును కడప సెంట్రల్ జైలుకు అటాచ్ చేస్తూ ఆయనకు కడప సెంట్రల్‌జైలు సూపరింటెండెంట్‌గా, కడప రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ పోస్టులో ఉన్న ఎం.వరప్రసాద్‌ను రిలీవ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. నెల్లూరులో ఏపీ స్టార్స్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఎస్.రాజారావుకు నెల్లూరు జైలు సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

రబీకి 22.30లక్షల టన్నుల ఎరువులు

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చే రబీ సీజన్ అవసరాల కోసం రాష్ట్రానికి 22.30లక్షల మెట్రిక్ టన్నుల రసాయన ఎరువుల్ని కేంద్రం కేటాయించింది. రబీలో 43.57లక్షల హెక్టార్ల వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగులో ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈమేరకు యూరియా 9.40, డీఏపీ2.00, కాంప్లెక్స్ 9.00, సూపర్‌ఫాస్పేట్ 1.00, పొటాష్ 0.90లక్షల టన్నుల ఎరువుల్ని రాష్ట్రానికి కేటాయించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కాగా, కేంద్ర వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ యోగిత రాణా శుక్రవారం రాష్ట్రాల వ్యవసాయశాఖ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు, నానో ఎరువుల్ని వాడేలా రైతుల్ని చైతన్యపర్చాలని ఆదేశించారు.

ఏపీ భవన్‌లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

న్యూఢిల్లీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఏపీ భవన్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రకాశం పంతులు చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా.. ఏపీ భవన్, తెలుగు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (తెవా) సంయుక్త ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.

సెప్టెంబరులోనే నామినేటెడ్ పదవుల భర్తీ!

▸▸ అర్హులకు నష్టంవాటిల్లకూడదన్న సీఎం ఆదేశాలతో మళ్లీ వడపోత

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల భర్తీకి కూటమి ప్రభుత్వం సెప్టెంబరులో శ్రీకారం చుట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఆగస్టులో వీటి భర్తీ చేపట్టే అవకాశం ఉందని ముందు ప్రచారం జరిగినా వివిధ కారణాల వల్ల ఆ ప్రక్రియ సెప్టెంబకుకు వాయిదా పడింది. మిత్రపక్ష పార్టీల నుంచి ప్రతిపాదనలు అందడంలో జరిగిన జాప్యం ఇందులో ఒక కారణంగా చెబుతున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయంలో పార్టీ కేంద్ర కార్యాలయం రూపొందించిన జాబితాలపై మరోసారి సమగ్ర పరిశీలన చేయాలని, అర్హులకు నష్టం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించడంతో ప్రతిపాదనలపై మళ్లీ వడపోత చేపట్టారు. మొదటి దశలో రెండు విభాగాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. మిత్ర పక్ష పార్టీలకు సీట్లు ఇచ్చిన చోట్ల.. త్యాగం చేసిన నేతలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ నాయకత్వం యోచిస్తోంది. అలాగే బీసీ వర్గాలకు చెందిన కార్పొరేషన్లు, ఫెడరేషన్ల పాలక మండళ్ల నియామకాల్లోనూ ప్రాధాన్యమివ్వనున్నారు. వీటిలో కొన్ని పదవులు జనసేన, బీజేపీ నేతలకు దక్కనున్నాయి.



వేణుగోపాలరావు పెరట్లో యాలకుల మొక్క. (ఇన్‌సెట్‌లో) మొక్క అడుగు భాగంలో విరగ్గాసిన యాలకులు

గిరిజన రైతు పెరట్లో విరగ్గాసిన యాలకులు

చింతపల్లి, ఆగస్టు 23: సుగంధ ద్రవ్య పంటలకు మన్యం అనుకూలంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం గొందిపాకలు పంచాయతీ యర్రవరంలో ఓ గిరిజన రైతు తన పెరట్లో యాలకుల మొక్కలు విరగ్గాశాయి. చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సుమారు 20 ఏళ్ల కిందటే యాలకులపై పరిశోధనలు నిర్వహించి ఈ పంట సాగుకు గిరిజన ప్రాంతం అనుకూలమని నిర్ధారించారు. ఇందులో భాగంగా ఉద్యాన పరిశోధన స్థానంలో కొన్నేళ్లుగా వీటిని సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యర్రవరానికి చెందిన గూడెపు వేణుగోపాలరాజు మూడేళ్ల కిందట బెంగళూరు నుంచి కొన్ని మొక్కలను తెచ్చి తన ఇంటి పెరట్లో నాటాడు. ప్రస్తుతం నాలుగు మొక్కలు పంట దశకు వచ్చాయి. సాధారణంగా నాటిన మూడేళ్ల తర్వాత ఒక్కో మొక్క నుంచి సుమారు 100 నుంచి 200 గ్రాముల యాలకుల దిగుబడి వస్తుంది. కానీ వేణుగోపాలరాజు పెరట్లో ఉన్న ఒక్కో మొక్కకు సుమారు 500 గ్రాములకుపైగా యాలకులు వచ్చాయి.

పురపాలనలో
చిత్రం.. భళారే విచిత్రం!

▸▸ కమిషనర్లు, అడిషనల్ డైరెక్టర్ల పోస్టుల్లో మాయాజాలం

▸▸ డైరెక్టరేట్‌లో ఏళ్లకేళ్లుగా అధికారుల తిష్ట

▸▸ బదిలీలంటే కమిషనర్లకే పరిమితం!

▸▸ ఇదీ మునిసిపల్ శాఖ పనితీరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇతర శాఖల్లోని ఉద్యోగులే ఇక్కడ కమిషనర్లు. ఇతర విభాగాల్లో కింది కేడర్‌లో ఉండే అధికారులు ఇక్కడ పెద్ద పోస్టుల్లో చేరిపోతారు. ఇక్కడుండే పెద్ద కేడర్ అధికారులు వారి కింద పని చేయాల్సి ఉంటుంది. దీన్నంతటినీ సరి చేయాల్సిన ప్రధాన కార్యాలయంలోని అధికారులూ ఆ తానులోని ముక్కలే అన్నట్లుంది పరిస్థితి. ఏళ్లకు ఏళ్లు డైరెక్టరేట్‌లో పాతుకుపోయిన కొందరు అధికారులు తమపై ఉన్న అవినీతి ఆరోపణలను క్లియర్ చేసుకునే పనిలో బిజీగా ఉన్నారు. ఇక కొత్తగా అవినీతి అంతు చూసేదెక్కడ? ఇదీ స్థూలంగా మునిసిపల్ శాఖలోని విచిత్ర పరిస్థితి.

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తున్న మున్సిపల్‌శాఖ... ప్రధాన కార్యాలయమైన డైరెక్టరేట్‌లో తిష్ట వేసిన అధికారులను మాత్రం కదిలించలేకపోతున్నదన్న విమర్శలున్నాయి. జేడీ కేడర్ పోస్టులో సీనియర్ అడిషనల్ డైరెక్టర్లు ఏళ్ల తరబడి తిష్ట వేశారని, దీంతో కమిషనరేట్ పనితీరులో ఎలాంటి మార్పులూ రావడం లేదన్న వాదనా ఉంది. కొందరు అధికారులు గతంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ కేసుల్లోనూ ఉన్నారు. ఆ కేసులను మాఫీ చేసుకునేందుకు డైరెక్టరేట్‌ను కేంద్రంగా చేసుకున్నారనే విమర్శలున్నాయి. ఓ అడిషనల్ డైరెక్టర్ అయితే 11 సంవత్సరాలుగా డైరెక్టరేట్‌లోనే జేడీగా బాధ్యతలు నిర్వర్తిస్తూ తనపై ఉన్న అభియోగాలను క్లియర్ చేసుకునే పనిలో ఉన్నారు. మరో ముగ్గురు ఇదే స్థాయి అధికారులు జేడీలుగా ఉన్నారు. వారికి కొన్నేళ్లుగా బదిలీలే లేవు. మరో ఇద్దరు ఏడీలు కూడా డైరెక్టరేట్‌లో ఒకే సీట్‌లో ఏళ్ల తరబడి పాతుకుపోయారు. పలువురు అడిషనల్ డైరెక్టర్ స్థాయి అధికారులైతే, తక్కువ కేడర్‌లో పనిచేసినా... డైరెక్టర్ కార్యాలయం సేఫ్‌గా భావిస్తున్నారు. పలు కార్పొరేషన్లలో ఐఏఎస్ అధికారులను కమిషనర్లుగా నియమించడం, కొన్ని పట్టణ అథారిటీలకు ఇతర శాఖల నుంచి డిప్యూటేషన్లపై వచ్చి వాలిపోవడంతో పదోన్నతి పొందిన అడిషనల్ డైరెక్టర్లు తక్కువ కేడర్‌లో పనిచేయాల్సి వస్తోంది.

పదోన్నతితో హోదా వచ్చింది.. పోస్టు రాలే!

గత ప్రభుత్వ హయాంలో పలువురు అధికారులు పైరవీలు చేసుకుని, డీపీసీ ఏర్పాటు చేసుకుని పదోన్నతులు పొందారు. కొత్తగా పట్టణాభివృద్ధి అథారిటీలు ఏర్పాటు చేసి, పోస్టులు క్రియేట్ చేశారు. దీంతో అడిషనల్ డైరెక్టర్ స్థాయి అధికారులుగా పలువురు పదోన్నతి పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందినా... ఆ పదవులు మాత్రం వారికి దక్కలేదని చెబుతున్నారు. కడప, తిరుపతి, రాజమండ్రి, కాకినాడ, కర్నూలులాంటి పలు కార్పొరేషన్ల కమిషనర్ పోస్టులు అడిషనల్ డైరెక్టర్, రీజినల్ డైరెక్టర్ స్థాయి పోస్టులైనప్పటికీ వాటిని ఐఏఎస్ అధికారులతో భర్తీ చేశారు. కొన్ని పట్టణ అథారిటీల్లో ఇతర శాఖలకు చెందిన అధికారులు డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తుండడంతో మున్సిపల్ శాఖలో పదోన్నతులు పొందినా ప్రయోజనం లేదని, ఆ పోస్టుల్లో ఇతరులు దూరిపోయారని పలువురు అధికారులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా గురువారం మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో ఏలూరు కార్పొరేషన్‌కు ఆర్‌డీ కేడర్ స్థాయికి బదులు గ్రేడ్-1 కమిషనర్‌ను నియమించారు. అలాగే, ఒంగోలు కార్పొరేషన్‌లో కూడా గ్రేడ్-1 అధికారిని ఆర్‌డీ కేడర్ పోస్టులో పెట్టారు. ఆయా కార్పొరేషన్ల స్థాయిని అనుసరించి కాకుండా ఇష్టారీతిగా అధికారులను నియమించారు. దీంతో మున్సిపల్ శాఖలో అధికారుల సర్దుబాటు గందరగోళంగా మారిపోయింది.

వేరే శాఖల నుంచి వచ్చినోళ్లే కమిషనర్లు!

ఇతర విభాగాల నుంచి అధికారులు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖలోకి ఇబ్బడిముబ్బడిగా వచ్చి చేరుతున్నారు. ఎమ్మెల్యేలతో సిఫారసులు చేయించుకుని మునిసిపల్ కమిషనర్లుగా చేరిపోతున్నారు. రాష్ట్రంలో దాదాపు 50 మంది ఇలా కమిషనర్లుగా చేరారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. నిజానికి కమిషనర్ల సర్వీస్ రూల్స్‌లో ఏ పోస్టు కూడా డిప్యుటేషన్‌పై నియమించాలని లేకపోయినప్పటికీ అందుకు విరుద్ధంగా నియామకాలు చేపడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు నెలవుగా మున్సిపల్‌శాఖ

మున్సిపల్ శాఖలో ఎన్ని తప్పులు జరిగినా పట్టించుకునే నాథుడే లేరని, ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి ఇక్కడ అవినీతికి పాల్పడి నేరుగా సొంత శాఖలోకి వెళ్లిపోతున్నారని, జవాబుదారీతనం పూర్తిగా లోపించిందని చెబుతున్నారు. సాధారణంగా ఎన్నికల సమయంలో, ఇతర తుఫానులు తదితర ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అవసరమైన చోట పునరావాస కార్యక్రమాలు చేపట్టేందుకు శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఇంజనీర్లు అడ్వాన్సులు తీసుకుంటారు. పనులు పూర్తయిన తర్వాత తిరిగి ఆయా బిల్లులు పూర్తిస్థాయిలో సమర్పించాలి. అలాంటి వారు బదిలీలు అయ్యేటప్పుడు వారు చేపట్టిన పనులు పోను మిగిలిన సొమ్ము తిరిగి చెల్లించాలి. అలా చేయకపోతే లాస్ట్ పే సర్టిఫికెట్(ఎల్‌పీసీ)లు ఇవ్వరు. అలా బదిలీ అయిన ఉద్యోగులు ఎల్‌పీసీలు లేకుండా జీతాలు పొందలేరు. పాలకొల్లులో ఓ ఇంజనీర్ ఎల్‌పీసీ లేకుండా బదిలీ కావడంతో రెండేళ్లుగా జీతం లేకుండానే పనిచేస్తున్నారు. డైరెక్టరేట్‌లో ఉన్న అధికారులు ఇవేమీ పట్టించుకోకపోవడం అసలు విషాదం. డైరెక్టరేట్ నిర్వహణ కోసం ప్రతి నెలా లక్షల్లో బిల్లులు పెట్టి అప్పనంగా ప్రభుత్వ సొమ్ము అక్రమంగా నొక్కేస్తున్నారని ఆరోపణలున్నాయి. ఇటీవల వచ్చిన కమిషనర్ అండ్ డైరెక్టర్ హరినారాయణ్ ఒక్క కాపీ బిల్లు తప్ప తన వద్దకు ఆఫీసు నిర్వహణకు సంబంధించి బిల్లులు రాకూడదని హెచ్చరించాల్సి వచ్చిందంటే ఇక్కడ ఏ మేరకు నిర్వహణా వ్యయం దోపిడీ జరుగుతుందో అర్థమవుతుంది.

'ఒక దేశం.. ఒకే పన్ను'తో మేలు

▸▸ సీఐఐ సదస్సులో సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): 'ఒక దేశం.. ఒకే పన్ను' విధానంతో వ్యాపారులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనర్ పి. ఆనంద్‌కుమార్ తెలిపారు. మధ్యస్థ పన్ను శ్లాబ్‌ను 14.5 శాతం నుంచి 11.5 శాతానికి తగ్గించడం దేశ ఆర్థికాభివృద్ధికి ఊతమిస్తుందన్నారు. సీఐఐ ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. జీఎస్‌టీ నమోదు ప్రక్రియ, మోసపూరితంగా పన్ను ఎగవేత పద్ధతుల నివారణ, క్రమబద్ధమైన రిటర్న్‌ల ఫైలింగ్, ఆడిట్ ప్రక్రియల గురించి ఆయన వివరించారు. సీఐఐ రాష్ట్రశాఖ మాజీ చైర్మన్ డి. రామకృష్ణ మాట్లాడుతూ.. జీఎస్‌టీ ఫైలింగ్, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్, ఇతర జీఎస్‌టీ ఆడిట్ సంబంధిత సమస్యలతో వ్యాపారులు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను, ఎంఎస్‌ఎంఈలపై జీఎస్‌టీ ప్రభావం, వీటివల్ల పరిశ్రమల నిర్వాహకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సర్కారు పచ్చజెండా

▸▸ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న488 పోస్టులకు నోటిఫికేషన్

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆ వెంటనే శుక్రవారం ఉదయం రాష్ట్ర వైద్య సేవల నియామక బోర్డు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 488 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. డైరెక్ట్, లేటరల్ ఎంట్రీ ద్వారా శాస్వత ప్రాతిపదికన సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో పోస్టులను భర్తీ చేయనున్నారు. పోస్టులు, అర్హత వివరాల కోసం డీఎంఈ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. వచ్చే నెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

29 నుంచి ఇంటర్ యూనిట్-2 పరీక్షలు

▸▸ కామన్‌గా నిర్వహించేలా చర్యలు

అమరావతి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ అంతర్గత పరీక్షల్లో మార్పులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 29 నుంచి యూనిట్-2 పరీక్షలు నిర్వహించాలని ఆదేశిస్తూ ఉన్నత విద్యామండలి టైమ్ టేబుల్‌ను విడుదల చేసింది. 29 నుంచి 31 వరకు ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయని తెలిపింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, కేజీబీవీలు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూల్స్, హైస్కూల్ ప్లస్‌లు, సాంఘిక, గిరిజన సంక్షేమ కాలేజీలు ఈ షెడ్యూలు పాటించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 1 నుంచి 24 వరకు బోధించిన పాఠ్యాంశాలపైనే ఈ పరీక్షలు ఉండాలని పేర్కొంది. ప్రతిరోజూ పరీక్షకు అరగంట ముందు ప్రశ్నపత్రాన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆన్‌లైన్‌లో పంపుతామని పరీక్షల కంట్రోలర్ సుబ్బారావు తెలిపారు. క్వార్టర్లీ పరీక్షల ముందు ఏడాది మొత్తానికి పరీక్షలపై టైమ్ టేబుల్ విడుదల చేస్తామని తెలిపారు.

రాష్ట్రమంతా క్లీన్ ఎనర్జీ

▸▸ భారీ లక్ష్యంతో ఇంధన శాఖ పాలసీ

▸▸ కరెంటు కొరత రాకుండా చర్యలు

▸▸ తీరప్రాంతమంతా సోలార్ ప్యానెళ్లు

▸▸ పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ

▸▸ సోలార్, విండ్ హైబ్రీడ్ దిశగా రాష్ట్రం

▸▸ 28న కేబినెట్ భేటీలో ఆమోదానికి చాన్స్

అమరావతి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): భారీ లక్ష్యాలతో రాష్ట్రమంతా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీని వినియోగించుకునేలా రాష్ట్ర ఇంధన శాఖ ఐదేళ్ల కాలానికి పాలసీని సిద్ధం చేసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద ప్రాథమిక సమీక్ష జరిగింది. చంద్రబాబు దిశానిర్దేశం మేరకు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీకి తుది మెరుగులు దిద్దారు. ఈ నెల 28వ తేదీన జరగనున్న కేబినెట్ సమావేశంలో ఈ పాలసీకి ఆమోదం పొందే వీలుంది. రాష్ట్రంలో 2030 నాటికి సోలార్ 38 గిగావాట్, విండ్ ఎనర్జీ 22 గిగావాట్, పంప్డ్ స్టోరేజీ హైడల్ విద్యుత్ 12 గిగావాట్, బ్యాటరీ స్టోరేజీ 25 గిగావాట్, గ్రీన్ హైడ్రోజన్ ఏడాదికి ఒక మెట్రిక్ టన్, బయో ఫ్యూయల్ రోజుకు 1500 కిలో లీటర్లు, 500 ఈవీ చార్జింగ్ స్టేషన్ల లక్ష్యంగా ఈ పాలసీని ఇంధన శాఖ రూపొందించింది. రాష్ట్రంలో 2029-30 నాటికి 1,16,004 ఎంయూ విద్యుత్ డిమాండ్ ఉంటుందని ఇంధన శాఖ అంచనా వేసింది. ఇందులో 65 శాతం వాటా గ్రీన్ ఎనర్జీదేనని వెల్లడించింది. 2029-30 నాటికి పీక్ డిమాండ్ 18,713 మెగావాట్లు ఉంటుందని ఇంధన శాఖ భావిస్తోంది. దీంతో కేవలం థర్మల్, హైడల్ విద్యుత్‌పైనే ఆధారపడకుండా సంప్రదాయేతర ఇంధన వనరులను జత చేయడం ద్వారా కరెంటుకు కొరత రాకుండా చూసుకోవచ్చన్న అభిప్రాయాన్ని ఇంధన శాఖ వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ దిశగా అడుగులు పడుతున్నాయి. విద్యుత్ రంగంలో రెన్యువబుల్ ఎనర్జీ వాటాను గణనీయంగా పెంచేలా కార్యాచరణను అమలు చేసేందుకు ఇంధన శాఖ సిద్ధమైంది. సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలను ప్రోత్సహించేలా ప్రత్యేక పాలసీని కూడా ఇంధన శాఖ తయారు చేసింది. జాతీయ రెన్యువబుల్ ఎనర్జీ, సెకీ, ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో వ్యవహరిస్తూ క్లీన్ ఎనర్జీ వాడకాన్ని విస్తరించాలని రాష్ట్ర ఇంధన శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిని పెంచేందుకు వీలుగా పెట్టుబడులు పెట్టే సంస్థలకు భూములు లీజుకు ఇప్పించే బాధ్యతను రాష్ట్ర న్యూ అండ్ రెన్యువల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించింది. రాష్ట్రంలో సోలార్ పార్కులను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఎకరాకు రూ.35,000 చొప్పున భూములు లీజుకు ఇస్తారు. ఈ లీజు మొత్తం ప్రతి రెండేళ్లకూ ఐదు శాతం మేర పెరుగుతుంది.



ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఏపీ

రాష్ట్రం ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా తయారయ్యేలా ఇంధన శాఖ పాలసీని రూపొందించింది. సోలార్ ప్యానల్, బ్యాటరీ తయారీ పరికరాల ముడి సరుకులన్నీ రాష్ట్రంలోనే లభ్యమవుతున్నాయి. ఈ ముడిసరుకంతా విదేశాలకు వెళ్లి అక్కడ ఎలక్ట్రానిక్ పరికరాలుగా తయారై రాష్ట్రానికి వస్తున్నాయి. వీటిని అధిక ధరలకు రాష్ట్రం కొనుగోలు చేస్తోంది. ఎలక్ట్రానిక్ రంగంలో ముడిసరుకును వినియోగించుకుని ఎలక్ట్రానిక్ వస్తువులను తయారు చేసి వాడటం వల్ల చౌకగా పరికరాలు లభిస్తాయని ఇంధన శాఖ భావిస్తోంది. ఇందులో భాగంగా 'ఎండ్ టు ఎండ్' పాలసీని రూపొందించింది. రాష్ట్రంలో బ్యాటరీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు.

- రాష్ట్రంలో సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను హైబ్రీడ్ విధానంలోనే ముందుకు తీసుకెళదామని చంద్రబాబు స్పష్టం చేశారు. విడివిడిగా సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లకు అనుమతులు ఇవ్వడం వల్ల ఇరవై నాలుగు గంటలూ విద్యుత్‌కు కొరత ఉండదు.
- రాష్ట్రంలో 974 కిలోమీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం ఉన్నందున తీరప్రాంతమంతా సోలార్ విద్యుదుత్పత్తి జరిగేలా సోలార్ ప్యానెళ్లను బిగించేలా కార్యాచరణ రూపొందించారు. అదేవిధంగా సముద్ర తీర ప్రాంతంలో విండ్ ఎనర్జీ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- వేస్ట్‌ల్యాండ్‌లో బయో ఇంధనోత్పత్తికి దోహదపడే చెట్లను, మొక్కలను పెంచేందుకు ప్రోత్సాహకాలు ఇస్తారు.
- ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లను అందుబాటులోకి తెస్తూనే చార్జింగ్ పాయింట్ల ద్వారా వినియోగించే విద్యుత్ చౌక ధరల్లో ఉండేలా విధానాన్ని రూపొందించారు.
- ఇబ్బడిముబ్బడిగా పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లను కేటాయించకుండా పీఎస్‌పీ, సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టులతో కూడిన హైబ్రీడ్ విద్యుదుత్పత్తి ప్లాంట్లు కేటాయించేలా పాలసీని రూపొందించారు.
- బ్యాటరీ చార్జింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడం వల్ల ఇంధనం నిల్వ చేస్తూనే అవసరమైనప్పుడు వినియోగించుకునే వీలుండేలా కార్యాచరణ తయారు చేశారు.
- ఈ నెల 28వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో రాష్ట్ర సోలార్, ఈవీ పాలసీలను ప్రవేశపెడతారు.

గర్భస్రావాల గుట్టు రట్టు

▸▸ ప్రపంచంలోనే తొలిసారి కొత్త జన్యు వ్యాధిని గుర్తించిన నిమ్స్, సీడీఎఫ్‌డీ పరిశోధకులు

▸▸ 'సెర్పిన్ ఎ11' జన్యు ఉత్పరివర్తనంతో అబార్షన్ ముప్పు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డౌన్స్ సిండ్రోమ్, క్లైన్‌ఫెల్టర్ సిండ్రోమ్.. ఇలా ప్రపంచంలో ఇప్పటిదాకా గుర్తించిన జన్యు వ్యాధులు దాదాపు 6000 నుంచి 7000 దాకా ఉంటాయని అంచనా! తాజాగా.. మన నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని మెడికల్ జెనెటిక్స్ విభాగం వైద్యులు, హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)' పరిశోధకులు కలిసి ఒక కొత్త జన్యువ్యాధిని గుర్తించారు. 'సెర్పిన్ ఏ 11' అనే జన్యువులో వచ్చే ఉత్పరివర్తనం కారణంగా ఈ వ్యాధి వస్తుందని.. దీనిబారిన పడిన శిశువుల శరీర కుహరాల్లో (ఉదర కుహరం, పిండ కోశం, నాసికా కుహరం, కర్ణభేరి కుహరం వంటివాటిలో), అవయవాల్లో నీరు చేరడం వల్ల వారు నెలలు నిండకుండానే చనిపోతారు. లేదా జన్మించిన కొద్దిరోజులకే ప్రాణాలు కోల్పోతారు. వరుస గర్భస్రావాలతో బాధపడుతున్న ఒక కుటుంబంపై చేసిన పరిశోధనలో.. ఈ జన్యు ఉత్పరివర్తనాన్ని నిమ్స్ వైద్యులు గుర్తించారు. ఆ కుటుంబానికి చెందిన మహిళకు వరుసగా రెండుసార్లు అబార్షన్ అయ్యింది. రెండోసారి గర్భస్రావం అనంతరం ఆ పిండాన్ని పరిశీలించగా.. గుండె, ఊపిరితిత్తుల భాగంలో బుడగల వంటివాటిని గుర్తించారు. వాటి కారణంగానే ఆ శిశువు చనిపోయినట్టు నిర్ధారించారు. నిమ్స్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ షాగున్ అగర్వాల్, నిమ్స్‌లో అదనపు ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్ బృందం అత్యాధునిక డీఎన్ఏ సీక్వెన్సింగ్ పరీక్షలు జరిపి.. ఆ పిండంలోని 'సెర్పిన్ ఏ 11' జన్యువులో ఒక ఉత్పరివర్తనం ఉన్నట్టు గుర్తించారు. దాన్ని గుర్తించడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఈ విషయం తెలియగానే సీడీఎఫ్‌డీ రంగంలోకి దిగింది. డాక్టర్ రష్నా భండారీ, డాక్టర్ అశ్విన్‌దలాల్ నేతృత్వంలోని సీడీఎఫ్‌డీ బృందం ఆ జన్యువుపై మరింత సమగ్ర అధ్యయనం చేసి.. దానిలో వచ్చే ఉత్పరివర్తనాల ప్రభావం శరీరంలోని పలు కణాలపై ఉంటుందని, దరిమిలా అది ప్రాణాంతకమైన 'లీథల్ సెర్పినోపతీ' అనే జన్యు వ్యాధికి కారణమవుతుందని తేల్చారు. వీరి పరిశోధన ఫలితం 'క్లినికల్ జెనెటిక్స్' జర్నల్ సెప్టెంబరు సంచికలో ప్రచురితమైంది. పదేపదే గర్భస్రావం అవడానికి కారణమయ్యే జన్యువ్యాధుల జాబితాలో ఈ లీథల్ సెర్పినోపతీని కూడా చేర్చారు. కాగా.. తమవద్దకు వచ్చిన మహిళ మూడోసారి గర్భం దాల్చినప్పుడు కూడా ఐదో నెలలోనే గర్భస్రావం అయ్యిందని డాక్టర్ షాగున్ అగర్వాల్ వివరించారు. ఆ పిండంపైన కూడా పరిశోధనలు చేయగా ఇదే ఉత్పరివర్తనం ఉన్నట్లు గమనించామని తెలిపారు. నాలుగోసారి మాత్రం ఆమెకు ఆరోగ్యవంతమైన శిశువు జన్మించినట్లు చెప్పారు. భార్యాభర్తలిద్దరిలో సెర్పిన్ 11 ఏ జన్యువులో సమస్య ఉండడం వల్లే ఈ సమస్యకు కారణమని వెల్లడించారు. పదేపదే గర్భస్రావం అవుతుంటే.. ఆ దంపతులు వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఇక.. భారతదేశంలో.. మరీ ముఖ్యంగా నిమ్స్‌లో జన్యువ్యాధులపై ప్రపంచానికి ఏ మాత్రం తీసిపోని స్థాయిలో అత్యాధునిక పరిశోధనలు జరుగుతున్నాయనడానికి ఇదే నిదర్శనమని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

అద్భుతమైన పరిశోధన: దామోదర రాజనర్సింహ

నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం, డైరెక్టర్ డాక్టర్ బీరప్ప పర్యవేక్షణలో అద్భుతమైన పరిశోధన చేశారని.. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు తెలిపారు. దీని వల్ల నిమ్స్‌కు అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠ, గుర్తింపు లభించబోతున్నాయని కొనియాడారు. నిమ్స్ మెడికల్ జెనెటిక్స్ విభాగం వైద్యబృందాన్ని డైరెక్టర్ బీరప్ప నగరి కూడ అభినందించారు.

రైతును వేధిస్తున్న యూరియా.. డీఏపీ కొరత

▸▸ 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు మాయం

▸▸ రికార్డుల్లో కనిపిస్తున్నా.. నిల్వలు మాత్రం లేవు

▸▸ ఇతర రాష్ట్రాలకు తరలిపోయినట్టు అనుమానాలు

గుంటూరు సిటీ, ఆగస్టు 23: యూరియా, డీఏపీ కొరతతో రాష్ట్రంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎరువులు పుష్కలంగా ఉన్నట్లు రికార్డులు చెబుతుండగా.. వాస్తవానికి ఎక్కడా నిల్వలు లేవు. కంపెనీల నుంచి ఆయా ప్రాంతాలకు సరఫరా అయిన ఎరువులను ఎప్పుడో అమ్మేశారు. కానీ ఈ సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయకపోవడంతో కేంద్రం కొత్త కేటాయింపులు జరపడం లేదని తెలుస్తోంది. ఒకవేళ అమ్మినట్లు చూపిస్తే దానికి సంబంధించిన సొమ్ము చెల్లించాల్సి వస్తుందన్న ఆలోచనతో గతంలో రైతు భరోసా కేంద్రాల్లో జరిగిన అమ్మకాలను కూడా ఆన్‌లైన్ చేయలేదని సమాచారం. ఇదే అదనుగా ఎరువుల కొరతను కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్న కొద్ది నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేసి, ధరలను ఆమాంతం పెంచేసి అమ్ముతున్నారు. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా, ప్రస్తుతం చాలాచోట్ల బస్తా రూ.350కు అమ్ముతున్నారు. డీఏపీ బస్తా రూ.1350కి అమ్మాల్సి ఉండగా,రూ.1450 వరకు అమ్ముతున్నారు. వ్యాపారులు మాత్రం అధికంగా అమ్మడానికి రవాణా ఖర్చులే కారణం అని చెబుతున్నారు. రాష్ట్రానికి వచ్చిన 1.70 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు మాయమైనట్టు రికార్డులను బట్టి తెలుస్తోంది. రాష్ట్రంలో గత ఏడాది కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయినప్పటికీ ఎక్కువ మొత్తంలో ఎరువులు అమ్మకాలు జరగడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక్కడి ఎరువులు సరిహద్దు రాష్ట్రాలకు వెళ్లాయన్న కోణంలో విచారణ జరుపుతున్నారు. కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణ రాష్ట్రాల్లో పంటల సాగు ముందే ఆరంభం కావడంతో మన ఎరువులు అటువైపు వెళ్లి ఉంటాయని భావిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో యూరియా, డీఏపీ కొరత ఏర్పడింది. కంపెనీల నుంచి వచ్చిన ఎరువులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో తలెత్తిన కొరత వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. నీళ్ల కొరత లేదన్న ఆలోచనతో వరి సాగుకు ఎక్కువ మంది రైతులు మొగ్గుచూపుతున్నారు. యూరియా, డీఏపీ కోసం ట్రేడర్లను సంప్రదించడంతో అక్కడ ఎరువులు లేవన్న సమాధానం వస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎరువుల కొరత ఎక్కువగా ఉంది. డెల్టా రైతులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. డెల్టా ప్రాంతంలో వరికి రెండో విడత వేసేందుకు ఎరువులు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. పల్నాడు జిల్లాలో పరిస్థితి మరీదారుణంగా ఉందని రైతులు చెబుతున్నారు.

నానో గోలతో.. రైతులకు ఇబ్బందులు

యూరియా, డీఏపీ ఎరువులు కావాలని షాపునకు వెళ్లిన రైతులకు కొత్త అనుభవం ఎదురౌతోంది. 10 టన్నులు యూరియా కొంటే నాలుగు నానో ఎరువుల కేసులు కొనాల్సిందేనని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో కేంద్రం యూరియా వాడకాన్ని తగ్గింగి నానో ఎరువు అమ్మేందుకు కేంద్ర ప్రభుత్వమే ఈ నిబంధన పెట్టినట్లు వ్యాపారులు, అధికారులు చెబుతున్నారు.

నిమ్స్‌లో మాస్టర్ ఆఫ్ ఫిజియోథెరపీ



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- మాస్టర్ ఆఫ్ ఫిజియో థెరపీ(ఎంపీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో మస్క్యులోస్కెలెటల్ సైన్సెస్, కార్డియోవాస్క్యులర్ అండ్ పల్మనరీ సైన్సెస్, న్యూరో సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో అయిదు చొప్పున మొత్తం 15 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఇన్ ఫిజియోథెరపీ(బీపీటీ) ఉత్తీర్ణులై ఉండాలి. 2024 ఆగస్టు 31 నాటికి ఆరు నెలల ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి. ఏ ఇతర కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండకూడదు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 22 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. నిమ్స్ ఉద్యోగులకు వయోపరిమితి నిబంధనలు వర్తించవు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి ఎంచుకొన్న స్పెషలైజేషన్‌కు సంబంధించి బేసిక్ అండ్ క్లినికల్ సైన్సెస్, బయోమెకానిక్స్, ఫిజియోథెరపీ టెక్నిక్స్, క్రిటికల్ కేర్, రీహాబిలిటేషన్ అంశాల నుంచి 30 ప్రశ్నలు; జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, గైనకాలజీ, ఎలక్ట్రోథెరపీ, ఎక్సర్‌సైజ్ థెరపీ, ఫస్ట్ ఎయిడ్, సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్, రేడియాలజీ, సోషియాలజీ, సైకాలజీ వంటి జనరల్ క్లినికల్ సైన్సెస్ అంశాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ బీపీటీ సిలబస్ ప్రకారం ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 60. పరీక్ష సమయం గంట. ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అభ్యర్థులను కౌన్సెలింగ్‌కు పిలుస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** సెప్టెంబరు 26 నుంచి
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** అక్టోబరు 4
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 7
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** అక్టోబరు 11
- **కౌన్సెలింగ్ లెటర్స్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్ తేదీ:** అక్టోబరు 22
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 28 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

పీహెచ్‌డీ

జేఎన్‌టీయూ అనంతపురంలో

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజెంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ

రీసెర్చ్ సెంటర్లు
- జేఎన్‌టీయూఏ అనుబంధ కళాశాలలు
- కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ - వైఎస్సార్ జిల్లా
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ - తిరుపతి
- జీ. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్-కర్నూలు
- రాజీవ్‌గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ - నంద్యాల
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ - చిత్తూరు
- శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ - చిత్తూరు
- వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - చిత్తూరు
- శాంతిరామ్ ఇంజనీరింగ్ కాలేజ్ - నంద్యాల
- రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ - అనంతపురం
- శ్రీ వేంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ - చిత్తూరు
- సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ - తిరుపతి
- శ్రీ పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ - తిరుపతి

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.5,000
- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూఏ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌లో

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ(జేఎన్ఏఎఫ్ఏయూ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాలు అందుబాటులో ఉన్నాయి. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ఆర్కిటెక్చర్ 5, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ 2, పెయింటింగ్ 2



అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. యూజీసీ నెట్/సీఎస్ఐఆర్ నెట్/గేట్/సీడ్ అర్హత ఉన్నవారికి ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. వీరు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

రిటెన్ టెస్ట్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. రీసెర్చ్ ఆప్టిట్యూడ్ నుంచి 75, నాలెడ్జ్ ఆఫ్ సబ్జెక్ట్ స్పెషలైజేషన్ నుంచి 75 చొప్పున మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 150. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు వచ్చిన వారిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్‌కు 70 శాతం, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులకు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **కొరియర్/రిజిస్టర్డ్ పోస్ట్/వ్యక్తిగతంగా దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **చిరునామా:** డైరెక్టర్, అడ్మిషన్స్, జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీ, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ - 500028
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

జయశంకర్ వర్సిటీలో డిగ్రీ కౌన్సెలింగ్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న బీటెక్ ప్రోగ్రామ్‌లలో ఫార్మర్స్ కోటా సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో నాన్ రూరల్ అండ్ రూరల్ కోటా సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్(ఫార్మర్స్ కోటా), సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. వీటిలో ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 28న ఉదయం పది గంటలకు
- **వేదిక:** ఎగ్జామినేషన్ సెంటర్, వాటర్ టెక్నాలజీ సెంటర్ ఎదురుగా, పీజేటీఎస్ఏయూ, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

జాబ్ కార్నర్

ఏపీలో సీనియర్ రెసిడెంట్, సూపర్ స్పెషాలిటీ పోస్టులు

ఖాళీలు 997

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్... ఏపీ డీఎంఈ పరిధిలోని ప్రభుత్వ వైద్య, దంత వైద్య కళాశాలల్లోని వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
1. సీనియర్ రెసిడెంట్(క్లినికల్): **425 పోస్టులు**
2. సీనియర్ రెసిడెంట్(నాన్ క్లినికల్): **479 పోస్టులు**
3. సూపర్ స్పెషాలిటీ: **93 పోస్టులు**

స్పెషాలిటీలు: జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, అనస్తీషియా, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, రెస్పిరేటరీ మెడిసిన్, సైకియాట్రీ, రేడియో డయాగ్నోసిస్/రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, డెంటిస్ట్రీ/డెంటల్ సర్జరీ, రేడియోథెరపీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, న్యూక్లియర్ మెడిసిన్, అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రో బయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్, కార్డియాలజీ, ఎండోక్రైనాలజీ, మెడికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ, న్యూరాలజీ, కార్డియో థొరాసిక్ సర్జరీ/సీవీటీ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ, న్యూరో సర్జరీ, నెఫ్రాలజీ, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, నియోనాటాలజీ.

అర్హత: మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ(ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీఎస్) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 44 ఏళ్లు మించకూడదు

జీతభత్యాలు: నెలకు రూ.70,000 ఉంటుంది.

పదవీకాలం: ఎంపికైన అభ్యర్థులు ఏడాది పని చేయాల్సి ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: పోస్టు గ్రాడ్యుయేషన్ ఎగ్జామ్ మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: ఓసీ అభ్యర్థులు రూ.1000. బీసీ, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 27

వెబ్‌సైట్: dme.ap.nic.in/

నార్త్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 4096



న్యూఢిల్లీలోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- నార్త్ రైల్వే... ఎన్ఆర్ పరిధిలోని డివిజన్/వర్క్‌షాప్/యూనిట్లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఆర్ఆర్‌సీ వర్క్‌షాప్‌లు: క్లస్టర్ లఖ్‌నవూ, క్లస్టర్ అంబాలా, క్లస్టర్ మొరాదాబాద్, క్లస్టర్ ఢిల్లీ, క్లస్టర్ ఫిరోజ్‌పూర్.

అర్హత: పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: మెకానికల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎంవీ, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్, వెల్డర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, ట్రిమ్మర్, రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హేమర్‌మన్, టర్నర్, క్రేన్ ఆపరేటర్, స్టెనోగ్రాఫర్ తదితరాలు.

వయోపరిమితి: 2024 సెప్టెంబరు 16 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: సెప్టెంబరు 16

వెబ్‌సైట్: http://https//www.rrcnr.org/

బెల్‌లో హవల్దార్ ఖాళీలు

ఖాళీలు 15

బెంగళూరులోని ప్రభుత్వ రంగ సంస్థ- భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్)... శాశ్వత ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణత, నిర్దిష్ట శారీరక ప్రమాణాలతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 43 ఏళ్లు మించకూడదు. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, నిర్దిష్ట శారీరక ప్రమాణాలు తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డీజీఎం(హెచ్‌ఆర్), బెల్, జలహళ్లి, బెంగళూరు చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 3

వెబ్‌సైట్: https://bel-india.in/

BHARAT ELECTRONICS
QUALITY. TECHNOLOGY. INNOVATION

ఎన్‌సీసీఆర్‌లో ప్రాజెక్ట్ సైంటిస్టులు



ఖాళీలు 42

చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్(ఎన్‌సీసీఆర్)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రాజెక్టు సైంటిస్ట్-1/2/3: **31 పోస్టులు**
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **10 పోస్టులు**
3. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1 పోస్టు**

విభాగాలు: మెరైన్ బయాలజీ, రిమోట్ సెన్సింగ్ జీఐఎస్, డేటా బేస్, కంప్యూటర్ సైన్స్, కోస్టల్ హజార్డ్ మ్యాపింగ్ అండ్ మాడ్యులింగ్, కోస్టల్ డైనమిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెరైన్ స్ట్రక్చర్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ, గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు ప్రాజెక్ట్ సైంటిస్ట్-3 పోస్టుకు రూ. 78,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్-2 పోస్టుకు రూ.67,000; ప్రాజెక్ట్ సైంటిస్ట్-1 పోస్టుకు రూ.56,000; జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.42,000; సీనియర్ టెక్నికల్ పోస్టుకు రూ.35,400.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఎన్‌సీసీఆర్, ఎన్ఐఓటీ క్యాంపస్, రెండో అంతస్తు, వెలచ్చేరి- తాంబరం మెయిన్ రోడ్, పల్లికరణై, చెన్నై చిరునామాకు పంపించాలి.

చివరి తేదీ: సెప్టెంబరు 6

వెబ్‌సైట్: https://www.nccr.gov.in/

లిటిల్స్




చిలుక దివ్యదృష్టి

అక్బర్ చక్రవర్తికి రోజూ నిద్ర పోయే ముందు తన వేళ్లకున్న ఉంగరాలు తీసి, పక్కనున్న బల్ల మీద ఉంచి తెల్లారిన తరువాత మరలా వాటిని తీసి అలంకరించుకోవడం అలవాటుగా ఉండేది.


ఒక రోజు ఉదయం చక్రవర్తి నిద్ర లేచి చూసేసరికి ఆయనకు ఎంతో ఇష్టమైన ఒక ఉంగరం మాయమైపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా కనిపించలేదు. రాజుగారి పడకగది లోనుంచే ఉంగరం కనిపించకుండా పోయిందంటే, అది ఖచ్చితంగా ఎవరో రాజు గారికి దగ్గరగా మసలుకునే సేవకులే దొంగిలించి ఉంటారు అనుకున్నారు అందరూ. ఏం చేయాలో తెలియకచక్రవర్తి వెంటనే బీర్బల్‌కి కబురు పంపాడు. బీర్బల్ వస్తూ తనతో పాటు ఒక చిలుకను తీసుకువచ్చి, మహారాజా.. ఈ చిలుక దొంగ ఎవరో కనిపెట్టగలదు అన్నాడు. దానికి చక్రవర్తి ఈ చిలుక జ్యోతిష్యం కోసమా నేను నిన్ను పిలిపించింది? అని కోపంగా అడిగాడు. దానికి బీర్బల్ 'లేదు మహారాజా ఈ చిలుకకు దివ్యదృష్టి ఉంది ఇది ఉంగరం తీసిన మనిషిని చూడగానే గుర్తు పట్టి దొంగ అని అరుస్తుంది. అన్నాడుఅది విన్న చక్రవర్తి సరే అయితే ఈ చిలుక నా ఉంగరాన్ని దొరికేలా చేస్తే దానికి,నీకు మంచి బహుమానాలు ఇస్తాను అన్నాడు.

కాసేపటి తర్వాత అక్కడ పనిచేసే ఉద్యోగులు అందరినీ పిలిపించి గది తలుపులు మూయించమని అడిగాడు బీర్బల్. చక్రవర్తి అలాగే ఆజ్ఞ ఇచ్చాడు. అందరూ వచ్చిన కొంత సేపటికి చిలుక బీర్బల్ దగ్గరనుండి గాలిలోకి ఎగిరి, దొంగ దొంగ అని అరిచింది అక్కడున్న పనివారిలో ఒకరు రాజు కంట పడకుండా తప్పించుకుపోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అతన్ని చూపించి, బీర్బల్ ఇదిగో మహారాజా మీ ఉంగరం తీసుకున్న దొంగ అని అతన్ని పట్టించాడు అది విన్న చక్రవర్తి 'ఇపుడు చెప్పు ఈ చిలుకకు దివ్యదృష్టి ఎలా వచ్చింది? దొంగను ఎలా గుర్తు పట్టగలిగింది?' అని అడిగాడు. దానికి బీర్బల్ "దివ్య దృష్టీ లేదు మరేమీ లేదు మహారాజా దీనికి దొంగ దొంగ అనే ఒక్క మాటే నేర్పాను. దీన్ని నా చేతి మీద కూర్చున్నపుడు నిమురుతూ నెమ్మదిగా గిల్లాను.అది అలవాటుగా లేచి దొంగ అని అరచింది. ఆ మాట వినగానే ఎవరైతే ఉలిక్కిపడి సర్దుకోవడానికి, పారిపోవడానికి ప్రయత్నిస్తారో వారే దొంగ కదా అలా మీ దొంగను కనుక్కున్నాం అన్నమాట' అని చెప్పాడు. బీర్బల్ హాస్య చతురతకు నవ్వుకున్నా, అతని యుక్తిని మెచ్చుకుని, ముందు వాగ్దానం చేసిన ప్రకారం మంచి బహుమతులు ఇచ్చి పంపాడు చక్రవర్తి.



7 తేడాలు గుర్తించండి

కుక్కలు, పిల్లులు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడ ఏది





దారి చూపెట్టండి

డైలీ సుడోకు - 392

	6	4			5
3				4	
	5				1
2			4	1	

సుడోకు - 391 సమాధానం

3	8	6	2	9	4	5	7	1
2	1	7	8	6	5	3	4	9
4	5	9	7	1	3	8	2	6
6	7	5	1	3	9	2	8	4
1	3	8	6	4	2	9	5	7
9	4	2	5	8	7	1	6	3
5	9	4	3	7	8	6	1	2
7	2	1	9	5	6	4	3	8
8	6	3	4	2	1	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.